


తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 10.01.2026 | సంపుటి : 12 సంచిక : 172 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## హైకోర్టులో డీజీపీ శివధర్‌రెడ్డికి ఊరట

- నియామకంపై సవాల్ పిటిషన్ కొట్టివేత
- 4 వారాల్లో పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ధర్మాసనం ఆదేశం

**హైదరాబాద్**(జనంసాక్షి): తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయన నియామకాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రెగ్యులర్ డీజీపీ నియామకానికి సంబంధించిన ప్రక్రియను నాలుగు వారాల్లో ముగించాలని యూపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నియామక ప్రక్రియపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.డీజీపీగా శివధర్ రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ సామాజిక కార్యకర్త ధన్ గోపాల్ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డీజీపీ నియామక ప్రక్రియ జగలేదని.. శివధర్ రెడ్డిని నియమిస్తూ జారీ చేసిన జీఓను రద్దు చేయాలని కోరారు. నిబంధనల ప్రకారం డీజీపీ పదవీ విరమణ పొందే సమయానికి మూడు నెలల ముందే యూపీఎస్సీకి ప్యానెల్ పంపాల్సి ఉంటుందన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఐదుగురు పేర్లతో కూడిన జాబితాను పంపిస్తూ వస్తున్నామని.. కానీ యూపీఎస్సీ క్లారిఫికేషన్ కోసం తిప్పి పంపిందని అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్ 31న కూడా మరోసారి జాబితా పంపామని.. సుప్రీంకోర్టు అనుమతి తీసుకోవాలంటూ యూపీఎస్సీ ఆ జాబితాను తిప్పి పంపిందని ఏజీ కోర్టుకు తెలిపారు. ఆ జాబితాను పరిగణనలోకి తీసుకునే విధంగా యూపీఎస్సీని ఆదేశించాలని ఏజీ కోరారు.

మిగతా 2లో..



# మాకు నీళ్లే కావాలి పంచాయతీ వద్దు

### వివాదాలు కాదు.. పరిష్కారం ముఖ్యం
### జలవివాదాలతో రాజకీయ ప్రయోజనాలు కోరుకోం: సీఎం రేవంత్

> మీకు నీళ్లు కావాలా? వివాదం కావాలా? అంటే నేను నీళ్లు కావాలని కోరుకుంటా. నీళ్ల విషయంలో మనం రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి.పక్క రాష్ట్ర ముఖ్యమంత్రికి నేను విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణానదీలో ఉన్న పాలమూరు రంగారెడ్డి, కేఎల్‌ఐ, డిండి, ఎస్‌ఎల్‌బీసీ, నెట్టెంపాడు ప్రాజెక్టులు అనుమతులకు అడ్డంకి పెట్టవద్దు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టుల అనుమతులకు సహకరించండి. అడ్డంకి పెట్టడం వల్ల పర్యావరణ, సీడబ్ల్యూసీ అనుమతులకు ఇబ్బందిగా మారింది. రుణాలు మంజూరు కాకపోవడం, కేంద్రసహకారం లేకపోవడం వల్ల రాష్ట్రంపై ఆర్థికభారం పడుతోంది. మాకు సహకరిస్తే మేము కూడా సహకరిస్తాం. మేము వివాదాలు కోరుకోవట్లేదు.. శాశ్వత పరిష్కారం కోరుతున్నాం"
> - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

- ఉమ్మడి రాష్ట్రంలోప్రాజెక్టులకు అడ్డు పడకండి
- జలవివాదాలతో రాజకీయ ప్రయోజనం కోరుకోం
- మన సమస్యలను మనమే కలిసి పరిష్కరించుకుందాం
- ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ సూచన
- కృష్ణా జలాలపై ఏపీతో చర్చలకే ప్రాధాన్యం
- రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవం

**హైదరాబాద్**(జనంసాక్షి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించు కోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. లో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు

మిగతా 2లో..



## వ్యవసాయ యాంత్రీకరణ పున:ప్రారంభిస్తాం

### 50% సబ్సిడీతో యంత్రాలను అందిస్తాం : మంత్రి ఉత్తమ్
### తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాలో రాజీలేదని స్పష్టం

**కోదాడ జనవరి9(జనంసాక్షి):** తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.కోదాడ పట్టణం లో శుక్రవారం రూ.08 కోట్లతో నిర్మిస్తున్న ఆర్ ఱ బి గెస్ట్ హౌస్ డివిజన్ కార్యాలయం,రూ 25 కోట్ల తో నిర్మిస్తున్న కోర్టు బిల్డింగ్ ,రూ 5.10 కోట్లతో నిర్మిస్తున్న ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం పనుల పురోగతిని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తో కలిసి పరిశీలించి పనులు నాణ్యత తో నిర్మిస్తూ, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కోదాడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు లో మంత్రి మాట్లాడుతూ కృష్ణ నది నీటి పంపకాల్లో గత ప్రభుత్వం తెలంగాణ కు 34 % (299 టిఎంసిలు), ఆంధ్రకు 66 % (512 టి ఎం సి లు ) అంగీకారం చేసుకోవటం వల్ల ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలు నష్టపోయాయని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుండి కృష్ణ జలాలో 71 % తెలంగాణ కు దక్కేలా పోరాడుతున్నామని,గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో 17 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్లో నీటి పారుదల రంగానికి 1.83 లక్షల కోట్ల కేటాయించినప్పటికి కృష్ణ నది పై తలపెట్టిన పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా,

మిగతా 2లో..



## గ్లోబల్ డెస్టినేషన్‌గా తెలంగాణ

- 2047 లక్ష్యంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- క్యూర్-ప్యూర్-రేర్‌తో డెవలప్‌మెంట్ మోడల్
- గ్లోబల్ ఫ్యూచర్ సిటీగా హైదరాబాద్
- సుజన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



## హామీలు మరిచారు

### ప్రభుత్వం భూములు లాక్కోవడం ప్రభుత్వానికి అలవాటుగా మారింది

**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోందని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఉర్దూ వర్సిటీ భూములకు సంబంధించి ప్రభుత్వ నోటీసుల నేపథ్యంలో నందినగర్‌లో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. "ప్రభుత్వం భూములు లాక్కోవడం ఇదే మొదటిసారి కాదు.జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నుంచి 100 ఎకరాలు తీసుకున్నారు. విద్యార్థులు పోరాడినా ఆందోళనను అణచివేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివ ర్సిటీలోనూ ఇదే విధమైన భూదందా చేశారు. అక్కడ 400 ఎకరాలు తీసుకునేందుకు యత్నించారు. సుప్రీంకోర్టు సీజే సుమోటోగా తీసుకుని ఆదేశాలు ఇచ్చేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు"అని కేటీఆర్ అన్నారు.

## త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం

### నిరుద్యోగులెవరూ ఆందోళన చెందొద్దు

- నిరుద్యోగుల పట్ల 'బీఆర్ఎస్'ది కపట ప్రేమే..
- మీ మొసలి కన్నీరు చూసి తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది
- అప్పుడు 'అశోక్ నగర్ సెంట్రల్ లైబ్రరీ' గుర్తుకు రాలేదా..? : మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్(జనంసాక్షి):**జాబ్ క్యాలెండర్‌పై మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగులెవరూ ఆందోళన చెందొద్దని.. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని తెలిపారు. శుక్రవారం ఐఐటీ హైదరాబాదులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీధర్ బాబు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.తెలంగాణలో నిరుద్యోగ సమస్యపై రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి వ్యవస్థలను నిర్వీర్యం చేసి, నిరుద్యోగుల జీవితాలను అంధకారం చేసిన వారు నేడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులు పడిన అష్టకష్టాలను మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. "అశోక్ నగర్ సెంట్రల్ లైబ్రరీ సాక్షిగా పదేళ్లు నిరుద్యోగులను వంచించిన చరిత్ర మీది కాదా? నాడు నోటిఫికేషన్ల పేరుతో ఊరించి, పరీక్షల పేరుతో వేధించి, నిరుద్యోగుల యవ్వనాన్ని రోడ్ల పాలు చేసింది మీరు కాదా?" అని ప్రశ్నించారు. టీజీపీఎస్సీ క్వశ్చన్ పేపర్లను

మిగతా 2లో..

## కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం




### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం,జనవరి9(జనంసాక్షి):**పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను దీవించినట్లే.. పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. పంచాయితీలు, పురపాలికలు బలపడాలంటే అధికార పార్టీ అభ్యర్థులు ఉండాలన్నారు. ఇల్లందు పట్టణంలో నూతన రహదారులు, కాలువల నిర్మాణాలకు శుక్రవారం మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గంలోని నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటే గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో పర్యటించి, జీవో 76కు సంబంధించిన క్రమబద్ధీకరణ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో 4, తెలంగాణలో 2

### ఈ ఏడాది ఖాళీకానున్న రాజ్యసభ స్థానాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఈ ఏడాది రిరైట్ అవుతున్న రాజ్యసభ సభ్యుల జాబితాను శుక్రవారం రాజ్యసభ సచివాలయం విడుదల చేసింది. తెలంగాణలో భారాస సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్‌మను సింఘ్వీ ఏప్రిల్ 9న రిటైర్ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వైకాపా ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, తెదేపా సభ్యుడు సానా సతీష్‌ల పదవీకాలం ఈ ఏడాది జూన్‌తో ముగుస్తుందని రాజ్యసభ సచివాలయం తెలిపింది. ఈమేరకు అన్ని రాష్ట్రాల నామినేటెడ్ సభ్యుల పదవీకాలం వివరాలను వెల్లడించింది.





## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమా

- ఈ నిర్ణయంతో 5.14 లక్షల మంది ఉద్యోగ కుటుంబాలకు ప్రయోజనం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్(జనంసాక్షి):**రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ 1.02 కోట్ల రూపాయల ప్రమాద బీమాను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా


మిగతా 2లో..

## ముందు మీ దేశంపై దృష్టి పెట్టండి

### ట్రంప్ తీరుపై ఖమేనీ



**టెహ్రాన్(జనంసాక్షి):**ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చోటుచేసుకుంటున్న అల్లర్లపై ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. తమ దేశంలో ఆందోళనకారులను హెచ్చరించిన ఆయన.. విదేశీ శక్తుల చేతుల్లో కిరాయి సైనికుల్లా వ్యవహరించే వారిని సహించే ప్రసక్తే లేదన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశిస్తూ.. ఇతర దేశాలకు చెప్పే ముందు సొంత దేశంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇతర దేశాధ్యక్షుడిని సంతోష పెట్టేందుకు సొంత వీధులను నాశనం చేసుకుంటున్నారంటూ ఆందోళనకారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.ప్రవాసంలో తలదాచుకున్న యువరాజు రెజా పహ్లావి (గతంలో అమెరికా మద్దతుతో దేశాన్ని పాలించిన 'షా' వారసుడు) ఇచ్చిన పిలుపు మేరకు ఇరాన్‌లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. గురువారం మొదలైన ఈ నిరసనలు శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను ప్రభుత్వం నిలిపేసినప్పటికీ ఆందోళనకారులు పెద్ద ఎత్తున పాల్గొనడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే స్పందించిన సుప్రీం లీడర్.. యువత ఏకతాటిపై ఉండాలని, దేశం ఐకమత్యంగా ఉన్నప్పుడే ఎలాంటి శత్రువునైనా ఎదుర్కోవచ్చన్నారు.



## 28 నుంచి బడ్జెట్ సమావేశాలు

### తేదీలు ఖరారు చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర బడ్జెట్ తేదీలు ఖరారయ్యాయి. జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. తొలి దశ సమావేశాలు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో దశ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.పార్లమెంట్ ఉభయ సభలు సమావేశం అయ్యేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన తేదీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తొలి రోజైన జనవరి 28న రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్నారు. ఏటా మాదిరిగానే ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను సమర్పించనున్నారు. ఆ రోజు ఆదివారం కావడంతో సమావేశ తేదీలపై గత కొన్ని రోజులుగా సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వ తాజా ప్రకటనతో ఆ చిక్కుముడి వీడింది.

## రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

### ఈడీ చర్యలపై మమత నిరసన ప్రదర్శన • విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఈడీ పిటిషన్

**కోల్‌కతా(జనంసాక్షి):**ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం

మిగతా 9లో..





## మోదీ,ట్రంప్ ఎనిమిది సార్లు మాట్లాడుకున్న సంగతేంటి?

### వాణిజ్య ఒప్పందం గురించి అమెరికా వ్యాఖ్యలపై భారత్ కౌంటర్

**న్యూయార్క్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా మాట్లాడకపోవడమే వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చకపోవడానికి కారణమని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఇరుదేశాలకు సంబంధించి వివిధ అంశాల్లో గతేడాది ప్రధాని మోదీ, ట్రంప్ ఎనిమిది సార్లు ఫోన్‌లో సంభాషించుకున్నారని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అదనపు ఆంక్షలు విధించే బిల్లుపైనా అవగాహన ఉందని, పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది."అమెరికా వాణిజ్య మంత్రి వ్యాఖ్యలు చూశాం. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చించేందుకు గతేడాది ఫిబ్రవరి 13 నాటికే

మిగతా 2లో..

## లోయలో పడ్డ బస్సు

- 8మంది దుర్మరణం
- హిమాచల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**సిమ్లా(జనంసాక్షి):**హిమాచల్ ప్రదేశ్ లోని సిర్మౌర్ జిల్లాలో భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేటు బస్సు లోయలో పడి 8 మంది ప్రయాణికులు మృతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కుఫ్రి నుంచి సిమ్లాకు బస్సు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 30 నుంచి 35 మంది ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది.పోలీసు వర్గాల సమాచారం ప్రకారం

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 10.01.2026

# త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం

బజారులో పప్పుబెల్లాల్లా అమ్ముకుంటుంటే కళ్లు అప్పగించి చూసిన పాపం బీఆర్ఎస్ నేతలదేనని ఆయన మండిపడ్డారు. పేపర్ లీకేజీల వల్ల లక్షలాది మంది నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని, గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థత గత ప్రభుత్వానిదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ భర్తీని ఒక 'పవిత్ర కార్యం'లా చేపట్టిందని శ్రీధర్ బాబు తెలిపారు. "మేము అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ఎక్కడా ఎలాంటి లీకేజీలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి ఇప్పటికే 70 వేల మందికి ప్రభుత్వోద్యోగాలు కల్పించాం. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4 అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చాం. త్వరలోనే గ్రూప్-3 నియామక పత్రాలు కూడా అందజేస్తాం" అని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిలో అత్యధికులు బడుగు, బలహీన వర్గాల వారే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. తాను శాసనమండలిలో అన్న మాటలను కొందరు కావాలనే వక్రీకరిస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. "నిరుద్యోగులను తక్కువ చేయాలన్నది నా ఉద్దేశ్యం కాదు. తెలంగాణ భవిష్యత్తు మీరే (యువత). కేవలం రాజకీయ లబ్ధి కోసం కొందరు మిమ్మల్ని రెచ్చగొడుతున్నారు. వారి ఊబిలో చిక్కి మోసపోకండి" అని నిరుద్యోగ సోదరులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 25 లక్షల మంది నిరుద్యోగుల కోసం ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో ముందుకు వెళ్తోందని మంత్రి వివరించారు. శాస్త్రీయబద్ధమైన 'జాబ్ క్యాలెండర్' ద్వారా నియామకాలు చేపడతాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్‌పై దృష్టి సారించి ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి కల్పిస్తాం. రాజకీయ నిరుద్యోగుల మాటలు నమ్మవద్దని, మీ కష్టం విలువ తెలిసిన కాంగ్రెస్ ప్రభుత్వం మీకు ఎప్పుడూ అండగా ఉంటుందని, మీ భవిష్యత్తుకు తమదే భరోసా అని మంత్రి శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు.

# ఉక్రెయిన్‌లో అత్యాధునిక క్షిపణిని ప్రయోగించిన రష్యా



**మాస్కో(జనంసాక్షి):** రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రి క్తతలు మరోసారి తీవ్రమ య్యాయి. ఇటీవల రష్యా అధ్య క్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు పాల్పడినట్లు క్రెమ్లిన్ తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా మాస్కో తాజాగా ఉక్రెయిన్‌పై అత్యాధునిక ఒరెష్నిక్ క్షిపణితో విరుచుకుపడింది. ధ్వని కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణించగల ఈ క్షిపణిని గురువారం అర్ధరాత్రి పశ్చిమ లివివ్ ప్రాంతంపై ప్రయోగించింది.పుతిన్ నివాసంపై దాడికి ప్రతీకారంగానే ఈ క్షిపణిని ప్రయోగించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ క్షిపణితో కీలక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అయితే కచ్చితంగా ఏ ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ మిస్సైల్‌ను ప్రయోగించిందన్న వివరాలను మాస్కో వెల్లడించలేదు కానీ.. ఉక్రెయిన్ భూగర్భ సహజ వాయువు నిల్వలపై ఈ దాడి జరిగినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలపై ఉక్రెయిన్ అధికారులు స్పందించారు. రష్యా జరిపిన దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. 22 మంది గాయపడినట్లు తెలిపారు. ఒరెష్నిక్‌తో పాటు మొత్తం 36 క్షిపణులు, 242 డ్రోన్లను రష్యా ప్రయోగించినట్లు కీవ్ ఆరోపించింది. నాటో సరిహద్దుకు సమీపంలో ఒరెష్నిక్ పడిందని, ఐరోపా భద్రతకు ఇది పెనుముప్పు అని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి అన్నారు.


ఐరోపా మొత్తాన్ని టార్గెట్ చేసేలా..

రష్యా అత్యాధునిక క్షిపణుల్లో ఒరెష్నిక్ ఒకటి. రష్యన్ భాషలో దీనర్థం హేజల్‌నట్ చెట్టు. సాధారణంగా మాస్కో అభివృద్ధి చేసే క్షిపణులకు చెట్ల పేర్లను పెట్టడం ఆనవాయితీ. ఒరెష్నిక్ మధ్య స్థాయి క్షిపణి. ఇది గంటకు 13,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. అంటే ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంగా దూసుకెళ్తుంది. యూరప్‌లోని అన్ని దేశాలు ఈ మిస్సైల్ పరిధిలోకి వస్తాయని రష్యా మిస్సైల్ ఫోర్సెస్ చీఫ్ వెల్లడించారు. ఇప్పటివరకు ఈ క్షిపణిని అడ్డుకునే సామర్థ్యం గల ఆయుధమేదీ లేదని పేర్కొన్నారు.తొలిసారిగా ఈ క్షిపణిని 2024 నవంబరులో ఓ ఉక్రెయిన్ ఫ్యాక్టరీ మీద ప్రయోగించారు. అప్పట్లో అది ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. ఇటీవలే దీన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. రష్యా మిత్రదేశమైన బెలారస్‌కు ఈ మిస్సైల్‌ను తరలించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ క్షిపణి అణు బాంబులతో పాటు అనేక వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు.

# శబరిమల బంగారం తాపడాల కేసు..

## శబరిమల ఆలయ ప్రధాన పూజారి అరెస్ట్

**తిరువనంతపురం(జనంసాక్షి):** శబరిమల బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శబరిమల తంత్రి (ప్రధాన పూజారి) కందరారు రాజీవరును సిట్ అధికారులు అరెస్టు చేశారు. అధికారిక వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో సిట్ అధికారుల బృందం ఆయన్ను అదుపులోకి తీసుకొని.. విచారణ అనంతరం అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన



నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో రాజీవరుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన సిట్ అధికారులు.. బంగారు తాపడాల చోరీ కేసులో ఆయన పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.ఉన్ని కృష్ణన్ పొట్టిని శబరిమలకు తీసుకువచ్చింది కూడా తంత్రి కందరారు రాజీవరేనని ఇతర నిందితులు తమ వాంగ్మూలంలో పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. బంగారు తాపడాల దొంగతనం గురించి ఆయనకు ముందే తెలుసని పేర్కొన్నారు. మరోవైపు ఈ వ్యవహారంపై ఈడీ కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఏమిటీ కేసు..?

శబరిమలలో గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను 2019లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. వాటిని సరిచేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్ని కృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నైలోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.100 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ఎలక్ట్రోప్లేటింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత వాటిపై ఉండే బంగారంలో కొంత అదృశ్యమైందని సదరు కంపెనీ తెలిపింది. ఉన్నట్టుండి తాపడాల బరువు దాదాపు 4.524 కేజీలు తగ్గడంతో ఈ విషయంలో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టగా ఉన్ని కృష్ణన్ సహా పలువురు ప్రధాన అధికారులు ఈ కేసులో నిందితులుగా ఉన్నట్లు తేలింది. దీంతో ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు చేపట్టింది.

# మాకు నీళ్లే కావాలి.. పంచాయతీ వద్దు



అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదన్నారు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం అని అన్నారు. రాజకీయ ప్రయోజనాలు కాదు.. ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుందని సీఎం హామీ ఇచ్చారు. ఈ మేరకు కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ధి పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలని పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తూ.. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని, రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదం కోరుకోవడం లేదని.. పరిష్కారమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టీకరించారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ డెస్టినేషన్‌గా తెలంగాణ

**- 2047 లక్ష్యంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ**
**- క్యూర్-ప్యూర్-రేర్‌తో డెవలప్‌మెంట్ మోడల్**
**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ నగరం నేడు ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడుతోందంటే అది గత మూడు దశాబ్దాల నిరంతర శ్రమ ఫలితమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఐవీ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన సుజెన్ మెడికేర్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఇటువంటి తయారీ యూనిట్లు రావడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం క్యూర్ , ప్యూర్ , రేర్ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్లు సీఎం తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇప్పటికే తెలంగాణ పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం వాటా తెలంగాణదేనని, ఫార్మా రంగంలో ప్రపంచమే మన వైపు చూసేలా ఎదుగుతున్నామని గర్వంగా చెప్పారు. ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోంది. పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉన్నాయి. ప్రపంచ స్థాయి దేశాలతో తెలంగాణ పోటీపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పెట్టుబడులకు అనుకూల మైన వాతావరణం మన రాష్ట్రంలో ఉంది. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది.మన దేశం వాళ్లే అని సీఎం అన్నారు. రాజకీయ వివాదాల కంటే సమస్యల పరిష్కారానికే తాము ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు సృష్టించవద్దని, అడ్డంకుల వల్ల కేంద్ర నిధులు రాక రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలన్నా, నీటి సమస్యలు తీరాలన్నా ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల సహకారం అవసరమని, అందుకే తాము వివాదాల కంటే సామరస్యపూర్వక చర్చలకే మొగ్గు చూపుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల , రైతుల ప్రయోజనాల కోసమే తమ ప్రభుత్వం ఆలోచిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు సీఎం తెలిపారు. రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌లోని 'ఫ్యూచర్ సిటీ'లో నివసిస్తున్నామని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జర్మనీ, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాలతో పోటీ పడుతూ తెలంగాణను గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చడమే తమ సంకల్పమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# హైకోర్టులో డీజీపీ శివధర్‌రెడ్డి ఊరట

సకాలంలో డీజీపీ ప్యానెల్ లిస్ట్ పంపకపోవడం వల్లే తిప్పి పంపామని యూపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని యూపీఎస్సీని ఆదేశించింది. పూర్తిస్థాయి డీజీపీ నియామకంపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమా

ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి చేర్చే ప్రభుత్వ ఉద్యోగులు మా కుటుంబ సభ్యులుగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం భావిస్తుందని వివరించారు. 1.02 కోట్ల ప్రమాద బీమాకు సంబంధించిన ప్రక్రియను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రంలోని ప్రముఖ బ్యాంకర్లతో సంప్రదింపులు ముగిసినట్టు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను సైతం ప్రతి నెల క్రమం తప్పకుండా దశలవారీగా విడుదల చేస్తూ వస్తున్నామని ఆ ప్రకటనలో వివరించారు. ఉద్యోగులకు ప్రమాద బీమాకు సంబంధించి ఇప్పటికే సింగరేణి, ట్రాన్స్కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, జెన్కో పరిధిలోని ఉద్యోగులందరికీ కోటికి పైగా ప్రమాద బీమాను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వం చొరవతో చేపట్టిన కోటి రూపాయలకు పైగా ప్రమాద బీమా కార్యక్రమంతో ఇప్పటికే సింగరేణిలో 38,000 మంది రెగ్యులర్ ఉద్యోగులు వీరితోపాటు విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 71,387 మంది ఉద్యోగులకు ప్రమాద బీమా అందుబాటులోకి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు సైతం 1.02 కోట్ల ప్రమాద బీమాను అమల్లోకి తీసుకు వస్తున్నట్టు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 5.14 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు

# లోయలో పడ్డ బస్సు

హరిపుర్ధార్ ఏరియాలోని ఇరుకైన రహదారిపై వెళ్తుండగా బస్సు అదుపుతప్పి లోయలో పడింది. సహాయక కార్యక్రమాలు చేపట్టినట్టు సిర్మౌర్ ఎస్పీ నిశ్చింత్ సింగ్ నెగి తెలిపారు. తొలుత ప్రమాద స్థలికి చేరుకున్న స్థానికులు అత్యవసర సహాయక బృందాలు అక్కడికి చేరుకోకముందే సహాయక చర్యలు చేపట్టారు. పలువురు క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. మరికొందరికి సీరియస్‌గా ఉండటంతో హయర్ మెడికల్ సెంటర్లకు తరలిస్తున్నట్టు నిశ్చింత్ సింగ్ చెప్పారు. ఈగా, ఈ ఘటనపై ముఖ్యమంత్రి సుఖేందర్ సింగ్ సుఖు విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్టు చెప్పారు.

**చేతులు కలిపిన ఎన్సీపీ!**

**- కుటుంబ వివాదం సమసిపోయిందన్న అజిత్**

**ముంబయి(జనంసాక్షి):** మహారాష్ట్రలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీలిక వర్గాల మధ్య సయోధ్య కుదిరింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇరు వర్గాలు కలసి పోటీ చేయనున్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల కోరిక మేరకు కలసి పనిచేయాలని నిర్ణయానికొచ్చినట్లు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ పేర్కొన్నారు. పవార్ కుటుంబంలో వివాదాలు సైతం సమసిపోయాయని ఓ ఆంగ్ల మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ పార్టీ రెండేళ్ల క్రితం చీలిపోయిన సంగతి తెలిసిందే. అజిత్ పవార్ నేతత్వంలోని చీలిక వర్గం ఎన్డీయేతో చేతుల కలిపింది. అజిత్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. పార్టీ గుర్తు గడియారాన్ని సైతం చేజిక్కించుకున్నారు. దీంతో శరద్ పవార్ నేతృత్వంలోని పార్టీ ఎన్సీపీ (శరద్ చంద్ర పవార్)గా అవతరించింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇరు పార్టీలు ఎన్డీయే, ఇండియా కూటమి నుంచి వేర్వేరుగా బరిలోకి దిగాయి.మహారాష్ట్రలోని పింప్రి చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోటీ చేయాలని తాజాగా నిర్ణయం తీసుకున్నాయి. ఇరువర్గాలు కలసి పనిచేసే విషయాన్ని శరద్ పవార్ వర్గానికి చెందిన నేత, ఎంపీ సుప్రియా సూలే సైతం ధ్రువీకరించారు. పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకు ఉమ్మడిగా పోటీ చేయాలని నిర్ణయానికొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం కొనసాగించే అంశంపై ఇంకా ఎలాంటి చర్చా జరగలేదని కూడా చెప్పారు. భాజపా నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా చేరనున్నట్లు జరుగుతున్న ప్రచారంపైనా ఆమె స్పందించారు. 'ఉత్తుత్తి ప్రచారం చేసే వారిని ఆనందం పొందనివ్వండి' అంటూ సమాధానమిచ్చారు.

# దంతేవాడ జిల్లాలో 63 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లో మరో అతిపెద్ద లొంగుబాటు జరిగింది. దంతేవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ ఎదుట 63 మంది మావోయిస్టులు శుక్రవారం లొంగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'లోన్ వర్రాటు' (ఇంటికి రండి) పునరావాస కార్యక్రమంలో భాగంగా మావోయిస్టులు భారీ సంఖ్యలో లొంగిపోతున్నారు. వెస్ట్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ కడ్డీతో పాటు 18 మంది మహిళా మావోయిస్టులు లొంగిపోయిన వారిలో ఉన్నారు. వారిపై రూ.1.17కోట్ల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. మావోయిస్టులు కాలం చెల్లిన సిద్ధాంతాలను వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు.




# వ్యవసాయ యాంత్రీకరణ పునప్రారంభిస్తాం

నెట్టెం పాడు,కొడంగల్ నారాయణపేట, డిండి, ఎస్ ఎల్ బి సి ప్రాజెక్ట్ లు పూర్తి చేయలేదని మేము అధికారం లోకి వచ్చిన తర్వాత అన్ని ప్రాజెక్ట్ లు వేగవంతం గా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వచ్చే మూడు సంవత్సరాల్లో కృష్ణా నదిపై నిర్మాణం లో ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.గత ప్రభుత్వం చేసిన నిర్వాహకం వల్ల నష్టపోయిన కృష్ణ, గోదావరి జలాల్లో తెలంగాణ కు దక్కాలసిన వాటా లో ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోబోమని వాటా కోసం సుప్రీం కోర్ట్, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర జల సంఘం, నది ట్రిబ్యూ నల్స్ ముందు బలమైన వాదనలు వినిపించి సాధిస్తామని తెలిపారు.కోదాడ నియోజకవర్గం లో నిర్మిస్తున్న రెడ్ల కుంట లిఫ్ట్ ఇరిగేషన్, శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ లు వేగవంతంగా పూర్తి చేయాలని పాలేరు వాగుపై చెక్ డాం, పాలవరం లిఫ్ట్ ఇరిగేషన్ కు, నడిగూడెంలోని చౌదరి చెరువు వద్ద బ్రిడ్జి నిర్మాణం కొరకు ప్రతిపాదనలు పంపాలని, చిలుకూరు వద్ద ముక్యా ల బ్రాంచ్ కెనాల్ పై డబుల్ బ్రిడ్జ్,పాలే అన్నారంలో బ్రిడ్జ పనులు త్వరగా ప్రారంభించి ఎండాకాలం చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.మోతే లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ కొరకు రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందించాలని ఆర్డీఓను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఇరిగేషన్ సి ఈ రమేష్ బాబు,ఎస్ ఈ లు నాగభూషణం శివతేజ, ఆర్ అండ్ బి ఈ ఈ సీతారామయ్య, ఆర్డీవోలు సూర్యనారాయణ ,వేణుమాధవ్, తహసిల్దార్ వాజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ,ట్రంప్ ఎనిమిది సార్లు మాట్లాడుకున్నారు

ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయి. అప్పటి నుంచి పరస్పర ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం ఇరుపక్షాలు పలుమార్లు సంప్రదింపులు జరిపాయి. వీటి గురించి అమెరికా వాణిజ్య మంత్రి వ్యాఖ్యల్లో స్పష్టత లేదు. అనేకసార్లు ఒప్పందానికి దగ్గరగా వచ్చాం. ఇప్పటికీ దీనిపై ముందుకు వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్నాం. గతేడాది ఎనిమిది సందర్భాల్లో ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ఫోన్‌లో సంభాషించుకున్నారు" అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు."బంగ్లాదేశ్‌లో మైనార్టీలు, వారి ఇళ్లు, వ్యాపారాలపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఈ అంశాన్ని గతంలోనే ప్రస్తావించాం. వీటిని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత లేదా రాజకీయ వివాదాలుగా కొట్టిపారేసే ప్రయత్నాలు చేస్తే నేరస్థులు మరింత రెచ్చిపోయేందుకు కారణమవుతాయి. మైనార్టీల్లో మరింత భయాన్ని, అభద్రతా భావాన్ని పెంచుతాయి" అని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది.అమెరికా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టనున్న 500 శాతం సుంకాల విధింపు బిల్లు గురించి అవగాహన ఉందని, ప్రస్తుత పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని భారత్ వెల్లడించింది. చమురు అంశంపై తమ వైఖరి అందరికీ తెలిసిందేనని పేర్కొంది. ప్రపంచ మార్కెట్ల పరిస్థితులకు అనుగుణంగా స్పందిస్తున్నట్లు తెలిపింది. భారతీయుల ఇంధన భద్రత కాపాడటం తమ బాధ్యత అని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

**అదే నా జీవిత లక్ష్యం : మంత్రి తుమ్మల**

**వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయ పథకాలకు శ్రీకారం**

**భద్రాద్రి కొత్తగూడెం(జనంసాక్షి):** గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన జీవిత లక్ష్యమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో మూలకిపడిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం పున:ప్రారం భోత్సవం చేశామని తెలిపారు. శుక్రవారం అశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో రైతు మేళా కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం, ప్రకృతి వ్యవసాయ పథకాలను మంత్రులు ప్రారంభించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. దివంగత ఎన్టీఆర్ దీవెనలతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టులో డిస్టిబ్యూటరీ కెనాల్స్ డీపీఆర్‌లో లేదని ప్రస్తావించారు. తమ ప్రభుత్వంలో కెనాల్స్‌కు నిధులు మంజూరు చేశామని తెలిపారు. 350 మంది రైతులకు రూ.1.07 కోట్లు విలువైన యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ పథకం ప్రారంభించినట్లు వివరించారు. వ్యవసాయ ఉద్యాన పామాయిల్ సాగుపై శాస్త్రవేత్తలు ఆదర్శ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించామని పేర్కొన్నారు. నాలుగో పంపు హౌస్ నిర్మాణంతో దమ్మపేట, అశ్వరావుపేట మండలాలకు గోదావరి నీళ్లు వస్తాయని వెల్లడించారు. ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలుగా కోకూ, జాజి, వక్క, మిరియం, సాగుతో రైతులకు అదనపు లాభాలు వస్తాయని తెలిపారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.దేశానికే ఆదర్శంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ రంగంలో అగ్ర భాగాన ఉండాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణకు తమ ప్రభుత్వం పట్టుదలగా ఉందని పేర్కొన్నారు. సన్నకారు రైతులకు మేలు చేయాలని వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పుకొచ్చారు. సంక్రాంతి పండుగ రోజు నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి 470 బిలియన్ డాలర్స్ వ్యవసాయ రంగం వాటా ఉండేలా తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఉందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఉత్తమ కళాశాలగా నిలవాలని పామాయిల్ సాగుతో రైతులకు మహర్దశ వచ్చిందని తెలిపారు. భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆశీస్సులతో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# స్లీపర్ బస్సు ప్రమాదాల నివారణకు చర్యలు

## గుర్తింపు పొందిన సంస్థలకే తయారీ పనులు

## గతేడాది ప్రమాదాలతో కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** స్లీపర్ బస్సు ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్థానికంగా పనిచేసే మాన్యువల్ స్లీపర్ బస్సు బాడీ బిల్డర్లకు కాకుండా.. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆటోమొబైల్ కంపెనీలు, తయారీ సంస్థలకే బస్సుల తయారీకి అనుమతి ఉంటుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రకటన జారీ చేసింది. గత ఏడాది దేశంలోని పలు రాష్ట్రాల్లో ఘోర బస్సు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. ప్రైవేటు స్లీపర్ బస్సులు ప్రమాదానికి గురవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించారు. ఏపీ, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బస్సు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని నివేదికల్లో తేలిందన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరిగినట్లు బయటపడిందన్నారు. అంతే కాకుండా అగ్నిప్రమాదం జరిగిన సమయాల్లో మంటలను నియంత్రించేందుకు అవసరమైన పరికరాలు బస్సుల్లో లేకపోవడం కూడా ప్రమాదానికి కారణమైందని చెప్పారు. అలాగే బస్సుల్లో తరచూ తనిఖీలు చేపట్టకపోవడం కూడా మరో కారణమని నివేదికల్లో తేలిందని చెప్పారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.బస్సు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సంస్థలు మాత్రమే బస్సులను తయారు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పుడు ఉన్న అన్ని స్లీపర్ బస్సుల్లో అగ్నిప్రమాద గుర్తింపు వ్యవస్థ, ప్రతి ఎమ్జర్గ÷న్సీ ఎగ్జిట్ వద్ద సుత్తి, అత్యవసర లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే బస్సులు, అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు.

# వన దేవతల ఘనకీర్తి ప్రపంచానికి చాటి చెప్పాలి

- ప్రపంచ చరిత్రలో ప్రత్యేక మైలు రాయిగా మేడారం ఆలయం నిలుస్తుంది
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, గొట్టుగోత్రాలు ఆచారాలు ప్రతిబింబించేలా ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ
- ఆదివాసులు మూలపురుషులుగా ఉన్నారు
- మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు బ్యూరో,జనవరి09(జనం సాక్షి) :** వన దేవతల ఘన కీర్తి ప్రపంచానికి చాటి చెప్పాలని,గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, గొట్టు గోత్రాలు ఆచారాలు ప్రతిబింబించేలా ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ జరుగుతున్నదని, ప్రపంచానికి ఆదివాసులు మూల పురుషులుగా ఉన్నారని, మేడారం అభివృద్ధి పై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.శుక్రవారం తాడ్వాయి మండలం మేడారం హరిత హోటల్ లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్,ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి మీడియా ఆత్మీయ సమ్మేళన సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం 251 కోట్ల రూపాయల నిధులతో చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో మేడారం జాతర నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.మేడారం జాతర లో శాశ్వత ప్రతిపాదికన జరుగుతున్నా అభివృద్ధి పనులు,జాతర నిర్వహణ అంశాలు ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు.భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా, ఇంటి ఇలావేల్పులుగా సమ్మక్క సారలమ్మ దేవతలు ప్రసిద్ధి చెందారని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి వెన్నెల వెలుగులలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాల డోలు వాయిద్యాల నడుమ జిల్లా అధికారుల గౌరవ వందనంతో గిరిజన నృత్యాల తో వన దేవతలు గద్దెల పైకి రావడం తో భక్త జనం భక్తి పారవశ్యంతో పులకరిస్తారని పేర్కొన్నారు.ఈ మహాద్భుత ఘట్టం ఆవిష్కృతం కోసం కోట్లాది మంది భక్తులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. గద్దెల పునరుద్ధరన ముఖ్యమంత్రి చేతుల మీదుగా 19వ తేదీ ఉదయం 7 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని 18వ తేదీ సాయంత్రం ముఖ్యమంత్రి మేడారం చేరుకుంటారని, గద్దెల పునరుద్ధన ప్రారంభ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఆలయ పునరుద్ధన విషయం లో గిరిజన పెద్దలతో, పూజారులతో,ఆదివాసి సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని,అందరి సమ్మతి, సంతకాలతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు.జాతర లో మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యత ఇస్తూ వారికి బొంగు చికెన్, ఇప్ప పువ్వు లడ్డు ప్రత్యేక దుకాణాలు పెట్టించడం జరిగిందని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జాతర నిర్వహించడం జరుగుతుందని, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

జాతర లో ప్రస్తుతం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని,జాతర సమయం లో 30వేల మంది సిబ్బంది,జాతర అనంతరం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు.జాతర ప్రాంతాన్ని 8 జోన్స్ గా,42 సెక్టార్లుగా విభజించి ప్రతి జోన్ లో 8 మంది అధికారులు ఉంటారని అన్నారు.తదనంతరం జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ మేడారం జాతర సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమగ్ర ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తాడ్వాయి - మేడారం,పసర - మేడారం రహదారుల వెంట ప్రతి 2 కిలోమీటర్లకు ఒక చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతర నిర్వహణ కోసం సుమారు 20 మంది ఐపీఎస్ అధికారుల సేవలను వినియోగించుకుంటామని, భక్తులకు సేవలు అందించడానికి స్థానిక యువత సిద్ధంగా ఉన్నారని, వాహనాల పార్కింగ్ లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని అన్నారు. జాతర పరిసరాలను 450 సీసీ టీవీ, 20 ప్రత్యేక డ్రోన్స్ నిఘా తో పర్యవేక్షణ చేస్తున్నామని, ప్రత్యేకంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్ ద్వారా గద్దెల ప్రాంగణం లో భక్తుల రద్దీని పర్యవేక్షంచడం జరుగుతుందని పేర్కొన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం 20కి పైగా డ్రోన్‌లను ఉపయోగిస్తూ, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని వివరించారు. అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హీట్ మ్యాప్ టెక్నాలజీ ద్వారా అధిక జనసాంద్రత ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో జన సమూహ నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, వరంగల్ ములుగు మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- లంచం తీసుకుంటుండగా పట్టివేత



**సూర్యపేట, జనవరి 9 (జనంసాక్షి) :** జిల్లాలో పంచాయతీ కార్యదర్శి ఒకరు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. తుంగతుర్తి మండలం గానుగబండ గ్రామ పంచాయతీ కార్యదర్శి శుక్రవారం రూ.6 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గ్రామస్థుడు ఒకరు కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నంబర్ కేటాయించాలని కార్యదర్శి బర్‌పాటి కృష్ణను సంప్రదించాడు. అతను లంచం డిమాండ్ చేయడంతో దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వ్యూహం ప్రకారం రూ.6 వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం నాంపల్లి ఏసీబీ కోర్టు అడిషనల్ స్పెషల్ జడ్జి ఎదుట హాజరు పరిచారు.వరుసగా గత నాలుగు రోజుల నుంచి ఏసీబీ అధికారులు మొత్తం 7 గురు ప్రభుత్వ అధికారులను లంచం తీసుకుంటూ పట్టుకున్నారు. నిన్న వనపర్తిలో పౌరసరఫరాల మేనేజర్ జగన్ మోహన్ అవినీతి నిరోధక అధికారులకు చిక్కాడు. గురువారం అతడు రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈనెల 7న వరంగల్ కేయూసీ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీకాంత్ ను అదే రోజు రంగారెడ్డి జిల్లాలో నందిగామమండలానికి ఎంపీడీవో, ఎంపీవో పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అంతకు ముందు హైదరాబాద్‌లోని బొగ్గుకుంట ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆకవరం కిరణ్‌కుమార్ రూ. 50 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు.

# మిర్యాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- డిసిఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో ముగ్గురు మృతి



**నల్లగొండ, జనవరి 9 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఈదులగూడ చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి గుంటూరుకు టైల్స్ తరలిస్తున్న డీసీఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలోని మృతులంతా బీహార్ వాసులుగా గుర్తించారు. వీరిలో బీరు బాయ్ (30), సంతోష్ (30), సూరజ్ (18) ఉన్నారు. డీసీఎంలో ఉన్న టైల్స్ కూలీల మీద పడటంతో ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.టైల్స్‌ను హైదరాబాద్ నుంచి గుంటూరుకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్రేన్ సహాయంతో రహదారిపై నుంచి లారీని, డీసీఎంను తొలగించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్థంభించిపోయింది. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేస్తున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మిర్యాలగూడలోని ఈ రహదారిపై ప్రయాణించే సమయంలో అత్యంత జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచించారు. పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# వాలిడేషన్ ఆక్ట్ 25ను రద్దు చేయాలి

- 8వ వేతన సవరణ కమిషన్‌కు ఇచ్చిన సూచనలను సవరించాలి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వాలిడేషన్ ఆక్ట్ 25 ని రద్దు చేయాలని 8వ వేతన సవరణ కమిషన్ కు ఇచ్చిన సూచనలను సవరించాలని కోరుతూ ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌సీసీపీఏ, ఎఫ్‌సీపీఏ ల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాలు జరిగాయి. హైదరాబాద్ లోని ఆదర్శనగర్ బిఎస్ ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఎన్‌సీసీపీఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నామాల సోమయ్య ఎం.జనార్దన్ రెడ్డి, ఎం.నరహరి, జి.అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నాకు అధ్యక్షత వహిస్తూ శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన వాలిడేషన్ ఆక్ట్ -25 ప్రకారం పెన్షనర్లను రకరకాలుగా విభజిస్తుందనీ, దానిని 01.06.1972 నుండి అమలు చేయడం అంటే పెన్షనర్ల హక్కులు కాలరాయడమేనని అన్నారు. పానల్ కమిటీ మెంబర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మెడికల్ రీఎంబర్స్ మెంట్ ప్రతిపాదనల వివరాలు, ఆసుపత్రి లొకేషన్ మార్పుల వివరాలు తెలియజేశారు. బేగం పేట సిజిహెచ్ఎస్ ఆసుపత్రి వద్ద జరిగిన ధర్నాలో ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ 8వ వేతన సవరణ కమిషన్ కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచనలను సవరించాలని కోరారు. పెన్షన్ అనేది ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని, అది సదరు పెన్షనర్ ఉద్యోగం చేస్తున్నపుడు ఇవ్వాల్సిన వాయిదా వేసిన వేతనం డిఫర్డ్ వేజ్ అన్నారు. అది ఆ ఉద్యోగి లేదా పెన్షనర్ హక్కు అన్నారు. బేగంపేట సిజిహెచ్ఎస్ ఆసుపత్రి వద్ద జరిగిన ధర్నాలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అధ్యక్షులు పి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల హక్కులను కాలరాసే వాలిడేషన్ ఆక్టును వెంటనే రద్దుచేయాలన్నారు. ఇక్కడ పి ప్రభాకర్, బాలగంగాధర్ తదితరులు పాల్గొన్నారు. బిఎస్ఎన్ఎల్ రామచంద్రుడు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు ఇప్పటికీ 7వ వేతన సవరణ జరగలేదని వెంటనే దానిని అమలు చేయాలని పెన్షన్ ని అప్ డేట్ చేయాలని కోరారు. కోవిడ్ కాలంలో రద్దు చేసిన రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని కోరారు. కొత్తపేట సరూర్ నగర్ బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో టాప్ర సిజివింగ్ క్రిష్ణమోహన్ మాట్లాడుతూ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సూచించిన విధంగా 65 సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ని రద్దు చేయాలన్నారు. ఇక్కడ దుర్గాప్రసాద్, క్రిష్ణారావు, శివలింగం తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాలో కళ్యాణం నాగేశ్వర్ రావు, గోపిచంద్ నిజామాబాద్ లో శిర్పహన్మాండ్లు, ఈవిఎల్ నారాయణ, సంగారెడ్డిలో వైకుంఠరావు, రామారావులు, మంచిర్యాలలో కె. ప్రభాకర్, వరంగల్ లో ఎస్ లక్ష్మనారాయణ, కల్వకుర్తిలో జి అంజనయ్య తదితరులు పాల్గొని ధర్నా అనంతరం జిల్లా స్థాయి అధికారుల ద్వారా ప్రధాన మంత్రికి మెమొరాండంలు సమర్పించారు.

## డా. రాణీ పులోమజాదేవి కథా పురస్కారానికి కథలకు ఆహ్వానం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** డా. రాణీ పులోమజాదేవి జ్ఞాపకార్థం నగదు పురస్కారం అందజేయాలని వారి కుటుంబం సంకల్పించింది. కథ రచయితలు 2024, 2025 సంవత్సరాల్లో వారు ప్రచురించిన కథ సంపుటాలు రెండు కాపీలను క్రింది చిరునామాకు 10.02.2026 లోగా పంపించవలసినదిగా కోరారు. విజేతకు జూలైలో హైదరాబాద్ నందు జరిగే తెలుగు సాహితీవనం వార్షికోత్సవంలో రూ 5,000 నగదుతో పురస్కార ప్రదానం ఉంటుంది. విజేతలు తప్పనిసరిగా సభకు వచ్చి పురస్కారం అందుకోవాలి. ఈ పురస్కారం నిమిత్తం పరిశీలనకు పంపిన పుస్తకాలను తిప్పి పంపడం వీలుకాదు. పుస్తకాలను డా. తిక్కా సత్యమూర్తి, ప్లాట్ నెం- డి42, ఫ్లాట్ నెం-504, సాయి లక్ష్మి ఎన్ క్లేవ్, మధురానగర్, హైదరాబాద్ - 500038 అడ్రస్‌కు పంపాలని, ఇతర వివరాలకు 9849344109 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# గోట్ బ్లడ్ మాఫియా వ్యవహారంలో మటన్ షాపుపై కేసు

**మేడ్చల్, జనవరి 9 (జనంసాక్షి) :** జంతువుల నుంచి రక్తం సేకరణ వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ వాణి ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూగజీవుల నుంచి రక్తం తీసేందుకు ఎలాంటి అనుమతి పొందలేదని పోలీసులు గుర్తించారు. సోను మటన్ అండ్ చికెన్ షాప్‌పై కేసు నమోదు చేశారు పోలీసులు. ఈ వ్యవహారంపై వెటర్నరీ అధికారులు ఇచ్చిన నివేదికను జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. కాగా.. సోను మటన్ షాప్‌లో జీవించి ఉన్న మేక నుంచి రక్తం సేకరించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈనెల 4న నాగారంలోని సోను మటన్ షాపుపై కీసర పోలీసులు దాడులు చేయగా.. 130 ప్యాకెట్ల మేకల రక్తం లభించింది. మేకల నుంచి రక్తాన్ని సేకరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ రక్తాన్ని కాచిగూడలోని సీఎన్‌కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు తరలించి.. అక్కడి నుంచి లేబొరేటరీల్లో ప్లేట్‌లెట్ల తయారీకి వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ 'గోట్ బ్లడ్ మాఫియా' ఎలాంటి వైద్య ప్రమాణాలూ పాటించకుండా మేకలు, గొర్రెల నుంచి అక్రమంగా రక్తం సేకరించి, దాన్ని ప్లేట్‌లెట్ల తయారీకి తరలిస్తుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# సంక్రాతి రద్దీ ఒత్తిడి తగ్గించే యత్నం

- సజావుగా వాహనాల రాకపోకలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన పోలీస్ యంత్రాంగం
- డ్రోన్ల తో నిరంతర పర్యవేక్షణ



**నల్లగొండ, జనవరి9 (జనంసాక్షి) :** సంక్రాంతి సమీపిస్తున్న వేళ విజయవాడకు, ఇటు హైదరాబాద్‌కు రద్దీ పెరిగే అవకాశాలు ఉండడంతో అధికారులు తక్షణ చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా మీదుగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు భారీ సంఖ్యలో వాహనాలు వెళ్లే అవకాశం ఉంది. టోల్ గేట్లు, జాతీయ రహదారిపై వంతెనల నిర్మాణం తదితరాలతో ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు ప్రణాళికలను రూపొందించారు. హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద నల్గొండ, మిర్యాలగూడ, పిగుడురాళ్ల మీదుగా దారి మళ్లిస్తారు. రాజమండ్రి-విశాఖపట్నం: నకిరేకల్ మీదుగా అర్వపల్లి, మరిపెడ బంగ్లా, ఖమ్మం మీదుగా మళ్లిస్తారు. అక్కడ సమస్య ఉంటే టేకుమట్ల నుంచి ఖమ్మం జాతీయరహదారి మీదుగా రాజమండ్రి వైపునకు పంపిస్తారు. హైదరాబాద్-విజయవాడ: టేకుమట్ల డైవర్షన్‌ను ఎత్తివేయనున్నారు. టేకుమట్ల నుంచి ఖమ్మం జాతీయ రహదారికి వెళ్లి యూ టర్న్ తీసుకొని తిరిగి సూర్యాపేట వైపునకు రావల్సి ఉండగా.. జాతీయ రహదారిపై సరాసరి వాహనాలు వచ్చే విధంగా తాత్కాలిక రహదారిని నిర్మించారు. ఖమ్మం-హైదరాబాద్: రాయినిగూడెం వైపునకు వచ్చి యూటర్న్ తీసుకోవల్సి ఉండగా.. చివ్వెంల, ఐలాపురం వద్ద దారి మళ్లించి సూర్యాపేట మీదుగా సరాసరి హైదరాబాద్ వెళ్లే విధంగా ప్రణాళికలను రూపొందించారు. సూర్యాపేట జిల్లా పోలీసులు ఈ ఏడాది జాతీయ రహదారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడైనా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోతే..వెంటనే తగిన చర్యలు చేపడతారు. సూర్యాపేట గ్రామీణం, సూర్యాపేట, మునగాల, కోదాడ, కోదాడ గ్రామీణ సీఐల ఆధ్వర్యంలో పండగకు ముందు, ఆ తర్వాత ఐదేసి రోజులు సిబ్బంది నిరంతరం ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. క్రేన్లు, అంబులెన్సులు, టోయింగ్ వాహనాలను సిద్ధం చేశారు. నాలుగు హైవే పెట్రోలింగ్ వాహనాలు గస్తీ కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా 24 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. వీటితోపాటు ప్రమాదకర క్రాసింగ్‌ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. సీసీ టీవీ కెమెరాలను, సైన్ బోర్డులు, విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. వేగ నియంత్రికలను, బారికేడ్లను తొలగించారు. గుంతలు పడిన చోట మరమ్మతులు చేపట్టారు. అయితే వాహనదారులకు తొందరపాటు సరికాదని, ప్రతి ఒక్కరూ వేగ నియంత్రణ పాటించాలని పోలీసులు సూచించారు. సంక్రాంతిని ఆనందంగా జరుపుకొని తిరిగి సురక్షితంగా గమ్యస్థానం చేరేందుకు నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని వివరించారు.

# బెదిరింపులకు పాల్పడిన ముగ్గురు అరెస్టు





**జగిత్యాల (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో ఎయిర్టెల్ నెట్వర్క్ సర్వీసెస్ నిర్వహించే ఉద్యోగస్తులను పట్టణానికి చెందిన మార్త శివకుమార్, భోగ శ్రీనివాస్, అడ్డగట్ల సురేష్ అనే ముగ్గురు మొబైల్ అసోసియేషన్ పేరుతో ఎయిర్టెల్ ఉద్యోగులు బిజినెస్ చేసుకోవాలంటే 10 లక్షల రూపాయలు డబ్బులు ఇస్తేనే బిజినెస్ చేసుకోగలరని లేకుంటే బిజినెస్ చేయలేరని బెదిరింపులకు పాల్పడ్డారని కోరుట్ల సీఐ సురేష్ తెలిపారు. దానికి భయపడిన ఎయిర్టెల్ ఉద్యోగులు 30 వేల రూపాయలు ఆన్లైన్లో పంపించారని, అయినా కూడా పది లక్షల రూపాయలు ఇవ్వాలని ఫోన్ వీడియో కాల్ లో హెయిర్ గన్ రైఫిల్, ఎయిర్ గన్ పిస్టల్,తల్వార్ , అలాగే మూడు కత్తులతో బెదిరించారని, ఎయిర్టెల్ ఉద్యోగులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా శుక్రవారం పోలీసులు ముగ్గురిని పట్టుకొని వారి వద్ద నుండి ఒక ఎయిర్ గన్ రైఫిల్, ఎయిర్ గన్ పిస్టల్ తల్వార్ తో పాటు మరో మూడు చిన్న కత్తులను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని తెలిపారు.

## ఆత్మకూరు మండలాన్ని సందర్శించిన మాల్దీవ్ కౌన్సిల్



**ఆత్మకూర్, జనవరి 9 (జనం సాక్షి) :** గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నిర్వహించినటు వంటి లీడర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మాల్దీవ్స్ ఐలాండ్ కౌన్సిల్ అఫీషియల్స్ 35 మంది శుక్రవారం రోజు మండలంలోని అగ్రంపహాడ్, ఆత్మకూర్ గ్రామపంచాయతీలో సందర్శించి మండలంలో ఎం జి ఎన్ ఆర్ ఇ జి ఎస్ ద్వారా చేపట్టిన మాటేటి మహేందర్ కు చెందిన ఆయిల్ పామ్, కొబ్బరి తోట, అజోల్లా, చేపలు పెంచుతున్న తీరును పరిశీలించి ఇ జి ఎస్ ద్వారా చేపట్టిన పనులు బాగున్నాయని సిబ్బందిని అభినందించారు.అనంతరం గొల్లవాడలో ఉన్న స్కూల్ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడడం జరిగింది. ఆత్మకూర్ గ్రామపంచాయతీ నీ సందర్శించి ఎస్బిఎం, ఈజీఎస్ ద్వారా అవార్డులు పొందేలా పనిచేసినందుకు సర్పంచ్ మహేశ్వరి -రాజు ని అభినందించారు. తెలంగాణ గవర్నమెంట్ నిర్వహిస్తున్న స్కీములపై అవగాహన తీసుకొని పూర్తి సమాచారం తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్డ్ కోర్సు కోఆర్డినేటర్స్ అరుణ్, శిరీష , ఏ వి వో నరసింహారెడ్డి, ఏ పి వో రాజిరెడ్డి, శారద ,ఎస్ బి ఎం సంపత్ కుమార్, శ్రీనివాస్, గొల్లపల్లి హెడ్ మాస్టర్, టీచర్స్, సర్పంచులు మహేశ్వరి- రాజు, మహేందర్, ఈసీ రాము, పీస్ లు శ్వేత అరుణ టి ఏ లు సుధాకర్, శ్రీధర్, సురేష్ సిబ్బంది సురేందర్, రాంబాబు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన



**నిర్మల్ బ్యూరో, జనవరి09, (జనంసాక్షి) :** ఆల్ ఇండియా జాక్టో పిలుపు మేరకు నూతన పెన్షన్ విధానం రద్దు , ప్రాథమిక ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు, టెట్ మినహాయింపు వంటి డిమాండ్లతో దేశవ్యాప్తంగా సాగుతున్న దశలవారీ ఐక్య ఉద్యమాల్లో భాగంగా శుక్రవారం నిర్మల్ జిల్లా లక్ష్మచంద ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట అశోక్, ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, ఎస్టీయూ మండల అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కులు కాపాడాలని, భవిష్యత్ భద్రతకు భంగం కలిగించే విధానాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయ బృందం ప్రభుత్వ నిర్ణయాలపై పునఃఆలోచన చేయాలని కోరుతూ శాంతియుతంగా కార్యక్రమాన్ని ముగించారు.

# ఆర్థిక ఇబ్బందుల్లో విశ్వవిద్యాలయాలు

*విశ్వవిద్యాలయం అనేది ఇటుకలు, భవనాలు, తరగతి గదుల సమాహారం మాత్రమే కాదు. అది ఒక సమాజం తన ఆలోచనలను పెంచుకునే మేధో క్షేత్రం. ప్రశ్నించడానికి, తర్కించడానికి, కొత్త దారులు వెతకడానికి అవసరమైన స్వేచ్ఛను అందించే స్థలం. పేద కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్య కలల్ని నిజం చేసే ఆశ్రయం. సామాజిక అసమానతలను తగ్గించే సాధనం. ప్రజాస్వామ్యాన్ని జీవంతో నింపే ఆలోచనల ప్రయోగశాల. చరిత్రలో ప్రతి సామాజిక మార్పు వెనుక ఏదో ఒక విశ్వవిద్యాలయపు పాత్ర కనిపిస్తుంది. శాస్త్రం, సాహిత్యం, తత్వం, రాజకీయం అన్నీ ఇక్కడే పరిపక్వత సాధిస్తాయి. గ్రామీణ నేపథ్యల నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడే ప్రపంచాన్ని అర్థం చేసుకుంటారు. భిన్న భావజాలాలు ఢీకొని కొత్త ఆలోచనలకు జన్మనిస్తాయి. ఉపాధి కోసం మాత్రమే కాకుండా సమాజం కోసం ఆలోచించే పౌరులు ఇక్కడే తయారవుతారు. దేశ భవిష్యత్తును మోయగల మేధోశక్తి విశ్వవిద్యాలయాల నుంచే వెలువడుతుంది. అందుకే విశ్వవిద్యాలయాల స్థితి ఒక దేశ దిశను నిర్ణయిస్తుంది. అవి బలంగా ఉంటే సమాజం బలంగా ఉంటుంది. అవి బలహీనమైతే ప్రజాస్వామ్యానికి పునాది చీలిపోతుంది. ఈ కారణంగానే విశ్వవిద్యాలయాలపై జరిగే ప్రతి దాడి కేవలం విద్యాపరమైనది కాదు, అది సమాజ భవిష్యత్తుపై జరిగే దాడి.*

2.ఉన్నత విద్య అనేది కేవలం డిగ్రీలు, సర్టిఫికెట్లు పొందే ప్రక్రియ మాత్రమే కాదు. అది ఒక సమాజాన్ని ఆలోచనలతో, ప్రశ్నించే ధైర్యంతో, ప్రజాస్వామ్య చైతన్యంతో నింపే శక్తివంతమైన సాధనం. భారతదేశంలో పేదలు, బడుగు వర్గాలు, గ్రామీణ యువత ఉన్నత విద్యకు చేరువైన ప్రధాన ద్వారం ప్రభుత్వ యూనివర్శిటీలు. పచ్చని చెట్ల మధ్య, విశాలమైన ప్రాంగణాలతో, హాస్టళ్లు, లైబ్రరీలు, పరిశోధనా కేంద్రాలతో ఏర్పడిన ఈ యూనివర్శిటీలు దేశానికి మేధో మూలధనాన్ని అందించాయి. కానీ ఈ రోజు అవే యూనివర్శిటీలు ఒక తీవ్రమైన ప్రమాదంలో నిలబడి ఉన్నాయి. అవి విద్యా కేంద్రాలుగా కాకుండా ఖాళీ భూములుగా పాలకుల కంటికి కనిపిస్తున్నాయి. ఖాళీ జాగ కనిపిస్తే చాలు, జింకను చూసిన పులిలా అమాంతం మింగేయాలనే ఆలోచన యూనివర్శిటీల చుట్టూ తిరుగుతోంది.

1950 తరువాత భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత ఉన్నత విద్యను సామాజిక న్యాయ సాధనంగా భావించి కేంద్రం, రాష్ట్రాలు కలిసి అనేక యూనివర్శిటీలను ఏర్పాటు చేశాయి. 1956 సంవత్సరంలో యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ యూనివర్శిటీల విస్తరణ వేగంగా జరిగింది. 1960 నుంచి 1980 మధ్యకాలంలో ప్రభుత్వ యూనివర్శిటీల సంఖ్య సుమారు 120 శాతం పెరిగింది. ఈ యూనివర్శిటీలకు విస్తారమైన భూములు కేటాయించడం వెనుక భవిష్యత్ అవసరాలపై ఉన్న దూరదృష్టి ఉంది. విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, కొత్త విభాగాలు, పరిశోధన కేంద్రాలు, హాస్టళ్లు అవసరం అవుతాయని భావించి 500 ఎకరాలు, 1000 ఎకరాలు, కొన్ని చోట్ల 2000 ఎకరాల వరకు భూమిని కేటాయించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని 1974 సంవత్సరంలో ఏర్పాటు చేసినప్పుడు దానికి సుమారు 2300 ఎకరాల భూమి ఇచ్చారు. కాకతీయ యూనివర్శిటీ, హైదరాబాద్ ఉర్దూ యూనివర్శిటీ కూడా అదే దారిలో అభివృద్ధి చెందాల్సిన సంస్థలే.

1991 సంవత్సరంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత ఉన్నత విద్య రంగంలో మెల్లగా మార్పులు వచ్చాయి. లిబరలైజేషన్, ప్రైవేటీకరణ విధానాలు విద్యను కూడా మార్కెట్ వస్తువుగా మార్చే దిశగా నెట్టాయి. 1991 నుంచి 2024 మధ్యకాలంలో ఉన్నత విద్య రంగంలో ప్రైవేటు పెట్టుబడులు సుమారు 420 శాతం పెరిగాయి. అదే సమయంలో ప్రభుత్వ యూనివర్శిటీలకు కేటాయించే బడ్జెట్ శాతం తగ్గుతూ వచ్చింది. ప్రభుత్వ భూములను పావలా ధరలకు, అర్ధ ధరలకు పెద్ద కార్పొరేట్ వర్గాలకు లీజులుగా ఇస్తూ, పేదలు చదివే యూనివర్శిటీల భూముల మీద మాత్రం అకస్మాత్తుగా కన్ను పడింది. ఇది యాదృచ్ఛికం కాదు. ఇది ఒక స్పష్టమైన విధానం.

2000 సంవత్సరంలో దేశంలో ప్రైవేటు యూనివర్శిటీల సంఖ్య 45 మాత్రమే ఉండగా, 2024 నాటికి అది 450 దాటింది. ఇది 900 శాతం కంటే ఎక్కువ పెరుగుదల. ప్రైవేటు యూనివర్శిటీల్లో ఫీజులు ప్రభుత్వ యూనివర్శిటీల కంటే సగటున 300 శాతం నుంచి 600 శాతం ఎక్కువగా ఉన్నాయి. అయినా వాటికి భూములు, పన్ను రాయితీలు, అనుమతులు సులభంగా లభిస్తున్నాయి. ప్రభుత్వ యూనివర్శిటీల్లో మాత్రం నిధులు తగ్గిస్తూ, భూములు తగ్గిస్తూ, అధ్యాపక నియామకాలను నిలిపివేస్తూ ఇవి సరిగా పనిచేయడం లేదనే ముద్ర వేస్తున్నారు. ఇది విద్యా రంగంలో జరుగుతున్న నిశ్శబ్ద కౌంటర్ రివల్యూషన్.

ప్రభుత్వ యూనివర్శిటీల్లో చదువుకునే విద్యార్థుల్లో సుమారు 65 శాతం మంది మొదటి తరం విద్యార్థులు. వీరిలో సుమారు 55 శాతం మంది గ్రామీణ నేపథ్యల నుంచి వచ్చినవారు. యూనివర్శిటీ భూములు తగ్గితే మొదటగా దెబ్బతినేది హాస్టల్ సదుపాయాలే. ఇప్పటికే అనేక యూనివర్శిటీల్లో కేవలం 60 శాతం విద్యార్థులకే హాస్టల్ వసతి ఉంది. భూములు తగ్గితే ఈ శాతం ఇంకా తగ్గుతుంది. దాంతో పేద విద్యార్థులు చదువును మధ్యలోనే వదిలే పరిస్థితి ఏర్పడుతుంది. పరిశోధన కూడా తీవ్రంగా దెబ్బతింటుంది. కొత్త ల్యాబ్‌లు, పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయలేని పరిస్థితి వస్తుంది. ఈ పరిస్థితులన్నింటికి తోడు భారతదేశంలోని మొత్తం 714 యూనివర్శిటీలు తీవ్రమైన ఆర్థిక సంక్షభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ ఖర్చు విద్యపై +ఱూలో సగటున 1.3 నుంచి 1.5 శాతం మధ్యే ఉంది. అధ్యాపక స్థానాల్లో సుమారు 40 శాతం వరకు ఖాళీలు ఉన్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి ఆగిపోయింది. పాత భవనాలు, పాడైన హాస్టళ్లు, సరిపడని లైబ్రరీలు, డిజిటల్ వనరుల కొరత ఇవన్నీ సాధారణ దృశ్యంగా మారాయి.

ఈ పరిస్థితి అలాగే కొనసాగితే 2050 నాటికి భారతదేశంలోని యూనివర్శిటీల పరిస్థితి రెండు విధాలుగా మారే ప్రమాదం ఉంది. ఒక వైపు ప్రైవేటు యూనివర్శిటీలు ఉన్నత విద్యను ధనవంతుల ప్రత్యేక హక్కుగా మార్చే అవకాశం ఉంది. మరో వైపు ప్రభుత్వ యూనివర్శిటీలు నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉంది. 2050 నాటికి ఉన్నత విద్యలో చేరే విద్యార్థుల సంఖ్య సుమారు 50 మిలియన్లకు చేరుతుందని అంచనా ఉన్నా, ప్రభుత్వ యూనివర్శిటీలను బలపరచకపోతే ఈ భారాన్ని అవి మోయలేవు. ఈ మొత్తం చర్చకు తుదిసారిగా ఒక విషయం స్పష్టంగా చెప్పాల్సి ఉంది. ప్రభుత్వ యూనివర్శిటీల భూములు, నిధులు, మౌలిక సదుపాయాలు అనేవి పాలకుల దయాదాక్షిణ్యాలు కావు. అవి ప్రజల పన్ను డబ్బుతో, ప్రజల అవసరాల కోసం ఏర్పడిన సామూహిక సంపద. వాటిని మార్కెట్ విలువలతో కొలవడం మేధో దారిద్ర్యానికి నిదర్శనం. ఒక యూనివర్శిటీ భూమి విలువ అక్కడ చదివే విద్యార్థుల కలల్లో, అక్కడ పుట్టే ఆలోచనల్లో, అక్కడ జరిగే పరిశోధనల్లో ఉంటుంది.ప్రభుత్వ యూనివర్శిటీలను బలహీనపరచడం ద్వారా తాత్కాలికంగా కొంత భూమి, కొంత డబ్బు దక్కవచ్చు. కానీ దీర్ఘకాలంలో దేశం చెల్లించాల్సిన మూల్యం అపారమైనది. ప్రశ్నించని సమాజం తయారవుతుంది. విమర్శించని యువత తయారవుతుంది. అధికారాన్ని ప్రశ్నించే ధైర్యం లేని మేధావులు పుట్టుకొస్తారు. ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి.

3.ఈ దశలో మరో కీలకమైన విషయం స్పష్టంగా గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ యూనివర్శిటీల సంక్షభాన్ని కేవలం ఆర్థిక సమస్యగా మాత్రమే చూడటం సరైన దృష్టికోణం కాదు. ఇది ఒక లోతైన సామాజిక, రాజకీయ, మేధో సంక్షభం. నిధులు తగ్గడం, భూములు తగ్గిపోవడం, మౌలిక వసతులు క్షీణించడం అన్నీ లక్షణాలు మాత్రమే. అసలు వ్యాధి ఏమిటంటే విద్యను ప్రజల హక్కుగా కాకుండా పెట్టుబడి వస్తువుగా చూడడం. ఈ ఆలోచన ఆధిపత్యం చెలాయించిన రోజునుంచే ప్రభుత్వ యూనివర్శిటీలకు అపాయ ఘడియలు మొదలయ్యాయి.

ప్రభుత్వ యూనివర్శిటీలపై ఖర్చు అనేది ప్రభుత్వానికి భారమనే వాదన వాస్తవానికి విరుద్ధం. ఒక యూనివర్శిటీలో చదువుకున్న విద్యార్థి జీవితకాలంలో సమాజానికి తిరిగి చెల్లించే మేధో, సామాజిక, ఆర్థిక విలువను ఎలాంటి బడ్జెట్ పట్టికలో కొలవలేం. ఒక మంచి అధ్యాపకుడు తయారుచేసిన విద్యార్థులు రేపటి శాస్త్రవేత్తలుగా, ఉపాధ్యాయులుగా, వైద్యులుగా, సామాజిక నాయకులుగా మారి దేశ నిర్మాణంలో పాత్ర



పోషిస్తారు. ఈ దీర్ఘకాల ప్రయోజనాన్ని విస్మరించి తక్షణ లాభాల కోణంలో మాత్రమే నిర్ణయాలు తీసుకోవడం పాలనలోని ప్రమాదకర స్వల్పదృష్టికి నిదర్శనం.

భూముల విషయానికి వస్తే, యూనివర్శిటీ భూములు ఖాళీగా కనిపించినా అవి వృథ భూములు కావు. అవి భవిష్యత్తు అవసరాల కోసం ఉంచబడిన సామూహిక సంపద. రేపు విద్యార్థుల సంఖ్య పెరిగితే కొత్త హాస్టళ్లు అవసరం అవుతాయి. కొత్త పరిశోధన రంగాలు వస్తే ల్యాబ్‌లు కావాలి. అంతర్జాతీయ స్థాయి సహకారాలు పెరిగితే అకాడెమిక్ మౌలిక సదుపాయాలు విస్తరించాలి. ఇవన్నీ ముందే ఊహించి భూములు కేటాయించారు. వాటిని ఈ రోజు అభివృద్ధి పేరుతో కుదించడం అంటే రేపటి అవసరాలను గుడ్డిగా నిరాకరించడం.

ప్రభుత్వ యూనివర్శిటీల బలహీనత చివరికి ప్రైవేటు యూనివర్శిటీలకే లాభం చేకూరుస్తుంది. కానీ ఇది ఆరోగ్యకరమైన పోటీ కాదు. ఇది అసమాన పోటీ. ఒక వైపు సబ్సిడీలు, భూములు, పన్ను రాయితీలు పొందిన ప్రైవేటు సంస్థలు; మరో వైపు నిధుల కోతలు, భూముల కోతలు, నియామకాల నిలుపుదలతో అలసిపోయిన ప్రభుత్వ యూనివర్శిటీలు. ఈ అసమానత చివరికి విద్యను సామాజిక చలన సాధనంగా కాకుండా వర్గీయ వడపోతగా మార్చేస్తుంది. సెంట్రల్ యూనివర్శిటీలైనా, స్టేట్ యూనివర్శిటీలైనా భూమి కనిపించగానే దానిపై కన్నేసే ధోరణి పెరుగుతోంది. యూనివర్శిటీ భూములు అభివృద్ధికి అడ్డుగా ఉన్నట్లుగా చిత్రీకరిస్తూ వాటిని ఇతర అవసరాలకు మళ్లించాలనే ఆలోచనలు పాలక వర్గాల్లో బలపడుతున్నాయి. నిజానికి యూనివర్శిటీ భూములు ఖాళీగా కనిపించినా అవి వృథ భూములు కావు. భవిష్యత్తులో పెరిగే విద్యార్థుల సంఖ్యకు, కొత్త పరిశోధనా కేంద్రాలకు, హాస్టళ్లకు, గ్రంథలయాలకు ముందుగానే ఉంచిన సామూహిక సంపద అవి. వాటిని తగ్గించడం అంటే రాబోయే తరాల అవకాశాలను కుదించడం.

భారత దేశంలో 2014 సంవత్సరం తర్వాత ఉన్నత విద్యపై ప్రభుత్వ వ్యయం జిడిపి లో 2 శాతం దాటలేకపోయింది. అనేక విద్యావేత్తలు కనీసం 3 శాతం అవసరమని సూచించినా ఆ దిశగా గట్టి చర్యలు కనిపించలేదు. ఫలితంగా అధ్యాపకుల ఖాళీలు పెరిగాయి, తాత్కాలిక నియామకాలు ఎక్కువయ్యాయి, పరిశోధన నిధులు తగ్గాయి. ఒక యూనివర్శిటీలో శాశ్వత అధ్యాపకుల కొరత ఉంటే విద్యా నాణ్యతపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. ఇది విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాదు, దేశ మేధో సంపత్తిని కూడా దెబ్బతీస్తుంది.

ఇదే సమయంలో ప్రైవేటు యూనివర్శిటీలకు మాత్రం ఎర్ర తివాచీలు పరుస్తూ అనేక రకాల సడలింపులు ఇవ్వడం కనిపిస్తోంది. తక్కువ ధరలకు భూములు, పన్ను రాయితీలు, వేగవంతమైన అనుమతులు అందిస్తూ వాటిని ప్రోత్సహిస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు అవసరం లేదని చెప్పలేం. కానీ అవి ప్రభుత్వ యూనివర్శిటీలకు ప్రత్యామ్నాయం కావు. ప్రైవేటు యూనివర్శిటీల ఫీజులు సామాన్య, పేద కుటుంబాలకు అందుబాటులో ఉండవు. అక్కడ విద్య ఒక హక్కుగా కాకుండా ఒక వస్తువుగా మారుతుంది. ఈ పరిస్థితి సామాజిక అసమానతలను మరింత లోతుగా చేస్తుంది. ప్రభుత్వ యూనివర్శిటీల బలహీనత వెనుక మరో కారణం పరిపాలనా జోక్యం. యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తిని క్రమంగా హరించడం ద్వారా వాటిని నియంత్రిత సంస్థలుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నియామకాలు, నిధుల వినియోగం, విద్యా విధానాలపై రాజకీయ ప్రభావం పెరిగితే అకాడెమిక్ స్వేచ్ఛ దెబ్బతింటుంది. యూనివర్శిటీలు ప్రశ్నించే కేంద్రాలుగా ఉండాలి. కానీ ప్రశ్నిస్తే శిక్షించే వాతావరణం ఏర్పడితే మేధో చైతన్యం నశిస్తుంది. భూముల విషయానికి వస్తే, అనేక సందర్భాల్లో ప్రభుత్వ భూములను పావలా ధరలకు కార్పొరేట్ సంస్థలకు లీజులిచ్చిన ఉదాహరణలు ఉన్నాయి. కానీ అదే ప్రభుత్వాలు పేదలు చదివే యూనివర్శిటీల భూములను మాత్రం అత్యంత విలువైనవిగా భావించి గుంజుకునేందుకు ప్రయత్నించడం విరోధాభాసం. ఈ భూములు ఎవరికిస్తారో, ఏ ప్రయోజనానికి వాడతారో స్పష్టత లేకపోవడం ప్రజల్లో అనుమానాలను పెంచుతోంది. పారదర్శకత లేకుండా తీసుకునే నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి ముప్పు.

భారత దేశంలో 714 యూనివర్శిటీలు ఉన్నాయి. వీటిలో చాలా యూనివర్శిటీలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో పనిచేస్తున్నాయి. ప్రయోగశాలలు పాతబడిపోవడం, గ్రంథలయాల్లో కొత్త పుస్తకాలు కొనలేని పరిస్థితి, హాస్టళ్లలో మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు సాధారణమయ్యాయి. కొన్ని యూనివర్శిటీల్లో విద్యార్థి నిష్పత్తికి అనుగుణంగా తరగతి గదులే లేవు. డిజిటల్ సదుపాయాలు, పరిశోధన పరికరాలు కొరతగా ఉన్నాయి. ఇవన్నీ కలిపి విద్యా నాణ్యతను క్రమంగా దిగజారుస్తున్నాయి. 2050 నాటికి భారత దేశ యువ జనాభా శాతం 50 దాటుతుందని అంచనాలు చెబుతున్నాయి. ఈ భారీ యువ శక్తికి నాణ్యమైన ఉన్నత విద్య అందించాలంటే ఇప్పుడే పటిష్టమైన ప్రభుత్వ యూనివర్శిటీలు అవసరం. కానీ ఇప్పటి ధోరణి కొనసాగితే 2050 నాటికి ప్రభుత్వ యూనివర్శిటీలు కేవలం డిగ్రీలు ఇచ్చే సంస్థలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. పరిశోధన, ఆవిష్కరణ, సామాజిక ఆలోచనల కేంద్రాలుగా వాటి పాత్ర తగ్గిపోతుంది. అప్పుడు దేశం జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యం దూరమవుతుంది.

అందుకే ఇప్పుడే ఒక మలుపు అవసరం. ప్రభుత్వ యూనివర్శిటీలను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. విద్యపై పెట్టుబడి పెట్టడం అంటే దేశ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడమే. భూములను కాపాడాలి, నిధులను పెంచాలి, అధ్యాపక నియామకాలను వేగవంతం చేయాలి, స్వయం ప్రతిపత్తిని గౌరవించాలి. ఇది విద్యార్థుల కోసం మాత్రమే కాదు, సమాజం కోసం, ప్రజాస్వామ్యం కోసం. ప్రభుత్వ యూనివర్శిటీలు నిలబడితేనే పేదలకు ఉన్నత విద్య అందుతుంది. పేదలకు ఉన్నత విద్య అందితేనే సమాన అవకాశాలు సాధ్యమవుతాయి. అదే నిజమైన అభివృద్ధి. ఇక ముందుకు వెళ్లాలంటే ఒక స్పష్టమైన విధాన మార్పు అవసరం. విద్యపై ప్రభుత్వ ఖర్చు కనీసం జిడిపిలో లో 3 శాతం దాటేలా పెరగాలి. అధ్యాపక ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలి. యూనివర్శిటీ భూములను చట్టపరంగా రక్షించే విధానాలు తీసుకురావాలి. ప్రైవేటు యూనివర్శిటీలకు ఇచ్చే సడలింపులను ప్రభుత్వ యూనివర్శిటీలకూ వర్తింపజేయాలి. ఇవి అసాధ్యమైన డిమాండ్లు కావు. ఇవి ప్రజాస్వామ్య దేశంలో కనీస అవసరాలు.

చివరగా ఒక విషయం. యూనివర్శిటీల కోసం పోరాటం చేయడం అంటే విద్యార్థుల కోసమే కాదు, రాబోయే తరాల కోసమే. ఇది డిగ్రీల కోసం కాదు, ఆలోచనల కోసం. ఇది భవనాల కోసం కాదు, భవిష్యత్తు కోసం. ఈ పోరాటాన్ని వాయిదా వేసే ప్రతి రోజు దేశం ఒక మెట్టు వెనక్కి వేస్తుంది. అందుకే ఇప్పుడు నిశబ్దంగా ఉండటం కాదు, బాధ్యతగా మాట్లాడటం అవసరం. ప్రభుత్వ యూనివర్శిటీలు నిలబడితేనే సమానత్వం నిలబడుతుంది. సమానత్వం నిలబడితేనే ప్రజాస్వామ్యం నిలబడుతుంది. అదే ఈ పోరాటానికి అసలు సారాంశం.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# వినియోగదారుల డేటా చోరీ ఎదురయ్యే సమస్యలు

**బీజేపీ ఆధ్వర్యంలో అదార్ పరిణామం ఒక సంక్లిష్టమైన, అలాగే వివాదాస్పద నియోలిబరల్ ప్రయోగాన్ని సూచిస్తుంది. ఇది నిజమైన ఆర్థిక చేరిక, ఆర్థిక వ్యవస్థల అసమర్థతల మధ్య ఒక అంతరాన్ని వివరిస్తుంది. సాంకేతిక సామర్థ్యం, ప్రైవేట్ రంగ విస్తరణపై దృష్టి సారించడం వల్ల సాంప్రదాయ నియోలిబరలిజం కేంద్ర లక్షణాలు బయటపడతాయి.**

బీజేపీ ఆధ్వర్యంలోని నియోలిబరల్ విధానం, అదార్ కార్డును ప్రభుత్వ సేవల కొరకు ఒక సాధనం నుండి దేశీయ-విదేశీ మూలధనం కొరకు విస్తృత ఆర్థిక డేటా వనరుగా మార్చింది. ఆరంభంలో, వ్యక్తిగత గోప్యతను హరించే మోసపూరిత పథకంగా బీజేపీ ఎద్దేవా చేసినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి విధానంలో పూర్తి మలుపు తిరిగారు. ఇప్పుడు, గతంలో వారు వ్యతిరేకించిన అదార్ చట్టాన్ని మరింత శక్తివంతంగా మార్చి, దాని అమలును వేగవంతం చేశారు. ఈ మార్పు ఒక లక్ష్యంగా పేదలకు సహాయం చేయడం కంటే, ప్రభుత్వ డేటా మౌలిక సదుపాయాలను ఆర్థిక విస్తరణ కొరకు ప్రైవేట్ రంగానికి తెర తీయటం వైపు అధిక ప్రాధాన్యతను ఇచ్చి ఊహించని మలుపు తిప్పింది. ఈ "డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చరు దాని నియంత్రణలోని పారదర్శకత లేకుండా, సామాజిక నియంత్రణ, ప్రైవేట్ నిఘా వ్యవస్థలకు పునాదిగా మార్చివేసింది.



ఈ పరిణామం ప్రధాన లక్షణం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అస్పష్టమైన సరిహద్దు. ప్రైవేట్ నిఘాకి ప్రభుత్వ మౌలిక సదుపాయాలను తెరవడం ఈ కొత్త నియోలిబరల్ మోడల్ ముఖ్యాంశం. హైపర్‌వెర్జ్ వంటి కంపెనీలు బ్యాంకు ఖాతాలు తెరవడం వంటి ప్రమాణాల కొరకు అదార్ ఆధారిత ముఖ గుర్తింపు సేవలను అందించడమే కాకుండా, వినియోగదారుల ఆర్థిక కార్యకలాపాల ప్రవర్తనను విశ్లేషించ దానికి అలాగే తమ యంత్ర అభ్యసన మోడళ్లను శిక్షణ ఇప్పించడానికి ఈ దశలను ఉపయోగిస్తున్నాయి. 2025లో ప్రారంభించబడిన రెగ్యులేటరీ శాండ్బాక్స్ ద్వారా, ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రైవేట్ సంస్థలకు ఈ మౌలిక సదుపాయాల ప్రాప్యతను అనుమతించింది, ఆ విధంగా సంక్షమ వ్యవస్థను ప్రవర్తనా డేటా సేకరణ కేంద్రంగా మార్చింది.

**ఆచరణాత్మక వైఫల్యాలు- బహిష్కరణ :** బీజేపీ "సామర్థ్యం" విధానంలో మూలభూతమైన లోపాలను బహిష్కరించాయి. ముద్రలు లేదా కనీసిస్థితి పని చేసే కెమెరాలు లేకపోవడం వంటి బయోమెట్రిక్ విఫలతలు వృద్ధులు లేదా శారీరక శ్రమలో నిమగ్నమైన వ్యక్తులను ప్రాథమిక సేవలు అలాగే ఇతర ప్రయోజనాల నుండి మినహాయించడానికి ఉపయోగించుకున్నాయి. ప్రభుత్వం ఈ సమస్యను తగ్గించి చెప్పినప్పటికీ,(యూ.ఐ.డీ.ఏ.ఐ.) దృఢమైన డేటాను విడుదల చేయడానికి నిరాకరించడం వల్ల ఈ బహిష్కరణ నిజమైన స్థాయి అస్పష్టంగా మిగిలిపోయింది. అదార్ డేటాబేస్‌లోని దోషాలు సవరించడానికి ఉన్న క్లిష్టమైన ప్రక్రియలు వినియోగదారుల డేటాను దీర్ఘకాలికంగా తప్పుగా ఉంచుతాయి, వారు ఇతర పత్రాలను ఈ విశ్వసనీయత లేని సమాచారంతో సరిపోల్చమని ఒత్తిడి చేస్తున్నారు.

భద్రతా భంగం, గోప్యత ప్రమాదాలకు సంబంధించి, ఈ నియోలిబరల్ ప్రాజెక్ట్ దాని ప్రధాన లోపాలను బహిరంగం చేస్తుంది. డార్క్ వెబ్ లో 81.5 కోట్ల భారతీయుల అదార్ మరియు పాస్పోర్ట్ నంబర్లు బహిర్గతం చేశారు. 2023లో భద్రతా భంగం వంటి సంఘటనలు, అటువంటి స్థాయి కేంద్రీకృత బయోమెట్రిక్ డేటాకు అంతర్లీనమైన ప్రమాదాలను నొక్కి చెబుతున్నాయి. ఈ విధమైన డేటా సంగ్రహణ "లింకేజ్ దాడులు" అనేక సైబర్ దాడుల ప్రమాదాలను సృష్టిస్తుంది, ఇక్కడ వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ డేటాబేస్‌లు అదార్ నంబర్ ద్వారా అనుసంధానించబడినప్పుడు, వ్యక్తుల యొక్క సమగ్ర జీవిత చరిత్రను తిరిగి నిర్మించడం సాధ్యమవుతుంది. 2023 డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం (డీపీడీపీఏ) సుప్రీంకోర్టు స్థాపించిన ప్రాథమిక గోప్యత హక్కుకు బలమైన పరిరక్షణను అందించడంలో దారుణంగా విఫలమైంది.అలాగే ఈ అంతరాలను ఉపయోగించుకోవడానికి రాష్ట్రం మరియు ప్రైవేట్ సంస్థలకు విస్తృత అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది.

చివరిగా, బీజేపీ ఆధ్వర్యంలో అదార్ పరిణామం ఒక సంక్లిష్టమైన, అలాగే వివాదాస్పద నియోలిబరల్ ప్రయోగాన్ని సూచిస్తుంది. ఇది నిజమైన ఆర్థిక చేరిక, ఆర్థిక వ్యవస్థల అసమర్థతల మధ్య ఒక అంతరాన్ని వివరిస్తుంది. సాంకేతిక సామర్థ్యం మరియు ప్రైవేట్ రంగ విస్తరణపై దృష్టి సారించడం వల్ల సాంప్రదాయ నియోలిబరలిజం యొక్క కేంద్ర లక్షణాలు బయటపడతాయి. అయితే, ఈ విధానం ప్రాథమిక ప్రజా హితాహితాలను విస్మరిస్తుంది: జవాబుదారీతనం, పారదర్శకత మరియు వ్యక్తిగత డేటా గోప్యత హక్కుల రక్షణ గాలిలో కలిసి పోయింది. రాష్ట్రాల, మూలధనం మధ్య సన్నిహిత సహకారం ద్వారా ఉపయోగకరమైన పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నుండి ప్రైవేట్ డేటా సేకరణ మరియు సామాజిక నియంత్రణ యొక్క శక్తివంతమైన ఉపకరణంగా మారడంలో అదార్ చరిత్ర భారతదేశం యొక్క రాజకీయ-ఆర్థిక దిశకు ఒక ముఖ్యమైన, ప్రమాదకరమైన దృష్టాంతాన్ని అందిస్తుంది. ప్రభుత్వం ఎలా విస్తృత సామాజిక-ఆర్థిక నియంత్రణ కోసం అదార్ కార్డు సమాచారం ఉపయోగించవచ్చో వివరించే నిర్దిష్ట ఊహాత్మక దృశ్యాలు. ఇతర దేశాలు భారతదేశం యొక్క అదార్ మోడల్ ను ఎలా అనుకరిస్తున్నాయో మరియు వారు ఏ సమస్యలను ఎదుర్కొంటున్నారో గురించి విశ్లేషణ.

ప్రత్యామ్నాయ గుర్తింపు మోడళ్లు లేదా దృఢమైన నియంత్రణలు, ఇవి అదార్ వంటి వ్యవస్థల హానిని ఎలా తగ్గించగలవు అనే విషయాలపై ఆధారపడి భారత దేశ పౌరుల (వినియోగదారుల) భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. వర్తక, వ్యాపారాలు, ఎగుమతులు, దిగుమతులు, వస్తోత్పత్తి, మొదలైన ఆర్థిక విధానాల ఆధారంగా విదేశీయుల అధికార, అనధికారుల చేతుల్లోకి భారత ప్రజల ఆసక్తులు, అభిరుచులు, కొనుగోలు శక్తి, వస్తు వ్యామోహం, డిమాండ్ ధోరణులు, బ్యాంకు లావాదేవీలు ఇలా భారత ప్రజల సమస్త సమాచారం విదేశీ శక్తుల గుప్పిట్లో ఇమిడిపోతాయి. ఈ డేటా చోరీకి మన బ్యాంకు అధికారులు, ఇతర ఆర్థిక వ్యవస్థల నిర్లక్ష్యం, నిర్లిప్తతే కారణం.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# మహా విన్నపం

ఉద్యోగ, పెన్షనర్ మితులారా..
మీరంతా మా కుటుంబ సభ్యులే..
మీ డిమాండ్లు తెలుసు
న్యాయమైనవే.. కానీ ఏం చెయ్యను..

నన్ను కోసినా
మీ కియ్యనీకె ఒక్క పైసా లేదు
ఏం చెయ్యమంటరో చెప్పండి
రాష్ట్ర ఖజానా ఖాళీ

నెల ప్రారంభంలో
నెల నెలా జీతాలియ్యదానికే
ప్రతి నెల రిజర్వు బ్యాంక్ దగ్గర
నాలుగు వేల కోట్లు చేబదులు తెస్తున్నా..

తెలంగాణా రాష్ట్ర ఖాజానా
లెక్కలు అన్నీ మీ చేతుల పెడతా
మీరే పంచండి..
ఏంచెయ్యాల్నో మీరే చెప్పండి..

ఇది ముఖ్యమంత్రి అప్పీల్

ఓపెన్‌గా పెండింగ్ డీఏలు, పీ ఆర్సీ,
దాచుకున్న పీ.ఎఫ్ డబ్బులు,
రిటైర్మెంట్ బకాయిలు ఇవ్వమని
ఏడాది పైగా మర్యాదగా
అడుగుతున్నా.. ధర్నాలు.. నిరసనలు..
ర్యాలీలతో న్యాయమైన హక్కుగా
ఆందోళనలు చేస్తున్నా
ఉద్యోగ పెన్షనర్లకు

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు
నివేదిస్తూ బహిరంగ సలహా కోరారు..

మిత్రులారా..
రాష్ట్ర పరిస్థితి ఇంత గడ్డుగా ఉన్నపుడు..
అంతటి నాయకుడే
నోరు తెరిసి అడిగినప్పుడు..,
మనం
న్యాయబద్ధమైన.., ధర్మబద్ధమైన సలహా
తెలిసికూడా ఇవ్వకపోతే
తప్పవుతుంది కదా..

ఏ బుర్రలో ఏ ఆలోచన ఉంటుందో..
ఏ నోట్లోంచి ఏ తరుణోపాయం వస్తుందో..
కదా..
నాకు తోచిన సలహా నేనిస్తున్నా..

గౌరవ ముఖ్యమంత్రిగారూ
మీకూ, మీ మంత్రివర్గ బృందానికీ
మొదటగా ధన్యవాదములు!

మీరే అన్నట్లు మేమూ మీరూ
ఎంతమాత్రమూ వేరుకాదు..
మీ కష్టం మా కష్టమే!
మా గోస మీ గోసే!!

అయిదైదేళ్ళకోసమని వచ్చిన
మీ కంటే.. మీముందు వొచ్చెల్లి పోయిన
వాళ్లెందరి కంటేనో
ముప్పై, నలభై ఏళ్ల ముందే
ప్రజా సేవలో ఉన్నోళ్ళం..

అదలా ఉండనీ లెండి..



డైరెక్టుగా విషయంలో కొచ్చేద్దాం..

పదిహేడు వేలకోట్ల మిగులుతో
ఏర్పడ్డ తెలంగాణాకు
పన్నెండేళ్ల తర్వాత
మీరు రెండో నాయకులు..

మీకన్నా ముందుండిపోయిన దొంగ
ఖాజానా ఖాళీ చేసెల్లిపోయిన సంగతి
తెలిసి పగ్గాలు పడితిరి..
చెయ్యాలిసి ఉండీ చెయ్యకుండ
ఇడిసెల్లిపోయిన పనులన్నీ
నేన్జేస్త అనిగదా వొస్తిరి..

రోడేండ్లు గడువ వొచ్చే..,
మీ సగం కాలం ఎల్లిపాయె..
మాదుడ్లు మీకాడనే ఉండిపాయె..
ఆలుపిల్లల రోగాల కనీ.. పెండ్లిళ్ల కనీ..
ఇండ్లు కట్టుకుందమని పెట్టుకున్న ఆశలు
అడియాశలాయే.. పానాలు బాయే..

మిమ్మల్ని కోసినా లాభం లేదంటిరి..
అంతమాటెందుకు లేండి..
మీరు సల్లంగుండాలే..

మా బాధ మీదీ..,మీ బాధ మాది
కదా సారూ..
ఇన్నేండ్లు మేం ఓపిక వట్టి భరించినం..
ఇగ ఈ రెండున్నరేళ్లు మీరూ..
మీ మంత్రివర్గమూ..,మీ ఎమ్మెల్లేలందరూ

ప్రభుత్వ ఖాజానా నుంచి పొందుతున్న
జీత భత్యాలూ..
అన్ని రకాల అలవెన్సులూ..
వొదులుకోండి..
అట్లా పోగైన డబ్బులు
మా ఉద్యోగ పెన్షనర్లకు
ఏళ్లుగా బకాయి పడిన..
మా కొంపలు ఆర్పిన మా డబ్బులు..
మా కిచ్చేయండి..
ఒకే కుటుంబ సభ్యులమైన మా బాధ
మీరూ పంచుకున్న పుణ్యం

మీకూ దక్కుతుంది..
మీరెలాగూ నెలజీతాల కోసం
సెలెక్ట్ అయ్యొచ్చిన ఉద్యోగులు కాదు.
కేవలం సేవకోసం స్వచ్ఛందంగా
ఎన్నికల్లో నిలబడి వొచ్చిన
ప్రజాస్వామ్య ప్రతినిధులు..
నిజమైన ప్రజా సేవకులు..

మీరెంతో బాధ్యతగా.. మా పట్ల ప్రేమతో..
ఓపెన్‌గా అడిగినందుకు ఇస్తున్న
ఈ సలహా
మీ కేమాత్రమూ ఇబ్బందికరం కాదనీ..
కాకూడదనీ ఆకాంక్షస్తూ..
మీ సహచర మిత్రుల్ని అర్థం చేయించి
ఒప్పించి సత్వర అమలుకు
పూనుకుంటారని ఆశిస్తూ..

మీ
కుటుంబ సభ్యుల
ఉద్యోగ పెన్షనర్
మిత్రులపక్షాన...



డాక్టర్. ఇక్బాల్ పాషా
9440775732

# జీహెచ్ఎంసీ విలీన డీలిమిటేషన్‌కు బీజేపీ తీవ్ర వ్యతిరేకం

- ఎంఐఎంతో కుమ్మక్కై డీలిమిటేషన్ కుట్ర
- రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ ఉనికిని కోల్పోయే కుట్ర జరుగుతుంది
- కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, జనవరి 9 (జనంసాక్షి) :** హైదరాబాద్ చుట్టుపక్కల మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ చేపడుతున్న డీలిమిటేషన్ బై వెరిఫికేషన్ ప్రక్రియను బీజేపీ పార్టీమొదటినుంచి తీవ్రంగా ఖండిస్తోందని, రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్, మైలార్ దేవ్ పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో స్థానిక బిజెపి నాయకులతో కలిసి ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా తప్పుడు విధానాలతో డీలిమిటేషన్ చేపట్టి, ఎంఐఎం పార్టీకి ధారా దత్తం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాన్ని విభజిస్తూ రెండు భాగాలుగా చేయడం ద్వారా ముస్లిం మైనార్టీ ఓట్లను కేంద్రీకరించి, రాజేంద్రనగర్, శంషాబాద్ ప్రాంతాల ఉనికిని లేకుండా చేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు.అదే విధంగా శంషాబాద్ పరిధిలోని రెండు డివిజన్లు, నార్సింగ్, బండ్లగూడ ప్రాంతాల్లో మొదటి నుంచే స్థానిక ప్రజలు ఈ విలీనానికి వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్న తమ నియోజకవర్గాన్ని హైదరాబాద్ కమిషనరేట్‌లో కలపడం వెనుక ఎంఐఎంతో చేతులు కలిపి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కుట్ర పూర్వకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఎంఐఎం ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను రాజేంద్రనగర్, శంషాబాద్‌లలో విలీనం చేయడం ద్వారా రంగారెడ్డి జిల్లా అస్తిత్వం పూర్తిగా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో "అసలే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే మనకు అవసరమా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఆయన విమర్శించారు. రాజకీయ ఊసరవెల్లిలా పార్టీలు మారుతూ, అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెప్పుకొచ్చిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఈ కీలక అంశంపై శాసనసభలో ఒక్కసారైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో విలీనం చేయొద్దని సామాన్య ప్రజలు కూడా డిమాండ్ చేస్తున్నప్పటికీ, అసెంబ్లీలో ఈ విషయంపై మౌనం వహించడం ఎందుకని ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ఇది న్యాయమా అని ప్రశ్నిస్తూ, శివరాంపల్లి ప్రాంతాన్ని సులేమాన్ నగర్‌లో కలపటంపై కౌన్సిల్‌లో ప్రశ్నిస్తే, ఎమ్మెల్యే మాత్రం ఎందుకు ప్రశ్నించలేదని ఆయన విమర్శించారు. పోలీస్ కమిషనరేట్ మార్పులు, డివిజన్ల పునర్విభజన అన్నీ ఎంఐఎంతో కుమ్మకై జరుగుతున్నాయని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి, ప్రజల పక్షన నిలబడి అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తి రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని కాపాడాలని, ఇందుకు అన్ని పార్టీల మద్దతు ఉంటుందని కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు.

## హెచ్‌సీటీ పనులను సత్వరమే పూర్తి చేయండి

- బల్దియా అడిషనల్ కమిషనర్ శ్రీజన



**శేరిలింగంపల్లి, జనవరి 9 (జనంసాక్షి) :** హెచ్‌సిటి పనులు సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ శ్రీజన పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే తదితర అధికారులతో కలిసి శుక్రవారం ఆమె శేరిలింగంపల్లిలో కొనసాగుతున్న హెచ్ సిటి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ సిటి పనులలో భాగంగా గుల్మోహర్ పార్క్ నుండి తారా నగర్ ఫ్లైఓవర్, అమీన్పూర్ రోడ్డు, ఆల్విన్ కాలనీ చౌరస్తా ఫ్లైఓవర్ పనుల పురోగతిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధికారులను పనులు కొనసాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి భూసేకరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, అవి పూర్తయిన తర్వాత సర్వీస్ రోడ్డులో చేపట్టి అమలులోకి తెస్తామని ప్రాజెక్టు ఇంజనీర్లు అడిషనల్ కమిషనర్ కు వివరించారు. ఈ క్రమంలో ఖాజా గూడా జంక్షన్ లోని ప్రతిపాదిత ఫ్లైఓవర్, అండర్పాస్ బ్రిడ్జి స్థలాన్ని సైతం అడిషనల్ కమిషనర్ పరిశీలించడం గమనార్హం. ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చుపెట్టి చేపడుతున్న అభివృద్ధి పనుల విషయంలో అధికారుల ఉదాసీనత పనికిరాదని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా నాణ్యతతో కూడిన పనులను చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డిసి ప్రశాంతి, సిసిపి వెంకన్న, సిటీ ప్లానర్ శ్యామ్, ఏసిపి వెంకటరమణ, ప్రాజెక్టు డిఈ హరీష్, ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ఆకస్మిక తనిఖీ



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 9 (జనం సాక్షి) :** ఏనుగొండలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లలకు కల్పిస్తున్న వసతులు, బోధనా, భోజన నాణ్యత, తదితర అంశాలపై విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సెలవుల సమయంలో ఆట పాటలతో పాటు మంచి అలవాట్లు అలవరచుకోవాలని, తల్లిదండ్రుల మాట వినాలని, చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యార్థినులకు సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు గణితం, సైన్స్, తదితర బోధన విషయాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తదనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్, పప్పులో ఆకుకూరలు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. వంట సిబ్బంది ఇచ్చిన వివరణకు కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ మధ్యాహ్న భోజనం మెనూ తప్పకుండా పాటించాలని, లేని పక్షంలో చర్యలు పప్పవని హెచ్చరించారు. అనంతరం స్టోర్ రూమ్, సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. అక్కడే ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడిన కలెక్టర్, సంక్రాంతి సెలవుల్లో పిల్లలతో సమయం గడపాలని, వారి అలవాట్లను గమనిస్తూ మంచి సూచనలు ఇవ్వాలని సూచించారు. కేజీబీవీలో విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన తల్లిదండ్రులు, తమ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అన్ని సౌకర్యాలు అందుతున్నాయని తెలిపారు.

## ప్రాణం మీదికి తేచ్చిన సర్జరీ(ఆపరేషన్)

- రెండు సంవత్సరాల తర్వాత చేతికి ఇన్ఫెక్షన్
- తిరిగి సర్జరీ చేస్తే ప్రాణాలకు ప్రమాదం అంటున్న నిమ్స్ ఆసుపత్రి వైద్యులు
- షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల ముందు మహిళా కంటతడి..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 9 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం పద్మావతి కాలనీకి చెందిన బైరమోననీ జ్యోతి (42) ఇంటి వద్ద నివాసం ఉంటూ చిన్నపాటి పనులు చేసుకోని జీవనం కొనసాగించేది చేతికి బోక్క విరగడంతో రెండు సంవత్సరాల క్రితం షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది షాద్ నగర్ ప్రభుత్వసుపత్రి వైద్యులు సర్జరీ చేశారు ఆ తర్వాత కొంతకాల బాగానే ఉన్నా రెండు నెలల క్రితం చేతికి తీవ్ర స్థాయిలో ఇన్ఫెక్షన్ కావడంతో మళ్ళీ తిరిగి సర్జరీ చేసిన షాద్ నగర్ ప్రభుత్వసుపత్రి వైద్యులను సంప్రదించడంతో ఇన్ఫెక్షన్ అయిన చోట వైట్ సిమెంట్ పట్టి వేశారు వైద్యులు మొదటి సర్జరీ సక్సెస్ గా అయిందని రెండవ సర్జరీ సమయంలో చేతికి ఇన్ఫెక్షన్ వచ్చిందని అది తీవ్ర స్థాయికి వెళ్లిందని షాద్ నగర్ ప్రభుత్వస్పత్రి వైద్యులు తెలిపారు తము సర్జరీ బాగానే చేశామని ఎందుకు అలా జరిగిందో తెలియదని చెప్తుండగానే ఆ వైద్యుల ముందు సర్జరీ చేయించుకున్న బాధితురాలు భైరమోని జ్యోతి కంటతడి పెట్టుకుంది ఆ తర్వాత నీమ్స్ ఆస్పత్రికి వెళితే తిరిగి సర్జరీ చేస్తే మీ ప్రాణాలకు ప్రమాదం ఉందని దానికి ఇప్పుడు మేమేం చేయగలమని చెప్పారని ఆవేదన వ్యక్తం చేస్తుంది బాధితురాలు నిమ్స్ ఆసుపత్రి వైద్యులే చేతులెత్తేసే వరకు వచ్చిందంటే ఆ మహిళ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు ఇక్కడ సర్జరీ చేసిన వైద్యులది తప్పు? నిర్లక్ష్యం ఎవరిదో కానీ చేతికి అయిన సర్జరీ ఆమె ప్రాణాల మీదికి తెచ్చింది.

# జోరుగా రేషన్ బియ్యం అక్రమ దందా..!

- పేదల రేషన్ బియ్యం దందాపై అధికారులు మౌనం
- చేవెళ్ల పరిధిలోని పామెన శివారులో సన్న రేషన్ బియ్యం నిల్వలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 9 (జనంసాక్షి) :** పేదవాడి ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం.... అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పామేన గ్రామ శివారుల్లో పీడీఎస్ రేషన్ బియ్యం అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది నాగర్ గూడ – చేవెళ్ల హైవేకు ఆనుకుని ఉన్న ఓ రహస్య గోడౌన్ వేదికగా ఈ నల్లబజారు దందా నిరాటంకంగా కొనసాగుతోంది..

### ఆటోల్లో రాక..కంటైనర్లలో పక్క రాష్ట్రాలకు పోక!

స్థానికుల సమాచారం ప్రకారం, ఈ ముఠా నెట్‌వర్క్ చాలా పెద్ద ఎత్తున కొనసాగుతుంది. చేవెళ్ల మరియు షాద్ నగర్ నియోజకవర్గాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకే రేషన్ బియ్యాన్ని సేకరిస్తూ ఈ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఆటోలు మరియు టాటా ఏసీ వాహనాల్లో పామేన శివారులోని సదరు గోడౌన్‌కు తరలిస్తారు.గోడౌన్‌లో భారీ నిల్వలు పేరుకుపోయిన తర్వాత, రాత్రికి రాత్రే పెద్ద పెద్ద లారీలు మరియు కంటైనర్ల ద్వారా పక్క రాష్ట్రాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

### అధికారుల అండదండలేనా..?

హైవేకు అతి సమీపంలోనే ఇంత పెద్ద ఎత్తున అక్రమ దందా సాగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "స్థానిక అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా జరుగుతోంది" అని గ్రామస్తులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు నిఘా వ్యవస్థ వైఫల్యం చెందిందా? లేక అక్రమార్కులతో అధికారులు చేతులు కలిపారా? అనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి

### ప్రజల డిమాండ్..

ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తూ, పేదల బియ్యన్ని



వ్యాపార వస్తువుగా మార్చిన ఈ ముఠాపై జిల్లా కలెక్టర్ మరియు ఉన్నత స్థాయి పోలీసు అధికారులు తక్షణమే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పామేన శివారులోని ఆ గోడౌన్‌పై దాడులు నిర్వహించి, ఈ మాఫియా వెనుక ఉన్న అసలు సూత్రధారులను కఠినంగా శిక్షంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

- ప్రతిభావంతులైన క్రీడాకారులకు నెలవు మెదక్ జిల్లా
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 9 (జనం సాక్షి) :** గ్రామీణ యువత పల్లె స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు ముఖ్యమంత్రి కప్ (సి.యం కప్) టార్చ్ ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ , జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య,యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తో కలిసి టార్చిని వెలిగించి జెండా ఊపి ప్రారంభించారు. సీఎం కప్ ర్యాలీ పటిష్టంగా నిర్వహించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మాట్లాడుతూ, సి.యం కప్ టార్చ్ ర్యాలీ ప్రధాన లక్ష్యం గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడల వైపు ఆకర్షించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటేలా ప్రోత్సహించడమేనని తెలిపారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సీఎం కప్ అబశ్రీశ్రీ క్రీడా కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టామన్నారు . ఆసక్తి గల క్రీడాకారులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తెలంగాణకు సంబంధించి స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించే దిశగా అబశ్రీశ్రీ ముందుకు. పోతుందని గుర్తు చేశారు. పల్లెలోని యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని, దీనివల్ల శారీరక దృఢత్వం తో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా లభిస్తుందన్నారు. అలాగే తాము ఎంచుకున్న క్రీడల్లో కష్టపడి రాణిస్తే పల్లె స్థాయి నుండి ప్రపంచ స్థాయి ఛాంపియన్లుగా ఎదుగొచ్చని అన్నారు. సి.యం కప్ ద్వారా ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు క్రీడా ప్రతిభను ప్రదర్శించుకునే గొప్ప వేదికను కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి సాధన చేసి, జిల్లా లోనే కాక జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు, ఎన్.సి.సి క్యాడెట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, వ్యాయామఉపాధ్యాయులు, క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



**తాండూరు, జనవరి 9 (జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య లక్షమని కాంగ్రెస్ పార్టీ దేవనుర్ గ్రామ కమిటీ అధ్యక్షులు పెద్దపులి ఖాసీం, గ్రామ యువనాయకులు పేర్కొన్నారు.శుక్రవారం యాలాల మండలం దేవునూర్ గ్రామం ఎనిమిదో వార్డులో నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దృష్టికి దేవనూర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి బోరు వేయించాలని నాయకులకు ఆదేశించారు.దీంతో గ్రామంలో బోర్ వేయించి బోరుబావికి మోటర్ బిగించి నీటి సమస్యను పరిష్కరించారు.దేవనూరు గ్రామంలో నీటి సమస్య తీర్చినందుకు గాను గ్రామ ప్రజలు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న వేసవి కాలనీ దృష్టిలో పెట్టుకొని ప్రజలకు నీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా బోరు మోటర్ బిగించి నీటి కష్టాలు తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువ నాయకులు వడ్ల శ్రీనివాస్, హన్మ్య నాయక్, కె ఎన్ ఎస్, బి పరమేశ్వర్, కోస్గిరవి గౌడ్, బొడ్కా ఎల్లప్ప, డి శ్రీనివాస్ మహబూబ్ అలీ, మొగులయ్య, యం చెన్నప్ప, యం నర్సింలు,4వార్డు నెంబర్ చిన్నిలి,ప్రవీణ్ కుమార్ వి లక్ష్మణ్, నగేష్, మంత్రి శ్రీనివాస్, కె గోపాల్, రఫిక్, హాజీ ముస్తఫా, యం శ్రీనివాస్, మేరాజు కె మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

# అందరం కలుద్దాం..ఐక్యంగా పనిచేద్దాం..

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, జనవరి 9 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీలో పాత కొత్త అనే తేడా లేకుండా అందరం కలిసిపోయి పార్టీ పటిష్టత కోసం ఐక్యంగ పనిచేయాలని వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర స్పోర్ట్స్ అథరిటీ చైర్మన్ శివసేన రెడ్డి లు పేర్కొన్నారు.శుక్రవారం వనపర్తి పట్టణంలోనే ఆర్.జి గార్డెన్స్ లో నిర్వహించిన వనపర్తి మున్సిపాలిటీ 33 వార్డుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు,రానున్న వనపర్తి మునిసిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండానే ఎజెండాగా భావించి ప్రతి ఒక్కరు పని చేయాలని వారు సూచించారు.ఫామ్ హౌసుల పాలన దూరం చేసేందుకు వనపర్తి పట్టణంలోని ప్రతి ఒక్కరూ పనిచేశారని దాంతో బీఆర్ఎస్ అరాచక పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి సంక్షమ పథకలను అందజేస్తుందని వారన్నారు..మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన వ్యక్తులే ప్రతి చోట గెలిచారని అక్కడక్కడ కొందరు పిలిచినంత మాత్రాన మనం నిరాశ చెందాల్సిన అవసరం లేదని వారు సూచించారు.కాంగ్రెస్ పార్టీ ప్రాణంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో పాత కొత్త వేగం లేకుండా ప్రతి ఒక్కరికి ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం,5 లక్షల నుంచి ఆరోగ్యశ్రీని పది లక్షలకు పెంచడం,200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వడం,ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు,సన్న బియ్యం,మహిళా సమాఖ్య, మహిళల భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు,లాంటి అనేక పథకాలు చేపట్టి నిరుపేదల సంక్షమానికి పాటు బడిందన్నారు. వనపర్తి పట్టణంలోని 33 వార్డులకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు 100 కోట్ల రూపాయలకు సంబంధించిన అభివృద్ధి పనులు చేపట్టామని వారు పేర్కొన్నారు.చేసిన పని చెప్పుకోవడంలో మనం వెనుకబడి పోతున్నామని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారన్నారు.కాంగ్రెస్ పార్టీ బీఫామ్ తో ఎవ్వరి పేరును సూచించిన ప్రతి ఒక్కరు వారి గెలుపు కోసం పనిచేయాలని వారన్నారు. రిజర్వేషన్ల ప్రకారం క్షత్రస్థాయిలో వ్యక్తుల ప్రాధాన్యతను బట్టి సర్వేలు చేయించి గెలుపు బాటలో ఉండే ప్రతి ఒక్కరికి టికెట్లు అందుతాయని వారికి ప్రమోషన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మనస్ఫూర్తిగా పనిచేయాలని వారు సూచించారు. ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులకు సైతం అవకాశం ఉన్నచోట వాళ్ళకు కూడా ప్రాధాన్యత ఇవ్వబడుతుందని వారన్నారు. మున్సిపాలిటీలో ఉన్న ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీకి సమానులేనని వర్గపోరుతో పార్టీకి నష్టం వచ్చే పనులు చేయకూడదన్నారు.ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి రెండు సంవత్సరాల కాలంలో వనపర్తి నియోజకవర్గ పరిధిలో దాదాపు రెండువేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని వారు తెలిపారు.అందులో వనపర్తి పట్టణానికి 807 కోట్ల రూపాయల బ్రిటి పనులు చేపట్టామని వారు పేర్కొన్నారు.రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులను నిర్ణయించాల్సి వస్తోందని ఎవరు కూడా నిరాశ చెందకూడదన్నారు.ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేయాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పిసిసి సభ్యులు శంకరప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, శ్రీలత రెడ్డి, తిరుపతయ్య గౌడ్, బి కృష్ణ, పుట్టపాకుల మహేష్, ధనలక్ష్మి, పట్టణ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



**మల్కాజిగిరి, జనవరి 9 (జనంసాక్షి) :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి, వాటిని సమర్థవంతంగా పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మల్కాజిగిరి జోనల్ పరిధిలో అధికారులతో కలిసి పర్యటించారు పర్యటించారు. ఏఓసీ నుంచి నేరెడ్ మెట్ లోని రామకృష్ణాపురం వరకు ఉన్న ప్రధాన రహదారులను ఆయన స్వయంగా పరిశీలించారు.మార్గంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి మరియు రైల్వే ఓవర్ బ్రిడ్జి ల నిర్వహణ, ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు.రహదారులపై ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు.అనంతరం మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి అడిషనల్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ శ్రీ సంచిత్ గంగ్వార్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ శ్రీమతి జకీయా సుల్తాన, మౌలాలి డిప్యూటీ కమిషనర్ గోపాల్ రావు, టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి సంగీత మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
10 జనవరి 2026

# క్రీడాకారులు గెలవాలనే ఏకైక సంకల్పంతో పోటీ పడాలి

● వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి బ్యూరో, జనవరి 9 (జనంసాక్షి) :** క్రీడాకారులు గెలవాలనే ఏకైక సంకల్పంతో పోటీ పడాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం జనవరి, 17 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న సి.యం. కప్ రెండవ ఎడిషన్ క్రీడలకు సంబంధించి శుక్రవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం లో స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర స్పోర్ట్స్ అథరిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ క్రీడా జ్యోతిని వెలిగించి కొత్త బస్టాండ్ మీదుగా జరిగే ర్యాలీని ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి క్రీడా జ్యోతి పట్టుకొని ఉల్లాసంగా, క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ పరుగెత్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించే విధంగా సహకారం అందిస్తామని అన్నారు. క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చేందుకు పులి, జింక గురించి వివరించారు. జింక కంటే పులి తక్కువ వేగంతో పరిగెడుతుందని కానీ జింకను ఎలాగైనా పట్టుకోవాలనే పట్టుదలతో ఉంటుందని అదే జింక ఎక్కడ నేను దొరికిపోతానో అనే భయంతో పరిగెడుతూ పులికి దొరికిపోతుందన్నారు. క్రీడాకారులు సైతం గెలవాలి అనే ఏకైక సంకల్పంతో పోటీ పడాలని ఉద్బోధించారు. విద్యార్థులు ఇతరత్రా వ్యాపకాల మీద కాకుండా చదువు, క్రీడల పై మాత్రమే దృష్టి పెట్టాలని సూచించారు. వనపర్తి జిల్లాకు క్రీడాపర్తి అని సైతం పేరుందని, వనపర్తి జిల్లా నుండి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదువుకొని, ఇదే మైదానంలో ఫుట్ బాల్ ఆడారని ఇదే మైదానంలో ఆడుతున్న క్రీడాకారులు స్ఫూర్తిని పొందాలని సూచించారు. వనపర్తి జిల్లాలో క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. సర్వే నెంబర్ 55 లో 25 ఎకరాల స్థలంలో స్పోర్ట్స్ స్కూల్ కు కేటాయించడం జరిగిందని, హాకీ గ్రీన్ టార్ఫెట్, స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. స్పోర్ట్స్ అథరిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ 2032లో భారత దేశానికి వచ్చే గోల్డ్ కప్‌లలో ఒకటి వనపర్తి జిల్లా నుండి కొట్టి ఉండాలని వనపర్తి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షంచారు. గెలుపు ఓటముల మధ్య తేడా చాలా స్వల్పంగా ఉంటుందని, ఆ తేడాను అధిగమించిన వారు విజేతలుగా నిలుస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, గ్రామస్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసేందుకు సి.యం. కప్ గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో నిర్వహించి బాగా రాణించిన వారికి రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వెలికి తీసి అకాడమీలో చేర్పించి నైపుణ్య శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో రాణించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఒక క్రీడా మైదానం ఏర్పాటు చేసి అవసరమైన క్రీడా సామాగ్రి అందుబాటులో ఉంచే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు క్రీడలకు రాష్ట్రంలో 840 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు సి.యం. కప్ ను గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని గ్రామీణ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సి.యం. కప్ క్రీడల్లో భాగస్వాములు కావాల్సిందిగా పిలుపునిచ్చారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి నుంచే గెలుపు ఎలా సాధ్యమో నేర్చుకోవచ్చన్నారు. గత సి.యం. కప్‌లో వనపర్తి క్రీడాకారులు రాణించి రన్నర్ గా నిలిచారని, ఈసారి విన్నర్‌గా రావాలని తెలియజేశారు. పట్టణంలో బాడ్మింటన్ కోర్టు, జిమ్ తదితర ఏర్పాట్లు చేయడం జరిగిందని వీటిని సద్వినియోగం చేసుకొని క్రీడా నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ నాలుగు గోడల మధ్య నేర్చుకునే పాఠాలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని కానీ క్రీడా మైదానంలో నేర్చుకొనే విషయాలు జీవితానికి కావాల్సిన నైపుణ్యం అందిస్తుందన్నారు. జీవితంలో వచ్చే అనేక చాలెంజ్ లను సులువుగా గెలిచే విధంగా క్రీడలు నేర్పిస్తాయని తెలియజేశారు. ఓటమి కూడా ఆటలో ఒక భాగమే అని దాని నుండి గుణపాఠాలు నేర్చుకొని విజయం సాధించాలని సూచించారు. వనపర్తి మార్కెట్ కమిటి చైర్మన్ పి శ్రీనివాస్ గౌడ్, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ కుమార్ రెడ్డి, డి.ఈ.ఓ అబ్దుల్ ఘని, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, డీఎస్పీ వెంకటేశ్వర రావు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ పొలమోని కుమార్, పిడి లు, పి. ఈ టి లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకం

● పాలమూరు విభాగ్ సంఘటన మంత్రి కాయం నవేంద్ర




**మక్తల్, జనవరి 9 (జనంసాక్షి) :** స్వామి వివేకానంద ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకమని పాలమూరు విభాగ్ సంఘటన మంత్రి కాయం నవేంద్ర అన్నారు. జనవరి 12 న స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మఖ్తల్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సెమినార్ లో సరస్వతి దేవి, వివేకానంద చిత్రపటాలకు పూలమాలవేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. పాలమూరు విభాగ్ సంఘటన మంత్రి కాయం నవేంద్ర మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని,విద్య, విలువలు, సమాజ సేవతో యువత ముందుకు సాగితే భారతదేశం విశ్వగురువుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, మక్తల్ నగర అధ్యక్షులు అంజి రెడ్డి, కళాశాల అధ్యక్షులు ఇందు, విజయలక్ష్మి, రాకేష్, ఆనంద్, నవీన్, పవన్, ఎబివిపి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీబీ జీ రామ్ జీ చట్టని తక్షణమే రద్దు చేయాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథరిటీ చైర్మన్ శివసేన రెడ్డి



**వనపర్తి బ్యూరో, జనవరి 9 (జనంసాక్షి) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలనీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి లు అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థికంగా ఆసరాగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్న.. అక్కస్‌తో బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రపై ప్రజలు ఉద్యమించాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ డిసిసి అధ్యక్షులు శంకర్ ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారీ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వం

● మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**నంగునూర్, జనవరి 9 (జనం సాక్షి) :** రైతుల పాలిట శాపంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. నంగునూర్ మండల్ నర్మెట్ట గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నీ శుక్రవారం రోజు సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కోతలు, ఎరువుల గోస, రైతుబంధు ఎగవేత, సన్న వడ్లకు బోనస్ ఎగవేత, అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను నడ్డి విరుస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్ రెడ్డి కావాలనే కక్ష కట్టాలని ఆరోపించారు. 30 నుంచి 40 కోట్లు ఖర్చు చేస్తే మెదక్, సిద్దిపేట జిల్లాల పరిధిలో రెండు లక్షల ఎకరాల సాగునీరు అందించవచ్చు అని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజ్ అవసరం లేకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ ప్రారంభించి నీరు అందించే అవకాశం ఉందన్నారు. పంటల బీమా పేరుతో రైతులను మోసం చేశారన్నారు. నర్మెలో నిర్మించిన ఆయిల్ఫామ్ ఫ్యాక్టరీ టిఆర్ఎస్ ప్రభుత్వం కృషి వల్ల సాధ్యమైందని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి నీరు రావడం వల్ల వాతావరణంలో తేమశాతం పెరిగి కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు లభించాయని అన్నారు. ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీలో సాధ్యమైనంత తొందరగా రిఫైనరీ యూనిట్ కూడా ప్రారంభించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అశోక్ నగర్ లోని సినిమా థియేటర్ ప్రారంభోత్సవానికి వెళ్లే ముందు సెంట్రల్ లైబ్రరీకి వెళ్లి నిరుద్యోగ యువతను కలవకుండా తోక ముడుచుకొని వెళితే అది యువతను మోసం చేసినట్టే అని హరీష్ రావు అన్నారు. ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సెంట్రల్ లైబ్రరీకి వచ్చి నిరుద్యోగులు మోసం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాధా కిషన్ శర్మ , మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి , మాజీ ఆల్ఫా రైతు వెల్ఫేర్ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి , మాజీ ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య, మండల అధ్యక్షులు లింగం గౌడ్ ,మా జి పిఏసిఎస్ చైర్మన్లు కోల రమేష్ గౌడ్ ఎల్లంకి మైపాల్ రెడ్డి, బద్దిపడగ కిష్టారెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, టిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరీ బాధ్యత

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 9 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ఎస్పి.డాక్టర్ వినీత్ అన్నారు.నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం రోడ్డు భద్రతకు సంబంధించిన సూచిక బోర్డులను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఆర్ టి ఎ సభ్యుడు పి.రాజు,డి టి ఓ అ మెగా గాంధీ తో కలిసి పంపిణీ చేశారు. రోడ్డు భద్రత నియమాలు, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా స్కూల్ జోన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయుటకు "గో స్లో", సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదు, మద్యం సేవించి వాహనాలు నడపరాదు, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, రాంగ్ రూట్లో వాహనాలు నడపరాదు అనే స్లోగన్లతో రూపొందించిన మొత్తం 18 రోడ్డు భద్రత సూచికల బోర్డులు ఉన్నాయి.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా పాఠశా లలు, కళాశాలల సమీప ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు నెమ్మదిగా తమ వాహనాల ను నడపాలని సూచించారు.ఈ విలువైన సూచిక బోర్డులను అందించిన ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.మొదటగా జిల్లా కేంద్రంలో ఈ సైన్‌బోర్డులను ఏర్పాటు చేయడం అభినందనీయ మని, తదుపరి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రధాన రహదారుల వద్ద ఈ సూచిక బోర్డులను ఏర్పాటు చేసి వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. నేటి బాలలే భావి భారత పౌరులని, అలాంటి విద్యార్థుల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీ సులు,రవాణా శాఖ సమన్వ యంతో ఈ చర్యలు చేపట్టిన ట్లు పేర్కొన్నారు.అలాగే రోడ్డు నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. జిల్లా రోడ్డు భద్రత మసోత్సవాల సందర్భంగా జిల్లా పరిధిలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, ఆర్ఐలు నరసింహ, విజయ్ భాస్కర్, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

**మఖ్తల్, జనవరి 9 (జనంసాక్షి) :** 2010 లోపు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మఖ్తల్ మండలంలోని మంతన్ గోడ్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనను వ్యక్తం చేశారు. 2010లోపు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, నూతన జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు ఇవ్వాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్, సూర్యచంద్ర, శ్రీనివాసరావు, లక్ష్మి నరసింహ చారి, సునంద, శ్రీకాంత్, పరమేశ్వరి, మంజుల, మమత, తదితరులు పాల్గొన్నారు.




## ప్రారంభమైన నీటి వనరుల గణన



**న్యాల్‌కల్, జనవరి 9 (జనం సాక్షి) :** గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో ప్రస్తుతమున్న నీటి వనరుల సౌకర్యం, భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి సాగునీరు అందించేందుకు చర్యల్లో భాగంగా.."నీటి వనరుల గణన" కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు శుక్రవారం స్థానిక తహసిల్దార్ ప్రభు పర్యవేక్షణలో.. ఏఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, మండలానికి చెందిన 8గురు ఏఎస్‌ఓలు,12గురు జీపీఓలు, 16గురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టనున్నారు. శుక్రవారం తొలిరోజు సర్వేలో భాగంగా.. మండల కేంద్రమైన న్యాల్‌కల్, మెటల్ కుంట గ్రామంలో..'నీటి వనరుల గణన" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 9 నుండి జనవరి చివరి తేదీ వరకు గ్రామాల వారిగా అధికారుల బృందం "గణన" చేపట్టనున్నారు. ప్రతి 5 సంవత్సరాలకు ఓ మారు "నీటి వనరుల గణన" సర్వేను ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టనుంది. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు సర్వేలో పాల్గొన్నారు.

## నోడల్ అధికారులు విధులను పారదర్శకంగా నిర్వహించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 9 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ త్వరలో విడుదలవుతున్న నేపథ్యంలో నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షంచారు. గత పంచాయతీ ఎన్నికల నిర్వహణ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు ఏ సమయంలోనైనా నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉందని సంసిద్ధంగా ఉండాలన్నారు. నోటిఫికేషన్ విడుదలైన దగ్గర నుంచి విధులు కేటాయించిన నోడల్ అధికారులు బాధ్యతగా వారి విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలలో మున్సిపల్ కమిషనర్స్ రోల్ కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్స్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించాలి

● ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

● వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి

**వనపర్తి బ్యూరో, జనవరి 9 (జనంసాక్షి) :** యువత, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ఎస్పీ సునీత రెడ్డి అన్నారు. శుక్రవారం టీయుడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో ఇటీవల వనపర్తి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సునీతారెడ్డి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు యూనియన్ నాయకులతో పలు అంశాలపై జిల్లా ఎస్పీ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ ఎడ్యుకేషన్ హబ్ గా ఉన్న వనపర్తి జిల్లాలో యువత చెడుదారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమాజాన్ని, ప్రధానంగా యువత, విద్యార్థులను పట్టిపీడిస్తున్న గంజాయి, మాదక ద్రవ్యాలు కల్తీకల్లు, మద్యం తదితర మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, బాల్య వివాహాల నియంత్రణపై పోలీసు శాఖ ప్రధానంగా దృష్టి సారిస్తుందని చెప్పారు. నార్కోటిక్స్, డ్రగ్స్ వంటి వాటిపై తాను గతంలో పనిచేసిన ప్రాంతాల్లో ఉక్కు పాదం మోపడం జరిగిందని వివరించారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని అలాంటి వాటి పట్ల మీడియా విరివిగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని కోరారు. బెట్టింగ్ యాప్స్ వల్ల ఎంతోమంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా సామాజిక బాధ్యతగా ఆరోగ్య సమాజ నిర్మాణంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. టీయుడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ మాట్లాడుతూ గతంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేయడం జరిగిందని, అదేవిధంగా భవిష్యత్తులో తమ యూనియన్ ఆధ్వర్యంలో మదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని అందుకు పోలీస్ శాఖ సహకారం తీసుకుంటామని అన్నారు. పోలీస్ శాఖ, జర్నలిస్టులు సమన్వయంతో పనిచేస్తూ నేర రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు)జిల్లా అధ్యక్షులు డి. మాధవరావు, జిల్లా కార్యదర్శి బి.రాజు జాతీయ కౌన్సిల్ మెంబర్లు మల్యాల బాలస్వామి, ప్రశాంత్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు నాకొండ యాదవ్, గోపాల్, కోశాధికారి ద్వారపోగుమన్యం, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు సాగర్, నరసింహారాజు, నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్, టౌన్ అధ్యక్షుడు అరుణ్, యూనియన్ జిల్లా నాయకులు వెంకట్ గౌడ్, లక్ష్మణ్ ,తిరుపతయ్య, ఫారూఖ్ పటేల్, ధనుష్, రంగస్వామి, సురేష్, అరుణ్, చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.



# శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల, జనవరి 9 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా అన్ని రంగాలలో ఆత్మస్థైర్యంతో రాణించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం సి ఎం కప్ క్రీడలు 2025లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఐ. బి. చౌరస్తాలో డి.సి.పి. ఎ. భాస్కర్, ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా యువజన క్రీడా సేవల శాఖ అధికారి హనుమంత రెడ్డి, ఇతర అధికారులు, క్రీడాకారులతో కలిసి టార్చ్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ క్రీడల సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సి ఎం కప్ 2025 2వ ఎడిషన్ క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని, చేసే ప్రతి పనిలో ఏకాగ్రత పెరుగుతుందని, అన్ని రంగాలలో రాణించవచ్చని తెలిపారు. రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి విద్యా సంస్థలు కొంత సమయం ఆటలు, క్రీడలకు కేటాయించాలని తెలిపారు. సి ఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి క్రీడా పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివి పిట్టల దొర మాటలు

- కాంగ్రెస్ సర్కార్ ను ప్రజలు బొంద పెడతారు
- రాష్టంలో రానున్నది బిజెపి ప్రభుత్వమే
- సర్పంచ్ ల సన్మాన సభలో ఈటెల రాజేందర్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**భైంసా జనవరి 09 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతూ పిట్టల దొరల వ్యవహారిస్తున్నారని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్, బిజెఎల్పి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బిజెపి సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులు గా హాజరై మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా గారడీ మాటలతో కాలం వెల్లడిస్తుం దన్నారు. పెన్షన్ పెంపు, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు కెసిఆర్ ను బొంద పెట్టిన విధంగా, కాంగ్రెస్ సర్కార్ కు గుణ పాఠం చెబుతారని అన్నారు. ఇతర రాష్టాల్లో బిజెపి ఒక్క సారి అధికారం లోకి వస్తే 25 సంవత్సరాల పాటు పాలిస్తున్న రాష్టాలు ఉన్నాయన్నారు. ముధోల్ విజయం స్ఫూర్తి తో రానున్న అన్ని ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. మైనారిటీ ఓట్లను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఎన్నకలకు వెళ్తుందే తప్ప చేసింది ఏమి లేదన్నారు. అభివృద్ధి పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మౌనం, సహనం, ఓపిక ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తత్త్వమని అందుకే ముధోల్ నియోజకవర్గం లో 103 స్థానాలు గెలిచారంటే అది ఏక పక్ష తీర్పే నన్నారు. 15 ఫైనాన్స్ నిధుల కోసమే రేవంత్ రెడ్డి ఇష్టం లేకున్నా సర్పంచ్ ఎన్నికలకు వెళ్లారన్నారు. 20 రోజులు గడుస్తున్న సర్పంచ్ లకు చెక్ పవర్ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులన్నీ కేంద్రానివని,గ్రామాల అభివృద్ధి వాటి వల్లే జరుగుతుందన్నారు. సొమ్ము కేంద్రానిది సోకు రాష్ట్రనిధి అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్టానికి ముఖ్యమంత్రి అని బిజెపి సర్పంచ్ ల పట్ల వివక్ష చూపితే కర్రు కాల్చి వాత పెడతామని హెచ్చరించారు. బీజేఎల్పి ఉప నేత పాయల శంకర్, ఎంపి నగేష్, ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ జిల్లా అధ్యక్షలు రితీష్ రాథోడ్ కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయి లో మండిపడ్డారు.

### సర్పంచ్ లకు సన్మానం

కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గానికి చెందిన సర్పంచ్ లను, ఉప సర్పంచ్ లను వార్డ్ మెంబెర్ లను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ శాలువాతో సత్కరించి మెమంటోలు ప్రధానము చేశారు.. కార్యక్రమం ప్రారంభం కంటే ముందు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్దా మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు.

### సన్మాన కార్యక్రమానికి భారీగా జనం

సర్పంచ్ ల సన్మాన కార్యక్రమానికి పెద్ద మొత్తం లో జనం రావడం తో సభ సక్సెస్ అయింది. వేలాది మందితో ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ నిండి పోయింది. కార్యక్రమం లో సీనియర్ నాయకులు, నాయకులు, పార్టీ బాధ్యులు, కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, జనవరి 9 (జనంసాక్షి) :** జిల్లా శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులందరితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం పెద్ద ఎత్తున నిర్మల్ ఉత్సవాల్లో పాల్గొనే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. నిర్మల్ జిల్లా చరిత్ర తెలియజెప్పేలా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 19 వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు నిర్వహించబోయే నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి ప్రోటోకాల్ పాటిస్తూ ప్రజాప్రతి నిధులను ప్రముఖులను ఆహ్వానించాలని తెలిపారు. సంతకాల బోర్డు,సెల్ఫీ పాయింట్ లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండ ఉండేలా చర్యలు తీసుకోవాలని, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజల నుంచి స్వీకరించిన సూచనలను పరిశీలిం చారు. ఉత్సవాలకు వచ్చే సందర్శకుల సంఖ్యను ముందుగా అంచనా వేస్తూ అధికారు లు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈవో భోజన్న,డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్,డిఆర్డిఓ విజయ లక్ష్మి, డిఎంహెచ్ఓ రాజేందర్, అగ్నిమాపక అధికారి శివాజీ, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో

# కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్, భూపాలపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావుల ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ జయశంకర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇటీవల రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ తీరును నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు కోసిక సాయిచరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చుంచుల మహేష్, తోట రంజిత్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు నగునూరి రజినీకాంత్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ బడితెల ప్రసాద్, పోలసాని కోటేశ్వరరావు, చిట్యాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లకొండ కుమార్, రేగొండ మండల అధ్యక్షులు కోయిల క్రాంతి, టేకుమట్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొలుగురి అనిల్, జిల్లా నాయకులు శనిగరపు పవన్ కుమార్, అప్పాల శ్రీనివాస్, రాస ప్రశాంత్, ఉప్పగల కిషోర్ రెడ్డి, బీప్తి పృథ్వీరాజ్, బోయిని మధుకర్, పోశాల మహేష్, కీర్తి రాజు, చిరంజీవి, కట్ల మహేష్, సురేందర్, విష్ణు, దోమల సంపత్, ముత్యాల సురేష్, గోల్కొండ నాగరాజు, వెంకటేష్, కట్కూరి సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# రబీ పంటల కోసం పాకాల తూముల గేట్లు ఎత్తి నీరు విడుదల

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ..
- రైతన్నకు రబీ సీజన్ పంట కోసం నీటి విడుదల...

**ఖానాపురం, జనవరి 9 (జనంసాక్షి) :** రబీ సీజన్ కోసం పాకాల ఆయకట్టు రైతాగానికి పంటల సాగు కోసం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గేట్లు ఎత్తి నీరును విడుదల చేశారు. శుక్రవారం ఖానపురం మండలంలోని పాఖాల తూముల గేట్లను ఎత్తి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం కోసం ఏర్పాట్లు చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవ రడ్డి మాట్లాడుతూ కాలువలలోని చెత్త,చెదారాన్ని నిధులు కేటాయించి తొలగించడం జరిగిందని,130 కోట్లతో కాలువల లైనింగ్ మే నెల నుంచి ప్రారంభించి వర్షాలు పడేలోపు 60 శాతం పనులు పూర్తి చేస్తామని మిగతా చివరి ఆయకట్టు వరకు పనులను వచ్చే సంవత్సరం రవి లోపు పూర్తి చేస్తామని అన్నారు.రైతన్నల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి, జనవరి 9 (జనంసాక్షి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరొక ముందడుగు పడింది.శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని 5వ డివిజన్ కొత్తూరులో రూ.30 లక్షల వ్యయంతో, అలాగే 49వ డివిజన్ జూలైవాడా, రెవెన్యూ కాలనీల్లో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్ల నిర్మాణం మరియు సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని మౌలిక సదుపాయాల పరంగా పూర్తిగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన కాలనీలకు ప్రాధాన్యత ఇస్తూ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా సైడ్ డ్రైనేజీ పనులు కీలకంగా ఉంటాయని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా పనులు చేపడతామని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు ప్రజల సహకారంతోనే సాఫీగా సాగుతాయని, అందరూ భాగస్వాములై పనుల పురోగతిని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.




# ఆర్ఓ ప్లాంట్ ప్రారంభించిన కలెక్టర్

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బేల మండలంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల జాతర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం బాల వికాస స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో, గ్రామస్తుల, ఉపాధ్యాయుల సహకారం తో ఏర్పాటు చేసిన త్రాగు నీటి ఆర్ ఓ ప్లాంట్ ని కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొమ్ము క్రిష్ణ కుమార్, ఉపాధ్యాయులు,దాసరి బాబన్న, సంజీవ్ రెడ్డి, దేవి దాస్, సంజయ్, ఏలియా, స్వామి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐనవోలు జాతరకు పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఐనవోలు జాతర పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి జనవరి 9 (జనంసాక్షి)) :** ఐనవోలు జాతరకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లను పూర్తిచేసి జాతర విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ జిల్లా ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 13 నుండి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదాయ, పంచాయతీ రాజ్, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేసిన జాతర ఏర్పాట్లు, వాటి పురోగతి గురించి సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఐనవోలు మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతర ఏర్పాట్లు సంబంధిత శాఖలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కమ్మగొని ప్రభాకర్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కందుల సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మ రమాకాంత్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఎస్సై శ్రీనివాస్, ఏఈలు రవికుమార్, సురేష్ కుమార్, ఆలయ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌ను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

**బెల్లంపల్లి, జనవరి 9, (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం గొల్లపల్లి సర్పంచ్ జాడి లక్ష్మ, ఆమె భర్త నారాయణను దూషించిన పోతురాజుల సురేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నెన్నెల ఎస్సై కే ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గొల్లపల్లి గ్రామానికి మంజూరైన మహిళా సంఘం భవనానికి స్థల సేకరణ కోసం గిర్దవర్, జీపీఓతో కలిసి గ్రామంలోని సర్వే నెంబర్ 33లో ఉన్న ప్రభుత్వ భూమి రెండు గుంటలు భవన నిర్మాణం కోసం పరిశీలించారు. అక్కడికి ఫుటుగా మద్యం తాగి వచ్చిన పోతురాజుల సురేష్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి సర్పంచ్ జాడి లక్ష్మని, ఆమె భర్త నారాయణను ఇష్టం వచ్చినట్టు బూతులు తిట్టి, చెప్పులు తో కొట్టడానికి ప్రయత్నించాడు. సర్పంచ్ జాడి లక్ష్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ వివరించారు.

# నెలాఖరు నాటికి దేవాలయ పనులు పూర్తి చేయాలి

- అధికారులు సమన్వయంతో కృషి చేయాలి
- వచ్చే నెలలో దేవాలయానికి సీఎం వచ్చే అవకాశం ఉంది
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** నెలాఖరు నాటికి కొడవటంచ శ్రీ లక్ష్మనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రెవెన్యూ, దేవాదాయ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్తు శాఖల అధికారులతో దేవాలయ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 12వ తేదీలోగా అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే ఇప్పటికే చేపట్టిన పనులకు సంబంధించిన ఎంబి రికార్డును ఈ నెల 19 లోగా పూర్తి చేయాలని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సమీక్షకు ముందు దేవాలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించి, పనుల నాణ్యత, వేగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే నెలలో దేవాలయానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చే అవకాశం ఉందని, ఈ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి ఈఈకి ఎమ్మెల్యే సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టిన అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు పనుల కొరకు ప్రతిపాదనలు, పూర్తి అయిన పనులకు ఎంబి రికార్డులను అందచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మ, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్హార్ నాయక్, పిర్ ఎస్ఈ చక్రవర్తి, దేవాదాయశాఖ ఈఈ దుర్గ ప్రసాద్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ శ్వేత, ఆర్అండ్‌బి ఈఈ రమేష్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఎఫ్డిఓ అప్పలకొండ, తహసీల్దార్ శ్వేతా, దేవస్థానం ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయికి కస్తూర్బా విద్యార్థినులు ఎంపిక

- అభినందించిన కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి



**చెన్నారావుపేట, జనవరి 9 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లాలోని లాల్ బహదూర్ కళాశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంగ్లీష్ ఒలంపియాడ్ కాంపిటేషన్లో చెన్నారావుపేట కస్తూర్బా విద్యార్థినీలు జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో 10వ తరగతి విద్యార్థి శ్రీరామ్ శెట్టి రశ్మిత మొదటి స్థానం , 8వ తరగతి విద్యార్థిని అక్షత రెండో స్థానంలో జిల్లా స్థాయిలో నిలిచారు. ఎడుటాక్ అనే అంశంలో గూడెల్లి వైష్ణవి జిల్లా స్థాయిలో మొదటి స్థానం, ఏడవ తరగతి తేజశ్రీ మూడవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి విద్యార్థులను, గైడ్ టీచర్ రజినిని అభినందించారు.

### బండారుపల్లి మోడల్ స్కూల్ ను సందర్శించిన

# హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాకూర్



**ములుగు బ్యూరో,జనవరి09(జనం సాక్షి) :** ములుగు జిల్లాలోని పిఎం శ్రీ మోడల్ స్కూల్ బండారుపల్లి ని శుక్రవారం రోజున హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాకూర్,ఆ రాష్ట్ర విద్యా శాఖ సెక్రెటరీ రాజేష్ శర్మ, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆశిష్ కోహ్లీ మరియు డైరెక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డా.అమర్జీత్ శర్మ మరియు ఇతర ఉన్నతాధికార బృందం సందర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖలో అమలు జరుగుచున్న వివిధ పథకాల అమలు తీరుని అడిగి తెలుసుకున్నారు.పిఎం శ్రీ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నుండి పాఠశాలకు అందుతున్న వివిధ ప్రోత్సాహకాలను అడిగి తెలుసుకున్నారు.రాష్ట్ర విద్యాశాఖ అద్వ ర్యంలో అమలు జరుగుచున్న కార్యక్రమాల తీరుతెన్నులు స్వయంగా చూసి తెలుసుకొని చాలా సంతృప్తిని వ్యక్తం చేశారు.వొకేషనల్ ల్యాబ్,సైన్స్ ల్యాబ్ లను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. హిమాచల్ ప్రదేశ్ విద్యా శాఖ మంత్రితో సంభాషించిన పాఠశాల విద్యార్థులందరికి హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ తరుపున మిఠాయిలు పంచిపెట్టడం కోసం10,000 రూపాయలను ప్రిన్సిపాల్ దేవకీ కి అందచేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి,జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీ.సంపత్ రావు,జిల్లా విద్యాశాఖ అధికారి సిద్దార్థ్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు అర్షం రాజు,శ్యామ్ సుందర్ రెడ్డి,జి.సాంబయ్య, సైకం శ్రీనివాస్ రెడ్డి మరియు పాఠశాల ప్రిన్సిపల్ సింగారం దేవకి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలి

- పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 9 (జనంసాక్షి) :** రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించుటకు ప్రతి ఎంఈఓ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మండల విద్యాధికారులతో విద్యాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే 10వ తరగతి వార్షిక పరీక్షలలో ప్రతి పాఠశాల నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని అన్నారు.10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్పెషల్ తరగతులు, విద్యార్థులకు




అభ్యాసనన పుస్తకాలు అందించాలని, సెకండ్ ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ప్రతి విద్యార్థికి ఎగ్జామ్ పాడ్, పెన్, పెన్సిల్, స్కేలు ఇవ్వాలని సంబంధిత ఎంఈఓలను ఆదేశించారు. 9, 10వ తరగతి ఎస్సీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ల సంబంధించి దరఖాస్తులను సమర్పించాలని అన్నారు. అవసరమైతే మండల తహసిల్దార్ సహాయంతో మీ సేవ సెంటర్ సిబ్బందిని పాఠశాలలకు పిలిపించి విద్యార్థుల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకొని దరఖాస్తులను ఈ నెల 20 లోపు సమర్పించాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ సెలవులు తదుపరి పాఠశాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అవసరమైతే గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా పారిశుధ్య పనులు చేయించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం బియ్యం స్టాక్ పెట్టుకోవాలని పేర్కొన్నారు. సర్వ శిక్ష అభియాన్ పై కూడా సమీక్షించారు.ఈ సమావేశంలో డిఈఓ అశోక్,ఎస్సీ కార్పొరేషన్ సంక్షమ అధికారి దయానంద రాణి, కోఆర్డినేటర్లు రాంబాబు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలని భోజన విరామంలో నిరసన



**నేరేడుచర్ల, జనవరి 9 (జనంసాక్షి) :** ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్స్ పిలుపులో భాగంగా, ఉపాధ్యాయుల డిమాండ్లను దేశవ్యాప్తంగా పరిష్కరించాలని పియం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పిఆర్టియు జిల్లా గౌరవ అధ్యక్షుడు కొణతం వెంకట్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఆర్టిఈ యాక్ట్ కన్నా ముందు నియామకం అయిన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలి.నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి,నూతన విద్యా విధానం 2020 ను రద్దు చేయాలి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఓటు హక్కు ను కల్పించాలన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు డిటిఎఫ్ సీనియర్ నాయకుడు ఆర్.శౌరి, యుటిఎఫ్ సీనియర్ లీడర్లు, కె.వెంకటేశ్వరరావు, యన్.నరసింహారావు, ఎ.అన్నపూర్ణ, యం.నాగమణి, బి.భానుమతి, యన్. వెంకటేశ్వర్లు, బి.బికోజి,యం.బాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు కొనసాగించాలి



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 9 (జనంసాక్షి) :** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులు క్షమంగా రాకపోకలు సాగించుటకు పారిశ్రామిక వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలలో లేదా అవసరం ఉన్నంతవరకే రాకపోకలు సాగించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా ఇండస్ట్రీస్ అధికారి సీతారాం నాయక్ తో కలిసి సిమెంట్ కంపెనీ, రైస్ మిల్లర్స్, లారీ ఓనర్స్ ప్రతినిధులతో వెబ్ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై హైదరాబాద్ నుండి ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు ఆంధ్రకు రాకపోకలు సాగిస్తున్నందు వలన తేలికపాటి వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజల భద్రతను, ట్రాఫిక్ రద్దీని నివారించుటకు, పండుగ కాలంలో వాహనాలు సాఫీగా ప్రయాణించుటకు హైవేపై భారీ లోడ్ వాహనాల రాకపోకలను తగ్గించవలసిందిగా నిర్ణయించినట్లు తెలిపారు.లారీ ఓనర్లు, రైస్ మిల్లర్ అసోసియేషన్లు, సిమెంట్ కంపెనీ ప్రతినిధులు వారి యొక్క ఉత్పాదనలను ఎగుమతి దిగుమతులను పురస్కరించుకొని జనవరి 10 నుండి 18 వరకు లారీలు, ట్రక్కులు, ఇతర భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలలో రద్దీ తక్కువ ఉన్న రూట్లో వెళ్లాలని పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి తగ్గించుకోవాలని అవసరమైన సరుకులు,అత్యవసర సరఫరాలను తరలించే క్రమంలో సంబంధిత పోలీస్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సంబంధిత అధికారుల నుండి తగిన అనుమతి పొందిన పక్షంలో మినహాయింపు ఇవ్వబడుతుందని తెలిపారు.

## తుంగతుర్తిలో తాగునీటి సమస్య



**తుంగతుర్తి, జనవరి 9 (జనం సాక్షి) :** తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో గత సర్పంచుల పదవీకాలం ముగిసిన అనంతరం నుండి మంచినీటి సమస్య నెలకొందని ముఖ్యంగా మిషన్ భగీరథ పథకం ద్వారా వచ్చే మంచినీరు ఆగిపోయిందని తుంగతుర్తి సర్పంచ్ సాయిబాబు అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తుంగతుర్తి పట్టణంలో 14 వార్డులు ఉన్నాయని అన్ని వార్డులకు నీటి సరఫరా గత సర్పంచ్ హయాంలో జరిగిందని సర్పంచుల పాలన ముగిసిన తర్వాత గ్రామంలోని కనెక్షన్లు కొన్ని డమ్మీ చేశారని ప్రస్తుతం వాటన్నిటిని మరమ్మతు చేస్తున్నామని అన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడం వల్ల గ్రామంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రస్తుత గ్రామంలో అన్ని వార్డులలో అందుబాటులో ఉన్న ట్యాంకర్లతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా చేస్తున్నామని కొంతమంది కావాలని మంచినీరు అందడం లేదని అంటున్నారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుండి గ్రామంలో వీధులన్నిటిని పరిశుభ్రంగా ఉంచే విధంగా అలాగే మంచినీటి సౌకర్యం కోసం కనెక్షన్లను పునరుద్ధరిస్తూ పనులు చేస్తున్నామని అన్నారు. కొద్ది రోజులలో తుంగతుర్తి లో మంచినీటి సమస్యను అధికారుల సహాయంతో పునరుద్ధరిస్తామని సాయిబాబు అన్నారు. ప్రజలు తమకు సహకరించి ట్యాంకర్ల ద్వారా వచ్చే మంచినీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన డిసిఎం

- ముగ్గురు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- టైల్స్ మీదపడి బీహార్ వలస కూలీలు దుర్మరణం

**మిర్యాలగూడ, జనవరి 9 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం శివారు ఈదులగూడ చౌరస్తా వద్ద అద్దంకి - నార్కట్ పల్లి రోడ్డు పై శనివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిమెంట్ ట్యాంకర్ ను డీసీఎం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా,మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ శంషాబాద్ నుండి పల్నాడు జిల్లా వినుకొండకు డీసీఎంలో ఇటాలియన్ మార్బుల్ టైల్స్ తరలిస్తున్నారు. టైల్స్ అమర్చేందుకు డిసిఎం లోనే టైల్స్ కంపెనీ వారు బీహార్ రాష్ట్రం మూజఫర్ పూర్, పరిసర ప్రాంతాలకు చెందిన సంతోష్ (26),సూరజ్ (25),వీరు (27), సంజీత్, కిషన్ కుమార్, సికిందర్ లను పంపించారు. ఈ క్రమంలో దామరచర్ల నుండి సిమెంట్ ట్యాంకర్ లారీ కోదాడ వైపు వెళ్తూ ఈదులగూడ చౌరస్తా వద్ద మలుపు తిరుగుతుండగా డి సి ఎం అతి వేగంగా ఢీ కొట్టడం తో టైల్స్ కూలీల మీద పడడంతో, తీవ్ర గాయాలతోఅక్కడికక్కడే సంతోష్, సూరజ్,



వీరు లు మృతి చెందగా,మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను మిర్యాలగూడ లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని మిర్యాలగూడ డి.ఎస్.పి కె రాజశేఖర్ రాజు, వన్ టౌన్ సిఐ నాగభూషణరావు లు పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా క్రేన్ సహాయంతో రహదారిపై నుండి లారీ, డీసీఎం లని పోలీసులు తొలగించారు.ఈ సంఘటన పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న వన్ టౌన్ సి ఐ నాగభూషణ రావు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామ సుపరిపాలన

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**టేకులపల్లి, జనవరి 9 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రంలో గ్రామ సుపరిపాలన జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లందు నియోజకవర్గ కేంద్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, ఉప సర్పంచ్ లు విజయం సాధించిన వారందరినీ ఆత్మీయ సన్మాన వేడుకను ఏర్పాటుచేసి మంత్రి చేతులు మీదుగా ఘనంగా సత్కరించి, శాలువాలతో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మంత్రితోపాటు మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలు నూతన సర్పంచులను, ఉపసర్పంచులను, వార్డు సభ్యుల దంపతులను ఘనంగా సన్మానించి వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షమ పథకాల ఫలితంగానే రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల్లో అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలిపించుకోవడం జరిగిందన్నారు. ప్రజలు ఇచ్చిన ఆ విశ్వాసాన్ని నూతన సర్పంచులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సాధించి, ప్రజలతో మమేకమై అభివృద్ధికి దోహదపడాలని, ప్రభుత్వం



మీకు అండగా ఉంటుందని అన్నారు.ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలో పేదవానికి ఇందిరమ్మ ఇళ్ళు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరలు, వడ్డీ లేని రుణాలు, రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ,సన్న వడ్లకు బోనసు ఇలా ఎన్నో అనేక కార్యక్రమాలను చిత్తశుద్ధితో ప్రభుత్వం అందిస్తుందన్నారు. తావుర్యతండా, శంబునిగూడెం, బిల్లుడుతండా, చంద్రుతండా, ఇండిపెండెంట్ గా గెలిచిన సర్పంచులను, రామచంద్రుని పేట బిఆర్ఎస్ సర్పంచును కాంగ్రెస్ పార్టీలోకి సాధారంగా ఆహ్వానించి ఘనంగా వస్త్రాన్ని బహుకరించి,శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**దమ్మపేట, జనవరి 9 (జనం సాక్షి) :** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రానికి గోదావరి,



కృష్ణ నదుల నుంచి రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడుకుంటామని ఆయన అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగవ పంప్ హౌస్ పనుల పురోగతిని,మొత్తం ప్రాజెక్టు పనుల స్థితిగతులపై భారీ నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక వివరాలను మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పురోగతిపై స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారూ. గోదావరి నదిలో తెలంగాణ రాష్ట్రానికి మొత్తం 968 టీఎంసీల నీటి వాటా కేటాయించబడిందని, నీటి లభ్యత 75 శాతం దాటిన తర్వాత సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు లభించాయని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి వలలో గానుగ బండ గ్రామపంచాయతీ కార్యదర్శి బర్పటి కృష్ణ

- ఇంటిలోనూ ఆఫీసులో సోదాలు జరుపుతున్న అధికారులు



**తుంగతుర్తి, జనవరి 9 (జనం సాక్షి) :** తుంగతుర్తి మండల పరిధిలోని గానుబండ గ్రామ పంచాయతీ కార్యదర్శి బరపటి కృష్ణ 6000 రూపాయలు ఓ వ్యక్తి నుండి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎసిబి డిఎస్పి జగదీష్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల నూతనంగా ఇంటి నిర్మాణం చేశాడు అట్టి ఇంటికి ఇంటి నెంబర్ కావాలని వెళితే 6000 రూపాయలు లంచం ఇస్తేనే పని పూర్తవుతుందని చెప్పడంతో అతను ఏసీబీ అధికారులను సంప్రదించాడని తెలిపారు . దీంతో అతడు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయంలో 6000 రూపాయలు నగదు కృష్ణ తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడినట్లు తెలిపారు . ప్రస్తుతం కుక్కడం గ్రామంలో ఇంటి వద్ద ఆఫీసుల్లో సోదాలు జరుపుతున్నామని అతడి పై అధికారి ఎంపీడీవోను పిలిచి విచారిస్తున్నామని కృష్ణను కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు, ఎవరైనా ప్రభుత్వ అధికారి పనుల కోసం లంచం అడిగితే 1064 నెంబర్ కు ఫోన్ చేయాలని వారి పేరు గోప్యంగా ఉంచుతామని తెలిపారు అంతేకాక ఏసీబీ తెలంగాణ ట్విట్టర్లు లో కూడా ఫిర్యాదు చేయాలని కోరారు.

## నీళ్ల కోసం గ్రామపంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



**తుంగతుర్తి జనవరి 9 (జనం సాక్షి) :** తుంగతుర్తి మండల కేంద్రంలో గత రెండు నెలలుగా నీళ్ల రావడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ రెండు నెలల నుండి నల్లాలు రాక నీళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని అధికారులు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడంలేదని అన్నారు, అధికారులు మరియు గ్రామపంచాయతీ తమ సమస్యను పట్టించుకోవడంలేదని అన్నారు, పండుగ దగ్గరికి వస్తున్న కనీసం వాడుకోవడానికి కూడా నీళ్లు లేక బోర్ల కానుండి బిందెలతో మోసుకుంటున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు ఉన్నత అధికారులు వెంటనే స్పందించి తమకు నీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన్నూరు పూర్ణమ్మా, కటకం ఈశ్వరమ్మ , లింగమ్మ, తడకమళ్ల గంగమ్మ, తడకమళ్ల యాదమ్మా, తడకమళ్ల హేమలత, పానగంటి స్వప్న, కటకం రామ, జ్యోతి, కటకం రవి, బొంకూరి మల్లేష్ , తడకమళ్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశాలు




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 9 (జనం సాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ పండుగకు తగిన విధంగా వేదికను పూలతో అలంకరించాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు వేడుకలను వీక్షించేందుకు వీలుగా షామియానాలు, కుర్చీలు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రోడ్లు--భవనాల శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, జిల్లా ప్రణాళిక అధికారి శేఖర్, ఉద్యాన శాఖాధికారి శ్రీధర్, ఎస్సీ, బీసీ సంక్షమ శాఖల అధికారులు వినోద్ కుమార్, ఝాన్సీరాణి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సుగుణబాయి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌సర్వీస్ టీచర్ల టెట్, సీపీఎస్‌ను రద్దు చేయాలి

**టేకులపల్లి, జనవరి 9 (జనంసాక్షి) :** ఇన్ సర్వీస్ టీచర్ల టెట్, సిపిఎస్ ను రద్దు చేయాలని, ఎన్ ఈ పి - 20 20 ను రద్దు చేయాలని, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటుహక్కు కల్పించాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగుగులోతు హరిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐజేఏసిటీఓ) పిలుపులో భాగంగా యూఎస్పిసి, టిపిటిఎఫ్ పిలుపు మేరకు శుక్రవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టేకులపల్లి మండలశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల గంగారంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ను రద్దు చేయాలని,సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని,న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ను రద్దు చేయాలని,టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని నినదీస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సర్వీసు చేసిన ఉపాధ్యాయులకు ఇప్పుడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ రాసి రెండు సంవత్సరాలలో ఉత్తీర్ణులు కావాలని లేని యెడల ఉద్యోగం నుండి తొలగిస్తామని చెప్పడం సరైనది కాదని,ఉద్యోగ నియామక నోటిఫికేషన్లలో పేర్కొన్న విద్యార్హతల ప్రకారమే ఉద్యోగాలు పొందినప్పటికీ ఇప్పుడు కొత్తగా టెట్ పరీక్ష రాయాలని,లేనియెడల ఉద్యోగం నుండి తొలగిస్తామని చెప్పడం సరైనది కాదని, ఇటువంటి నిర్ణయాలను వెంటనే విరమించుకోవా లని అన్నారు.విద్యా హక్కు చట్టం 2009కి తరువాత నియమించబడిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని, అందుకు తగినట్టు గా విద్య హక్కు చట్టాన్ని అమెండ్మెంట్ చేయాలని కోరారు. కార్యక్రమం లో టిపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పూనెం సమ్మయ్య,మండల కార్యదర్శి జి.నందా, ప్రధానో పాధ్యాయులు డి.జగన్,ఉపాధ్యాయులు



టి.రామారావు బి.వాల్యా నాయక్,బుగ్గ వెంకటేశ్వర్లు,ఏ.కిషన్,బి.కస్నా నాయక్, ఎం.శ్రీనివాసరావు, డి.వీరన్న, కె.ఎర్రయ్య, టి.బిక్షమయ్య, ఎం.రాంబాబు, బి.వీరన్న, కె.రమేష్, బి.శ్రీవాణి,జి.బిచ్యా,గోపాలీలలు,జానయ్య పాల్గొన్నారు.




# ఆశ్చర్యపోయాను!..

## శ్రీధర్ వెంబు ట్వీట్



**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాల్లో విస్తరిస్తున్న తరుణంలో.. జోహో ఫౌండర్ శ్రీధర్ వెంబు ఒక ట్వీట్ చేశారు. కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసే విధానాన్ని పూర్తిగా మార్చేస్తోందని ఇందులో ఒక ఉదాహరణతో వివరించారు.సంస్థలోని బృందంలో పనిచేసే ఇంజనీర్.. నెల రోజుల తన ఖాళీ సమయంలో తయారు చేసిన ఒక పరికరాన్ని నాకు చూపించారు. అతను దానిని తయారు చేస్తున్నట్లు నాకు తెలియదు. కానీ దానిని చూడగానే నేను ఆశ్చర్యపోయాను.మూడు లేదా నలుగురు వ్యక్తులు.. ఆ పరికరాన్ని తయారు చేయడానికి కనీసం ఒక ఏడాది సమయం పడుతుంది. కానీ అతను కేవలం నెల రోజుల్లోనే దాన్ని అభివృద్ధి చేశారు. ఇంత వేగంగా దీనిని రూపొందించడానికి ప్రధాన కారణం గాజూబీబ 4.5 అనే ఏఐ మోడల్ అని ఆ ఇంజనీర్ చెప్పారు.ఒకప్పుడు ఏఐ ద్వారా రాసే కోడ్‌పై అతనికి (ఇంజనీర్) అంతగా నమ్మకం లేదు. కానీ గాజూబీబ 4.5 వచ్చాక తన అభిప్రాయం పూర్తిగా మారిపోయిందని వెంబు వివరించారు. అంతే కాకుండా జోహో కంపెనీలో ప్రయోగాత్మక సంస్కృతిని ప్రస్తావించారు. మేము సంస్థలో తెలివైన వాళ్లకు స్వేచ్ఛ ఇస్తాం, వాళ్లే కొత్త మార్గాలు కనుగొంటారని శ్రీధర్ వెంబు పేర్కొన్నారు.ఇంతవరకు సాఫ్ట్‌వేర్ అప్డేట్ అనేది చేతితో నేసే చేనేత లాంటిదైతే, ఇప్పుడు ఏఐ రూపంలో శక్తివంతమైన యంత్ర మగ్గాలు వచ్చేశాయని అన్నారు. ఇది సాఫ్ట్‌వేర్ కంపెనీల మీద పెద్ద ప్రభావం చూపిస్తుంది. జోహో కూడా దీనికి అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని అన్నారు. తాను చీఫ్ సైంటిస్ట్‌గా ఉన్నందున ఈ మార్పులను ఎదుర్కోవాల్సిన బాధ్యత తనపై ఉందని వెంబు వెల్లడించారు.

# ఐదో రోజూ నష్టాలే..

## 25,700 దిగువకు నిఫ్టీ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఎఫ్ఐఐల అమ్మకాలు ప్రభావం చూపాయి. ముఖ్యంగా రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 600 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 25,700 దిగువకు చేరింది. గడిచిన ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,200 పాయింట్లకు పైగా పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లపై ఆ దేశ సుప్రీంకోర్టు నేటి (శుక్రవారం) రాత్రి తీర్పు వెలువరించనుంది. ఒకవేళ ఆయనకు వ్యతిరేకంగా తీర్పు వస్తే మన మార్కెట్లకు ఊరట కలుగుతుంది. అనుకూలంగా తీర్పు వస్తే ఆయా దేశాలపై మరిన్ని టారిఫ్‌లు విధించేందుకు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. ఇది మార్కెట్లకు ప్రతికూల అంశం. ఈ నేపథ్యంలో ఈ వారాంతంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు .సెన్సెక్స్ ఈ రోజు ఉదయం 84,022.09 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,180.96) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభాల్లో కదలాడిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. మధ్యాహ్నం తర్వాత మరింత అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇంట్రాడేలో 83,402.28 వద్ద కనిష్ఠాలను తాకిన సూచీ.. చివరకు 604.72 పాయింట్ల నష్టంతో 83,576.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 193.55 పాయింట్ల నష్టంతో 25,683.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.16గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో ప్రధానంగా ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బీఈఎల్, రిలయన్స్, ఎటెర్నల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.12 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,471 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## వరుస నష్టాలు.. స్టాక్ మార్కెట్ క్లోజింగ్ అప్డేట్

శుక్రవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 604.72 పాయింట్లు లేదా 0.72 శాతం లాభంతో 83,576.24 వద్ద, నిఫ్టీ 193.55 పాయింట్లు లేదా 0.75 శాతం నష్టంతో 25,683.30 వద్ద నిలిచాయి.ఆసోమ్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్, క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ లిమిటెడ్, మనక్సియా అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, యాషో ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఆకాష్‌న్నా-ప్రాజెక్ట్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ఎలెకాన్ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్, శంకర బిల్డింగ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, రాజ్‌రతన్ గ్లోబల్ వైర్ లిమిటెడ్, రోలటైనర్స్ లిమిటెడ్, అహ్లాదా ఇంజనీర్స్ లిమిటెడ్ మొదలైన కంపెనీలు నష్టాల్లో నిలిచాయి.ఆతిబఇశ్రీజీతిఏవతీ: మార్కెట్ గురించి సాక్షి వెబ్‌సైట్‌లో నిపుణులు వెల్లడించే అభిప్రాయాలు వారి పరిశీలన, అంచనాలను బట్టి ఉంటాయి. ఇన్వెస్టర్లకు ఇది కేవలం విషయ అవగాహన మాత్రమే తప్ప.. వారు పెట్టే పెట్టుబడులకు సాక్షి మీడియా గ్రూపు ఎలాంటి హామీ ఇవ్వదు.

# సుజుకి ఎలక్ట్రిక్ స్కూటర్ లాంచ్

**న్యూఢిల్లీ:** సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా 'ఈ-యాక్సెస్' పేరుతో భారత మార్కెట్లో తన ఎలక్ట్రిక్ స్కూటర్ లాంచ్ చేసింది. దీని ధర రూ. 1.88 లక్షలు దీనిని కంపెనీ గురుగ్రామ్ ప్లాంట్‌లో తయారు చేయనుంది.బజాజ్ చేతక్, టీవీఎస్ ఐక్యూబ్, ఏథర్ రిజ్టా వంటి ఎలక్ట్రిక్ స్కూటర్లను ప్రధాన ప్రత్యర్థిగా ఉండనున్న సుజుకి ఈ-యాక్సెస్.. 3.07 ఎచ్చిష్ర లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీ ద్వారా 95 కి.మీ పరిధిని అందిస్తుంది. ఇందులోని 4.1 కేడబ్ల్యు ఎలక్ట్రిక్ మోటారు 15 ఔఎ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది.సుజుకి ఈ-యాక్సెస్ ఎలక్ట్రిక్ స్కూటర్.. డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ కన్సోల్, మూడు రైడింగ్ మోడ్‌లు, రీజెనరేటివ్ బ్రేకింగ్, రివర్స్ మోడ్ మొదలైనవి పొందుతుంది. ఇందులో బ్లూటూత్/యాప్ కనెక్టివిటీ ఛార్జింగ్ పోర్ట్ కూడా లభిస్తాయి. ఇది నాలుగు కలర్ వేరియంట్‌లలో అందుబాటులో ఉంటుంది.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.80 | ₹ 5.82 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,26,500 | ₹ 1,38,000 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,72,000

# కొత్త ఏడాదిలో ఐటీ ఉద్యోగాలు ఇలా..

కొత్త ఏడాదిలో దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఉద్యోగుల నియామకాలకు సంబంధించి.. రాశి కన్నా వాసికే ప్రాధాన్యమివ్వనున్నాయి. పేరుకి పెద్ద సంఖ్యలో రిక్రూట్ చేసుకోవడం కాకుండా ప్రధానంగా కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ తదితర విభాగాల్లో నైపుణ్యాలున్న వారినే నియమించుకోవడంపై దృష్టి పెట్టనున్నాయి.సిబ్బంది సంఖ్యను ఊరికే పెంచుకోవడం కన్నా ఆయా విభాగాల్లో సామర్థ్యాలున్న వారినే మరింతగా తీసుకోవాలని భావిస్తున్నాయి.ఉద్యోగాల కల్పన తీరుతెన్నులను ఈ ధోరణులు ప్రభావితం చేస్తాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం భారత్‌లో 1,800 జీసీసీలు ఉండగా, వాటిలో సుమారు 1.04 కోట్ల మంది ఉద్యోగులు ఉన్నారు. ఇతర రంగాలతో పోలిస్తే వారి జీతభత్యాలు 25–30 శాతం అధికంగా ఉంటున్నాయి. కొత్త ఏడాదిలో 120 పైచిలుకు మధ్య స్థాయి జీసీసీలు ఏర్పాటవుతాయని టీమ్‌లీజ్ వర్గాలు తెలిపాయి. ఇవి కొత్తగా సుమారు 40,000 వరకు ఉద్యోగాలను కల్పించవచ్చని వివరించాయి. భారీ జీసీసీల్లో దాదాపు 90 శాతం సెంటర్లు ప్రస్తుతం ఇన్నోవేషన్ హబ్‌లుగా కార్యకలాపాలు సాగిస్తున్నాయని తెలిపాయి.

కొత్త ఏడాదిలో ఐటీ హైరింగ్ అప్..


కొత్త సంవత్సరంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో మొత్తం మీద హైరింగ్ 12–15 శాతం పెరగవచ్చని ఐటీ స్టాఫింగ్ సంస్థ క్వెస్ కార్ప్ అంచనా వేస్తోంది. జీసీసీల్లో ఏఐ ఇంజనీరింగ్, క్లౌడ్ ప్లాట్‌ఫాంలకి డిమాండ్ నెలకొనడం ఇందుకు కారణమని పేర్కొంది. మరోవైపు, కొత్తగా రాబోయే వాటితో పాటు ఇప్పుడున్న జీసీసీలు కూడా విస్తరణ చేపట్టనున్నాయని ఏఎన్ఎస్ఆర్ అంచనా వేసింది. నూతన సంవత్సరంలో 80–110 కొత్త జీసీసీలు రావొచ్చని, 2,00,000కు పైగా ఉద్యోగాలు కల్పించవచ్చని తెలిపింది.పరిశ్రమ ఏటా 12–15 శాతం వృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆదాయాలు 75 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని పేర్కొంది. జీసీసీల్లో నియామకాలకు సంబంధించి వెళ్లిపోయిన ఉద్యోగుల స్థానాలను భర్తీ చేసుకోవడానికి చేపట్టే హైరింగ్ వాటా ఎక్కువగా ఉండొచ్చని నిపుణులు తెలిపారు. 2025లో నికరంగా 1,50,000 మందిని తీసుకోగా, 2026లో మరో 2,00,000 మందిని తీసుకోవచ్చని వివరించారు. అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలసలు) 14–18 శాతం ఉంటోందని పేర్కొన్నారు. దీన్ని బట్టి చూస్తే జీసీసీల్లో స్థూల నియామకాలు 5,00,000 స్థాయికి చేరొచ్చని వివరించారు.

ద్వితీయ శ్రేణి నగరాలు కీలకం..

జీసీసీ విస్తరణ ప్రణాళికల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ ఏడాది ఐటీ నియామకాల్లో 13–15 శాతం వాటా వీటిది ఉంటుందని భావిస్తున్నారు. దీనితో కొత్త నిపుణులు లభించడంతో పాటు వ్యయాలు మరీ పెరగకుండా చూసుకోవడానికి కూడా కంపెనీలకు వెసులుబాటు లభిస్తుందని విశ్లేషకులు తెలిపారు. ఇప్పటికే 7 శాతం జీసీసీలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# విజయ్‌కు భారీ ఊరట





చెన్నై: తమిళ హీరో విజయ్‌కు మద్రాస్ హైకోర్టు నుండి భారీ ఊరట లభించింది. ఆయన నటించిన జన నాయగన్ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ వెంటనే సెన్సార్ సర్టిఫికేట్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.రివ్యూ కమిటీకి పంపకుండానే హైకోర్టు నేరుగా అనుమతి ఇచ్చింది. కోర్టు స్పష్టంగా జన నాయగన్ చిత్రానికి యూఏ సర్టిఫికేట్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.మద్రాస్ హైకోర్టు తీర్పుతో జన నాయగన్ విడుదలకు మార్గం సుగమమైంది. సంక్రాంతి రోజు విడుదల చేయనున్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.గతేడాది డిసెంబర్‌లో జన నాయగన్ నిర్మాతలు సినిమా విడుదల కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డును ఆశ్రయించారు. సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ ఇవ్వడంలో ఆలస్యం చేసింది. ఈ ఆలస్యంపై జననాయగన్ నిర్మాతలు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.ఇదే అంశంపై ఈ బుధవారం విచారణ చేపట్టిన కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తాజా విచారణలో సింగిల్ బెంచ్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఫిర్యాదు దారుడి గోడు విన్న తర్వాత కూడా సెన్సార్ ఇవ్వకుండా ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లుగా ఉంది.అంటే, సీబీఎస్ఈ మొదట్లో ఎలాంటి అభ్యంతరాలు లేకుండా దరఖాస్తును స్వీకరించింది. కానీ తరువాత, విడుదలకు దగ్గరగా వచ్చేసరికి కొత్తగా అభ్యంతరాలు పెట్టింది. ఇది ముందే ఉన్న అసలు సమస్య కాకుండా, తరువాత కల్పించిన సమస్యలా ఉందని కోర్టు భావించింది. అంతేకాదు, సర్టిఫికేషన్ ప్రక్రియలో అనవసరమైన ఆటంకాలు సృష్టించడం తగదని కోర్టు స్పష్టంగా వ్యాఖ్యానించింది. అనంతరం, సినిమాకు యూఏ సర్టిఫికేట్ ఇవ్వాలని సీబీఎస్ బోర్డుకు సూచించింది. దీంతో జన నాయగన్ సినిమా విడుదలకు మార్గం సుగమమైంది.విజయ్ నటించిన చిత్రాలు తరచుగా రాజకీయ చర్చలకు దారితీస్తాయి. జన నాయగన్ కూడా సమాజంలోని సమస్యలను ప్రతిబింబించేలా ఉందని సమాచారం. ఈ నేపథ్యంలో సీబీఎఫ్‌సీ ఆలస్యం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందా అనే ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి.ఈ తీర్పు సినీ పరిశ్రమలో సెన్సార్ బోర్డు పాత్రపై పెద్ద చర్చకు దారితీస్తోంది. ఒకవైపు సృజనాత్మక స్వేచ్ఛను కాపాడే ప్రయత్నంగా కోర్టు నిర్ణయం కనిపిస్తుండగా, మరోవైపు సర్టిఫికేషన్ ప్రక్రియలో పారదర్శకత అవసరం ఉందని స్పష్టమవుతోంది.

# గోడ మీద పులి

అనగనగా రాజస్థాన్‌లోని రణథంబోర్ నేషనల్ పార్క్.. అక్కడో అందమైన కోట. అక్కడికి పర్యాటకులు వస్తున్నప్పుడు.. కళ్లెదుట ఓ అద్భుతం జరిగింది. రాజసం ఉట్టి పడే చారిత్రక రణథంబోర్ కోట పార్కింగ్ ఏరియాలోకి ఒక బుల్లి పులి పిల్ల దర్జాగా నడుచుకుంటూ వచ్చింది.ఈ క్యూట్ కిల్లర్ రణథంబోర్ అడవిలో ప్రఖ్యాత పులి 'రిద్ధి' సంతానం. అమ్మ పక్కన లేని సమయం చూసి, మన బుజ్జిది బయటకు షికారు చేసింది. మెత్తని పాదాలతో, చారల చొక్కా వేసుకుని, అచ్చం పిల్లిలా మెల్లగా కోట పార్కింగ్‌లోకి అడుగుపెట్టింది. సఫారీ జీపుల్లోని పిల్లలు, పెద్దలు ఆశ్చర్యంగా వీడియోలు తీస్తుంటే.. ఈ బుజ్జి పులి మాత్రం 'నేను మీకంటే అందంగా ఉన్నాను కదా!' అన్నట్టుంది.









# అమిత్ షా కార్యాలయం ఎదుట ఉద్రిక్తత

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయం దుమారం కొనసాగుతుంది. న్యూఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్యాలయం ఎదుట తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు మహువా మోయిత్రా, డెరెక్ ఓ'బ్రయన్ సహా పలువురు నేతలు నిరసనకు దిగారు.ఈ నిరసనలో పోలీసులు వారిని బలవంతంగా లాగి అరెస్టు చేశారు.పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. పశ్చిమ బెంగాల్ అధికార టీఎంసీకి ఐపాక్ ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తోంది. ఈనేపథ్యంలో ఈడీ అధికారులు ఐపాక్ కార్యాలయంపై దాడులు జరిపారు. కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.అయితే,ఈడీ దాడుల్ని టీఎంసీ ఎంపీలు ఖండిస్తున్నారు. ఎన్నికల ముందు ఈడీ దాడులు ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలనే ప్రయత్నం. తమ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయాలని కేంద్రం చూస్తోంది'అని ఆరోపణలు గుప్పిస్తున్నారు.అందుకు బీజేపీ సైతం టీఎంసీ దాడుల్ని తిప్పికొడుతోంది. ఈడీ దాడులు చట్టుపరమైనవని, ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు చేస్తున్న దాడులు చట్టపరమైనవని, అవినీతి కేసులపై విచారణలో భాగమని స్పష్టం చేసింది.

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారంరోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం నాడు తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం నాడు ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హాజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు.

# 'డబ్బులుంటే చాలు.. అమెరికా కాదు.. మిమ్మల్ని అంతరిక్షానికే పంపిస్తాం'!



**తిరువనంతపురం:** రండి బాబు రండి అమెరికాకు వెళ్లాలనుకుంటున్నారా? మీకు విద్యార్హత లేదు. మరేం ఫర్లేదు. డబ్బులు ఉంటే చాలు.. అమెరికాకు కాదు.. అంతరిక్షానికైనా పంపిస్తామంటూ పలువురు కేటు గాళ్లు అమాయకులకు వల వేస్తున్నారు.కోరుకున్న జీవితం, కోరుకున్న జీతం రావడంతో పలువురు నమ్మి మోసపోతున్నారు. వలసదారులపై ట్రంప్ విధిస్తున్న ఆంక్షలకు బలవుతున్నారు. కాళ్లు,చేతులకు సంకెళ్లు వేయించుకుని మరీ స్వదేశాలకు వస్తున్నారు. తాజాగా వెలుగులోకి వచ్చిన ఉదంతమే అందుకు ఉదాహరణనల్లగొండ జిల్లా పరేపల్లిగూడేనికి చెందిన పకీర్ గోపాల్‌రెడ్డి నకిలీ విద్యార్హత పత్రాలతో అమెరికా వెళ్లి ఉద్యోగం పొందాడనే ఆరోపణలపై అక్కడి అధికారులు అతడిని డిపోర్ట్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో దిగిన వెంటనే ఆర్‌జీఐఏ పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గోపాల్‌రెడ్డి మధురై కామరాజ్ యూనివర్శిటీ నుంచి బీఎస్సీ కంప్యూటర్ పూర్తి చేశానని నకిలీ సర్టిఫికెట్ పొందాడు. దీని ఆధారంగా స్టూడెంట్ వీసా తీసుకుని 2023 సెప్టెంబర్‌లో అమెరికా వెళ్లి, డల్లాస్‌లోని వెబ్‌స్టర్ యూనివర్సిటీలో మాస్టర్స్‌లో చేరాడు. కానీ అతడు సమర్పించిన డిగ్రీ నకిలీదని తేలడంతో అమెరికా అధికారులు అతడిని తిరిగి పంపించారు. విచారణలో గోపాల్‌రెడ్డి ఆ సర్టిఫికెట్‌ను రూ.80 వేలకే కొనుగోలు చేశానని అంగీకరించాడు.ఈ కేసు తీగ లాగిన సైబరాబాద్ పోలీసులు కేరళలోని మలప్పురం జిల్లా పొన్నానిలో ఉన్న మార్క్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌పై దాడి చేశారు. అక్కడి పోలీసులు వేల సంఖ్యలో నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ స్కామ్ విలువ దాదాపు రూ.750 కోట్ల వరకు ఉంటుందని అధికారులు వెల్లడించారు. మార్క్ సంస్థ నిర్వాహకుడు అర్షద్‌ను పట్టుకున్న పోలీసులు విచారించగా, ఈ సర్టిఫికెట్లు తిరుర్‌లోని ఫోర్మా మాల్‌లో ఉన్న ఎడుహబ్ కన్సల్టెన్సీ నుంచి వస్తున్నాయని బయటపెట్టాడు. అక్కడి నుంచి వందల సర్టిఫికెట్లు సీజ్ చేశారు. ఈ తయారీలో పయ్యనంగడికి చెందిన అబ్దుల్ నిస్సార్ కీలక పాత్ర పోషించినట్లు తేలడంతో అతడినీ అరెస్టు చేశారు.ఈ ముఠా దేశవ్యాప్తంగా వేల మందికి నకిలీ విద్యార్హత పత్రాలు సరఫరా చేసింది.ఎస్సెస్సీ, ప్లస్ టూ, బీఏ, బీకాం, ఎంబీఏ, ఎంకామ్, బీఎస్సీ, బీఈడీ, బీటెక్‌లతో పాటు ఎల్ఎల్‌బీ, పీజీ కోర్సులు, పీహెచ్‌డీ వరకు అన్ని స్థాయిలలో సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయించారు. ఒక్కో సర్టిఫికెట్‌ను రూ.25 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు అమ్మారు. తిరూర్ ఈస్ట్‌లోని చెంబ్రాకు చెందిన ధనీష్ ధర్మన్ ఈ రాకెట్‌కు నాయకుడు. అతడు 'డానీ' అనే పేరుతో నకిలీ సర్టిఫికెట్ల వ్యాపారం నడిపాడు. తమిళనాడులోని శివకాశీలో ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసి, ఉద్యోగులకు రెగ్యులర్ జీతాలు, పీఎఫ్, ఇతర సౌకర్యాలు కూడా కల్పించాడు. శివకాశీ ప్రింటింగ్ ప్రెస్‌కు చెందిన జైనుల్ అబీదీన్ అరెస్టుతో డానీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ధనీష్ 2011లో కూడా నకిలీ సర్టిఫికెట్ల కేసులో పట్టుబడ్డాడు. అప్పట్లో బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ ఈ దందా మొదలుపెట్టాడు.ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.20 వేల రూపాయలు వసూలు చేస్తూ, ధనీష్ 10 ఏళ్లలో రూ.100 కోట్లకు పైగా సంపాదించాడు. ఈ సంపాదనతో పుణే, దుబాయ్‌లో వ్యాపారాలు ప్రారంభించాడు. చివరకు కారవాన్‌లో ఎయిర్‌పోర్టుకు వెళుతుండగా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. మొత్తంగా, ఈ నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ కేరళ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించి, వందల కోట్ల రూపాయల స్కామ్‌గా మారింది. గోపాల్‌రెడ్డి కేసు ద్వారా ఈ భారీ నెట్‌వర్క్ గుట్టు రట్టు కావడం, విద్యార్హత పత్రాల మోసంపై పెద్ద ఎత్తున దర్యాప్తుకు దారితీసింది.


# లేడీ కిలాడీలు..

## సీసీ ఫుటేజ్‌లో షాకింగ్ దృశ్యాలు

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఓ చోరీ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కస్టమర్లుగా నటిస్తూ గోల్డ్ షాప్‌కు వెళ్లిన మహిళలు చోరీకి పాల్పడ్డారు.ముగ్గురు మహిళలు కేవలం 14 నిమిషాల్లోనే రూ.14 లక్షల విలువైన బంగారు చెవి పోగులు దొంగిలించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రయాగ్‌రాజ్‌లోని కల్యాణ్ జువెలర్స్ షోరూమ్‌లో డిసెంబర్ 31 2025న ఈ ఘటన జరిగింది.ఆభరణాలు కొనేందుకు కస్టమర్లుగా వెళ్లిన ముగ్గురు మహిళలు.. సేల్స్‌మెన్ వారికి బంగారు ఆభరణాలను చూపించడంలో బిజీగా ఉన్న సమయంలో షోకేస్‌లో ఉన్న చెవిపోగుల డిస్‌ప్లే ప్యాడ్‌ను దొంగలించారు. ఎవరికీ కనిపించకుండా దుస్తుల్లో దాచి అక్కడ నుంచి వెళ్లిపోయారు. కేవలం 14 నిమిషాల్లోనే పనిపూర్తి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యాయి.డిస్‌ప్లే ప్యాడ్ కనిపించకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా.. ఈ వ్యవహారం బయటపడింది. జువెలర్స్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా మహిళల్ని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.ఈ ఘటనపై నెటిజన్లు పలు కామెంట్లు చేస్తున్నారు. సేల్స్‌మన్‌ను దృష్టి మళ్లించి, షాప్‌లో ఆభరణం దాచడం సినిమా సన్నివేశంలా ఉందంటూ ఒకరు.. సెక్యూరిటీ గార్డ్‌తో పాటు, సీసీటీవీని గమనిస్తూ వెంటనే అలర్ట్ చేసే వ్యక్తిని కూడా నియమించాలంటూ మరొకరు సూచనలు ఇస్తున్నారు. మరో నెటిజన్ వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తూ.. అది కూడా ఒక స్కిల్‌నే, దాంతో సంపాదించనివ్వండి." అంటూ కామెంట్ పెట్టారు.

# మున్సిపల్‌పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 9 (జనంసాక్షి):** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్ లో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రానున్న మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు అండగా ఉంటూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో సీనియర్ నాయకులు, బూత్ కమిటీ, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ వారి ఏకాభిప్రాయంతో సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ పద్ధతిలో వార్డుల వారిగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. 28 వార్డులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి వేములవాడలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికలో ఇచ్చిన హామీలను ఒక్కకటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలకు అవకాశం ఇచ్చిన వేములవాడను అభివృద్ధి చేయలేదని అయన విమర్శించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశాన్ని ఇవ్వాలని కోరారు. గత 50 ఏళ్లుగా వేములవాడ ప్రజలు ఎదురు చూస్తున్న చిరకాల కోరిక రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా సాగుతున్నాయని, గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని అభివృద్ధి కేవలం రంగు రంగుల వీడియోల్లో మాత్రమే చేపట్టారని ఎద్దేవా చేశారు. ఆనాడు కేసీఆర్ రాజన్న మెట్ల వద్ద మాట్లాడుతూ నా లగ్గం ఇక్కడే అయ్యింది, ఏటా ఆలయ అభివృద్ధికి రూ 100 కోట్లు ఇస్తానని రాజన్న భక్తులను మోసం చేసిందన్నారు. కాని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ 150 కోట్లతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆనాడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాజన్న ఆలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి రెండు కళ్లలా ముందుకు పోతున్నమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని వేములవాడలో ఎమ్మెల్యే గా మీ బిడ్డగా ఉనన్నానని నాకు చెయ్యి తిరిగే వారిని మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించి వేములవాడ మున్సిపల్ చైర్మన్ గా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి వేములవాడ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలను కోరారు. 2015లో మూలవాగు పై మూడవ బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి వదిలేశారని కానీ పలు సందర్భంల్లో మూడవ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయినట్లు వీడియోలు తీసుకొని ప్రజలను మభ్యపెట్టారని అయన ఆరోపించారు. ప్రజా పాలన ఏర్పడిన తర్వాత మూడవ బ్రిడ్జి పనులు ప్రారంభం అయ్యాయని త్వరలోనే పూర్తి అవుతుందన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో సుమారు 2000 మంది అడుగు జాగా లేని ప్రజలకు స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రూ 10 కోట్లతో గుడి చేరువు, మూలవాగులో మురికి నీరు కలవకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నమన్నారు. వేములవాడను పర్యటక రంగంలో అభివృద్ధి చేస్తున్నాని గుడి చెరువులో బోటింగ్ ఏర్పాటు కోసం రూ 1 కోటి 40 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే నాంపల్లి లో రోప్ వే, ఎయిర్ క్రాఫ్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నన్నారు. సిఏం రాజన్న ఆలయ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, మంత్రులు త్వరలోనే వేములవాడకు వచ్చి పనులను పర్యవేక్షిస్తారన్నారు. పట్టణంలో 42 కుల సంఘాలకు సుమారు రూ 6 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని, మీ ఎన్నికల్లో మీ గెలుపు కోసం కష్టపడుతానన్నారు. వెనుకబడిన వేములవాడను అభివృద్ధి చేస్తున్నానని, ఎన్నికల్లో అందరం సమిష్టిగా పని చేసి ప్రతి పక్షాలు చేస్తున్న దృష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వేములవాడ సెస్ డైరెక్టర్ నామాల ఉమా లక్ష్మీరాజం, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పిన అల్ఫోర్స్

- పండుగలు ఆనందాన్ని కలిగిస్తాయి
- విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జనవరి 09 (జనంసాక్షి) :** సంక్రాంతి పండుగకు భారత దేశంలో ప్రత్యేకత ఉన్నదని, ఈ పండగ ద్వారా పల్లె వాతావరణాన్ని, పల్లె వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పడం జరుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ (ఎస్6 క్యాంపస్), అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ నెక్స్ట్ ( హై స్కూల్ క్యాంపస్), మంకమ్మ తోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్ లో , భగత్ నగర్ లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఆకాశమే హద్దుగా అన్నట్టు వైవిధ్యంగా వేడుకగా ఏర్పాటు చేసినటు వంటి అల్ఫోర్స్ సంక్రాంతి సంబరాల మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు ప్రారంభించారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణాలలో ఏర్పాటు చేసినటువంటి శ్రీగోదారం గనాథ స్వామి వారి చిత్రపటానికి పూజా నిర్వహించి జ్యోతి ప్రజ్వల నతో వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం సంక్రాంతి పండుగని, ఈ పండుగ ద్వారా సమాజంలో సుభిక్షం నెలకొంటుందని తద్వారా ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవిస్తారని వారు చెప్పారు. సంక్రాంతి వైభవాన్ని చాటి చెప్పే విధంగా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో చాలా గొప్పగా వేడుకగా ఉత్సవాలను విద్యార్థుల ఆనందో త్సవాల నడుమ జరుపుకోవడం జరుగుతుందని వారు చెప్పారు. విద్యార్థులకు సాంస్కృతిక వైభవాన్ని తెలియజేయవలసిన అవసరం ఎంతగానో ఉందని వాటిని సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా ప్రోత్సాహం అందించాలని తల్లిదండ్రులు సైతం ప్రేరేపిం చాలని సూచించారు. సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు చాలా గొప్పగా తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల్లో సైతం నిర్వహించుకోవడం చాలా గొప్ప విషయమని, దేశ విదేశాల్లో సైతం ఈ పండుగ వైభవాన్ని చాలా ఘనంగా జరుపుకుంటారని వారు చెప్పారు. పండగల ద్వారా సంబంధాలు బలపడతాయని, ప్రేమ ఆప్యాయతలు పంచడం జరుగుతుందని వారు చెప్పారు. ప్రధానంగా ఏ పండగ పూట ఈ పండుగ సమయాన శ్రీ గోదా రంగనాథుల కళ్యాణం, సూర్యభగవానునికి ప్రత్యేకమైనటువంటి ఆరాధనలతో పాటు పూజలను నిర్వహిస్తారని వారు చెప్పారు. ఈ పూజ కార్యక్ర మాలు చేసిన వారికి శుభఫలాలతో పాటు మహిళలకు మాంగల్యం సిద్ధిస్తుందని పలు పురాణాల ద్వారా తెలుస్తుందని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ పూజా కార్యక్రమాలను పాల్గొని ఆ భగవంతుని కృపకు పాత్రులు కావాలని సూచించారు. పండుగను చాలా విశిష్టంగా పరిగణిస్తారని వారు చెప్పారు, ఈ పండుగలో ప్రత్యేక ఆకర్షణీయమైన ముగ్గులు, పిండివంటలు ప్రదర్శించారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అదేవిధంగా ప్రాంగణాన్ని అందంగా పల్లె వాతావరణం తలపించే విధంగా అలంకరించి ఆలోచింపజేశారు. సంక్రాంతి పండుగకు సూచికలైన భోగి, నోములు, భోగి పళ్ళు, మంగళ గౌరీవ్రతం తదితర కార్యక్రమాలు ఉత్సాహంగా చేపట్టి పండుగ విశిష్టతను అద్భుతంగా వర్ణించారు. భగత్ నగర్ పాఠశాల ప్రాంగణంలో మేడారం జాతర విశిష్టతను సమ్మక్క సారలమ్మ జాతర వైభవాన్ని చాలా గొప్పగా అందమైన ప్రదర్శనలతో చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేములవాడలో ఎరువుల దుకాణాల తనిఖీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 9 (జనంసాక్షి):** వేములవాడలోని ఎరువుల దుకా ణాలను శుక్రవారం టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ మాట్లాడుతూ వేములవాడలో ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం మండలంలో 60 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులకు అవసరమైన మేరకే ఎరువులను విక్రయించాలని డీలర్లకు సూచించారు. భవిష్యత్తు అవసరాల నిమిత్తం ఎప్పటికప్పుడు సరఫరా కొనసాగుతుందన్నారు. రైతులు నానో యూరియా వాడకంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అయన వెంట పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సతీష్ పాల్గొన్నారు.

## జీవన్ రెడ్డిపై ఎమ్మార్పీఎస్ పోరాటం ఆగదు



**ఆర్మూర్, జనవరి 9(జనంసాక్షి):** ఎంఆర్పీఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జ్ మైలారం బాలు మాదిగ ఆధ్వర్యంలో తలారి సత్యం వర్ధంతి సందర్భంగా ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తాలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఎన్నిక చెల్లదని పిర్యాదు చేసినందుకు, జీవన్ రెడ్డి తన బంధువు టిప్పర్ తో గుద్ది చంపి దాన్ని అధికార బలం, పోలీసుల సహకారంతో తలారి సత్యం హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని మండిపడ్డారు. ఈ విషయంలో ఎమ్మార్పీఎస్, కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ప్రతిఘటించి జీవన్ రెడ్డిని శిక్షించాలని ఎన్నో పోరాటాలు చేశామన్నారు. కాగా 10 సంవత్సరాలు టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండడంతో జీవన్ రెడ్డి మీద సిబిసిఐడి విచారణ కప్పి పెట్టారని చెప్పారు. గతంలో ప్రతి పక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి ఆర్మూర్ కు విచ్చేసి తలారి సత్యం కుటుంబ సభ్యులను పరామర్శించి జీవన్ రెడ్డి కి శిక్ష పడేంతవరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నందున తక్షణమే సిబిసిఐడి విచారణ జరిపి జీవన్ రెడ్డిని అరెస్టు చేసి శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో ఎంఆర్పీఎస్ నాయకులు నాగం రాజేష్, ఇందరపు రాజు, మండల అధ్యక్షులు మైలారం రాము, విప్లవ్, కాంగ్రెస్ నేత కొల వెంకటేష్, దళిత ఐక్య వేదిక గుమ్మడి చంద్రయ్య, లంబడ ఐక్యవేదిక శ్రీనివాస్ నాయక్, పిడిఎస్యూ రాజు, బండి రవీంద్ర, లక్ష్మణ్, కూతడి ఐలయ్య, సుద్దపల్లి మార్క్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## రామప్పను సందర్శించిన హిమాచల్ ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి



**ములుగు/ వెంకటాపూర్, జనవరి09 (జనంసాక్షి):** వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాగూర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో శాలువాలతో సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు ఆలయ విశిష్టతను శిల్పకళా ప్రాముఖ్యతను టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ వారి బోట్లను బోటింగ్ చేశారు. వారి వెంట అడిషనల్ కలెక్టర్ సంపత్ రావు, విద్యాశాఖ అధికారులు, తాసిల్దార్ గిరిబాబు ఎస్ఐ చల్ల రాజు, పోలీస్, రెవెన్యూ, దేవాధాయ, పురావస్తు శాఖల సిబ్బంది, టూరిస్ట్ పోలీస్‌లు ఉన్నారు.

# ఫిబ్రవరిలో కొడవటంచకు రానున్న సీఎం రేవంత్ రెడ్డి



**రేగొండ, జనవరి09(జనంసాక్షి):** వచ్చే ఫిబ్రవరి నెలలో కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ పున:ప్రతిష్టాపన మహోత్సవంనకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి రానున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, రెవెన్యూ, దేవాదాయ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్ మరియు విద్యుత్తు శాఖల అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు బాలాలయంలో స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న పనులను కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ఆలయంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 12వ తేదీలోగా అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అదేవిధంగా, ఇప్పటికే చేపట్టిన పనులకు సంబంధించిన ఎంబి రికార్డులను ఈనెల 19వ తేదీలోగా పూర్తి చేయాలని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వచ్చే నెలలో దేవాలయానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్నారని, ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి ఈఈకి సూచించారు. అదనపు పనుల కొరకు ప్రతి పాదనలు, పూర్తి అయిన పనులకు ఎంబి రికార్డులను అందచేయాలని సూచించారు.

## నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు చేపట్టాలి

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 9 (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనుల తీరును శుక్రవారం దోమకొండ మండలం సీతారాంపల్లి గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల తీరును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, ఉపయోగిస్తున్న నిర్మాణ సామగ్రి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులు, సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే లబ్ధిదారులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు..కలెక్టర్ వెంట పిడి హౌసింగ్ విజయపాల్ రెడ్డి, ఎమ్మార్వో విజయ కుమార్, , ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ నర్సయ్య, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

# సక్రమంగా నీరు ఇవ్వకుండా అక్రమ వసూలు

### జలమండలి అధికారులపై బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



**రాజేంద్రనగర్, జనవరి9(జనంసాక్షి):** సక్రమంగా నీరు ఇవ్వకుండా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు సీతారాం దూళిపాల ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని రాష్ట్ర జలమండలి ఐఏఎస్ అధికారి అశోక్ రెడ్డిని శుక్రవారం కలిసి, డివిజన్?18 అధికారుల వ్యవహార శైలిపై వినతిపత్రం సమర్పించారు. మణికొండ, పుప్పాలగూడ, నెక్నంపూర్ ప్రాంతాల్లో సక్రమంగా నీరు సరఫరా చేయకపోయినా భారీగా నీటి బిల్లులు వసూలు చేయడం అన్యాయమని తెలిపారు. గ్రామ పంచాయతీలుగా ఉన్న కాలంలో ఏక మొత్తంగా రుసుములు వసూలు చేసిన జలమండలి, మున్సిపాలిటీగా మారిన తర్వాత సరఫరా పెంచకుండా గత ఐదేళ్ల బకాయిల పేరుతో ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. అక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉన్నా మూడు రెట్లు పెనాల్టీలు, వాల్యులు- కనెక్షన్ల పేరుతో అధిక వసూలు, చెడిపోయిన వాటర్ మీటర్లపై నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపించారు. కన్స్యూమర్ అకౌంట్ నంబర్ లేదనే కారణంతో ఇష్టానుసారం వసూలు చేస్తున్నారని, అక్రమ కనెక్షన్లపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అక్రమాలను సరిదిద్దకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, నవీన్ కుమార్, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, భానుచందర్, సుమనలిని, రఫీక్, ఆశ్ఫాక్ అలీ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో స్మార్ట్ కిడ్జ విద్యార్థిని ప్రతిభ



**ఖమ్మం, జనవరి 9 (జనంసాక్షి) :** రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో స్మార్ట్ కిడ్జ పాఠశాల విద్యార్థిని శన్విక కు మూడవ బహుమతి లభించింది. ఖమ్మం లోని హరిత గార్డెన్స్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో శన్విక పలు రౌండ్లలో విశేష ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతిని సొంతం చేసుకుంది. ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారి శన్విక తొలిసారి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని చదరంగంలో అత్యంత ప్రతిభ కనబరిచి మూడవ స్థానంలో నిలవడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య శన్వికకు తృతీయ బహుమతిని అందించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించడం వలన ఉన్నత స్థాయి పోటీలలో రాణించి బహుమతులు సాధించి పాఠశాల ఖ్యాతిని ఇనుమ డింప చేస్తున్నారని తెలియజేశారు. చదువుతోపాటు పాఠశాల విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దుతూ ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్తంగా చైనా మంజాపై 157 ప్రదేశాలలో ఆకస్మిక తనిఖీలు





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 9 (జనంసాక్షి):** చైనా మంజా వద్దు సంక్రాంతి సంబరాల్లో ప్రాణాలతో ఆటలొద్దని, కామారెడ్డి జిల్లాలో చైనా మంజాపై సంపూర్ణ నిషేధం విధించినట్టు నైలాన్ దారాలు ప్రాణాంతకం సాధారణ దారాలతోనే గాలిపటాలు సురక్షితమని భవనాలపై నుంచి గాలిపటాలు ఎగురవేయాలంటే భద్రత తప్పనిసరని జిల్లా ఎస్పి యం రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి జిల్లా పరిధిలో చైనా మంజాను పూర్తిగా నిషేధించినట్లు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఉల్లంఘిస్తూ చైనా మంజాను విక్రయించినా, వినియోగించినా లేదా దాని వల్ల ఎవరికైనా ప్రమాదం సంభవిం చినట్లయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో 157 ప్రదేశాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారయ్యే చైనా మంజా పర్యావర ణానికి తీవ్ర హానిని కలిగించడంతో పాటు ప్రజలు, వాహనదారులు మరియు పక్షులకు ప్రాణాపాయం కలిగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గతంలో చైనా మంజాతో గాలిపటాలు ఎగురవేసే సమయంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, కొన్ని సందర్భాల్లో గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా తీవ్రంగా గాయపడిన ఘటనలు నమోదయ్యాయని తెలిపారు. ఈ కారణాల దృష్ట్యానే చైనా మంజాపై సంపూర్ణ నిషేధం విధించబడిందని ఎస్పీ స్పష్టం చేశారు. చైనా మంజా విక్రయాలు మరియు వినియోగంపై పర్యావరణ పరిరక్షణ చట్టం1986 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ఎక్కడా చైనా మంజా విక్రయాలు జరగ కుండా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు చైనా మంజాను ఉపయోగించకుండా, ఎవరికీ హాని కలగని సాధారణ దారాలతోనే గాలిపటాలు ఎగురవేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గాలిపటాలు ఎగురవేసే వారు తప్పనిసరిగా కరెంట్ స్థంభాలకు దూరంగా, మైదానాలు వంటి సురక్షిత ప్రదేశాల్లోనే గాలిపటాలు ఎగురవేయాలని సూచించారు. అలాగే భవనాలపై నుంచి గాలిపటాలు ఎగురవేసే వారు తగిన భద్రతా చర్యలు పాటిస్తూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఎవరైనా చైనా మంజాను నిల్వ ఉంచిన, తయారు చేసిన, విక్రయించిన లేదా విక్రయాలకు ప్రోత్సహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. చైనా మంజా విక్రయాలు లేదా వినియోగం ఎక్కడైనా గమనిం చినట్ల యితే వెంటనే డయల్ 100 పోలీస్ కంట్రోల్ రూమ్ 8712686133 కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, తగిన ప్రోత్సాహకాన్ని కూడా అందిస్తామని జిల్లా ఎస్పీ గారు తెలిపారు.

## మరిపెడలో భారీ అగ్ని ప్రమాదం

### హోని సెవెన్ హిల్స్ రెస్టారెంట్‌లో ఆస్తి నష్టం 50 లక్షలు



**మరిపెడ జనవరి 9 (జనంసాక్షి):** మరిపెడ మండల కేంద్రంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో రెస్టారెంట్ లో అగ్ని ప్రమాదం జరిగి భారీగా ఆస్తి నష్టం జరిగింది. మరిపెడ మండల కేంద్రంలోని హోని సెవెన్ హిల్స్ బార్ అండ్ రెస్టారెంట్ లో శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. తెల్లవారుజామున అటుగా వెళ్తున్నవారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన స్పందించిన పోలీస్ అగ్ని మాపక సిబ్బంది ఘటన స్టలానికి చేరుకొని మంటలు ఆర్పారు. విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగి ఉండొచ్చని తెలుస్తుంది. ఈ ప్రమాదంలో సుమారు 40 నుండి 50 లక్షలు రూపాయలు నష్టం జరిగినట్లు బార్ యజమాని దుబ్బాక నరేష్ రెడ్డి తెలిపారు.

# ప్రపంచస్థాయి విద్యలో భారత్ దిశానిర్దేశం చేస్తున్న బిట్స్ పిలానీ

## 'బిట్సా గ్లోబల్ మీట్-2026' ప్రారంభించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**మేడ్చల-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జనవరి 9 (జనంసాక్షి) :** ప్రపంచ స్థాయి విద్య లక్ష్యంగా భారత్ చేస్తున్న ప్రయాణంలో బిట్స్ పిలానీ అగ్రగామిగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థుల అంతర్జాతీయ సమ్మేళనం 'బిట్సా గ్లోబల్ మిాట్?2026' ఆరో సంచికను శుక్రవారం హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీ ప్రాంగణంలో గవర్నర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ బిట్స్ పిలానీ కేవలం విద్యా ప్రతిభకే పరిమితం కాకుండా తరతరాలుగా ఆవిష్కరణలు, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, నిర్భయమైన జిజ్ఞాసను పెంపొందిస్తూ వస్తోందన్నారు. కృత్రిమ మేధస్సు, డిజిటల్ మార్పులు విద్యా వ్యవస్థను మౌలికంగా మార్చుతున్నాయని, అయితే మానవ విచక్షణ, నైతికత, సృజనాత్మకత, కరుణకు సాంకేతికత ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. విద్య లక్ష్యం యంత్రాలతో పోటీ పడడం కాకుండా సమాజ హితానికి సాంకేతికతను సరైన దిశలో నడిపించగల మానవ విలువలను బలోపేతం చేయడమేనన్నారు.తెలంగాణ రాష్ట్ర సాంకేతిక వ్యవస్థతో అనుసంధానమై బిట్స్ పిలానీ ఆధునిక పదార్థాలు, జీవ సాంకేతిక విజ్ఞానం, వాతావరణ పరిష్కారాలు, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో విశిష్టంగా ఎదుగుతోందని గవర్నర్ పేర్కొన్నారు. ఇలాంటి విద్యా కేంద్రాలు భారతదేశాన్ని కేవలం సాంకేతిక వినియోగదారుడిగా కాకుండా, స్థానిక అవసరాలకు అనుగుణమైన ఆవిష్కరణల సృష్టికర్తగా నిలుపుతున్నాయన్నారు.



పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన గవర్నర్, వారి విజయాలే సంస్థ వారసత్వానికి ప్రతీకలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర కీలకమని, యువతకు మార్గదర్శకులుగా నిలిచి సమాజాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, బీజీఎం-2026 అధ్యక్షురాలు అనిత సాకూరు, బిట్స్ గ్రూప్ ఉపకులపతి ప్రొఫెసర్ వి. రామగోపాల్ రావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమం ముగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి గొడుగు బిఆర్ఎస్



**శేరిలింగంపల్లి, జనవరి 09 (జనంసాక్షి):** తెలంగాణ ప్రజల భావోద్వేగం... ఆత్మాభిమానం తెలిసిన వ్యక్తిగా తెలంగాణ రాష్ట్ర ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి కెసిఆర్ అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని తెలంగాణ భవనానికి శేరిలింగంపల్లి నియోజక వర్గం నుండి వందల సంఖ్యలో పేద పార్టీల నాయకులు కార్యకర్తలు తరలివెల్లి కేటీఆర్ సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరడంతో ఆయన వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ చిరకాల స్వప్నం ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భా వంకోసం అన్ని తానై పనిచేసిన నాటి ఉద్యమ నేత... రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు(కెసిఆర్) రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో రెండు పర్యాయాలు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిఅద్భుత ఫలితాలను, అమోఘమైన అభివృద్ధిని రాష్ట్రానికి కానుకగా ఇచ్చారని గుర్తుచేశారు. కల్లిబొల్లి మాటలు, కుటుంబ పాలనకోసం అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని, విలువైన ప్రభుత్వ భూములను అమ్ముకొని పబ్బం గడుపుకుంటున్నాడని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయి దయనీయస్థితికి చేరుకుందని, ఉద్యోగులకు డిఏలు ప్రకటించలేని దుస్థితికి దగుల్బాజీ సర్కారు దిగజారింది అన్నారు. అందుకే రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ ప్రజల సమగ్ర సంక్షేమమే ఏకైక లక్ష్యంగా కార్యాచరణను రూపొందిస్తున్నారని, రానున్నది గులాబీ ప్రభుత్వమేనని ఆయన ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర యాదవ్, మారబోయిన రవి యాదవ్, మాజీ వార్డ్ మెంబర్ కృష్ణ యాదవ్, నిజాం, ఊట్ల సురేష్, సత్యం, రాజు యాదవ్, శీను, శ్రీశైలం యాదవ్, పాశం రాజు యాదవ్, హరి కుమార్, అందెల సత్యనారాయణ, బాబు యాదవ్, కృష్ణ మండల్, సుభాష్ రాథోడ్, బి.మల్లేష్ గౌడ్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండో ఎడిషన్‌తో తిరిగొచ్చిన నవిజి-8

### భారత నిర్మాణ రంగానికి సరికొత్త నిర్వచనం



**ఖైరతాబాద్, జనవరి 09 (జనంసాక్షి) :** బెంగళూరులో తొలి ఎడిషన్‌తో విశేష విజయాన్ని సాధించిన తరువాత నవిజి-8 తన రెండో ఎడిష న్‌తో మళ్లీ ముందుకొచ్చిందని నవిజి-8 చీఫ్ విజ నరీ స్ట్రాటజిస్ట్ సంధ్య వారియర్ శుక్రవారం నగ రంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆర్కిటెక్చర్, డిజైన్, రియ ల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, బిల్డింగ్ మెటీరియల్స్ రంగాలకు సంబంధించి దేశంలోనే అత్యంత ప్రభా వవంతమైన వేదికలలో ఒకటిగా తన స్థానాన్ని మరింత బలపరుస్తుందని అన్నారు. సంప్రదాయ ఎగ్జిబిషన్‌లా కాకుండా, పరిశ్రమకు దిశానిర్దేశం చేసే ప్రత్యేక ఫోరమ్‌గా రూపుదిద్దుకున్న ఈ రెండు రోజు ల ఈవెంట్‌కు దేశవ్యాప్తంగా 500 మందికి పైగా ప్రముఖ ఆర్కిటెక్టులు, ఇంటీరియర్ డిజైనర్లు, బిల్డ ర్లు, డెవలపర్లు, పరిశ్రమ నేతలు, అంతర్జాతీయ నిపుణులు, కీలక నిర్ణయాధికారులు హాజరుకాను న్నట్లు చెప్పారు. నవిజి-8ను సంప్రదాయ ఎగ్జిబిష న్‌లా కాకుండా ఒక క్యూరేటెడ్ ఎకోసిస్టమ్‌గా రూపొందించామని తెలిపారు. హైదరాబాద్ ఎడిషన్ భారత భవన నిర్మాణ సామాగ్రి, నిర్మాణ రంగాల పరిణామాన్ని ప్రతిబింబిస్తోందని చెప్పారు. బలమైన పరిశ్రమ, సంస్థాగత మద్దతు నవిజి-8 రెండో ఎడిషన్‌కు జాతీయ, ప్రాంతీయ స్థాయిలో ప్రముఖ పరిశ్రమ సంస్థల మద్దతు లభిస్తోంది. ఇది రంగంలో ఈ వేదికకు ఉన్న విశ్వసనీ యతను, ప్రాధాన్యతను స్పష్టం చేస్తోందన్నారు.

### పీఎం కుసుం పథకం ప్రారంభ

# గడువును సెప్టెంబర్ వరకు పొడిగించాలి



**హైదరాబాద్ జనవరి 09 (జనంసాక్షి) :** పీ.ఎం కుసుం పథకం కింద రాష్ట్రంలో సోలార్ ప్రాజెక్టులను ప్రారంభించే గడువును మార్చి నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు పొడిగించాలని కోరుతూ ఆ రైతు సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆదినారాయణ రాజు నేతృత్వంలోని బృందం సభ్యులు సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో పీ ఎం కుసుం రైతు సంఘం ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిని రెడ్కో అధికారులకు చిన్నారెడ్డి ఎండార్స్మెంట్ చేశారు. గిరిజన, గిరిజనేతర ప్రాంతాల్లో స్థాపించే సోలార్ ప్రాజెక్టులకు బ్యాంకులు రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతుల దరఖాస్తులను అభివృద్ధిదారుగా కాకుండా వ్యక్తిగతంగా పరిగణించాలని ఆదినారాయణ కోరారు.

# ప్రతి విద్యార్థి చదువుల్లో మెరుగ్గా ఉండాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ ప్రతినిధి జనవరి 9 (జనంసాక్షి):** ప్రతి విద్యార్థి చదువులో మరింత మెరుగ్గా ఉండాలని, పాఠ్యాంశాల పైన పట్టు సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం( కేజీబీవీ )ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఎనిమిది, పదో తరగతి లను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. 8వ తరగతిలో పాఠ్యాంశానికి సంబంధించి విద్యార్థినుల విషయ పరిజ్ఞానంతో పాటు పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆంగ్లంలో ఉన్న పాఠ్యాంశం తెలుగు వివరణ ను విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం స్టూడెంట్ వెల్నెస్ కార్యక్రమం గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఉపాధ్యాయినీలతో విద్యా బోధనకు సంబంధించిన అంశాలను గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ చదువుల్లో ప్రతి విద్యార్థి మెరుగ్గా ఉండేవిధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యాలయం ప్రాంగణంలోని



వంటగదిని తనిఖీ చేశారు. విద్యార్థినులకు వండిన భోజన పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ప్రతిరోజు భోజన పదార్థాలను చేస్తున్నారా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఎంఈఓ పులి ఆనందం, కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత, తదితరులు పాల్గొన్నారు.

# చట్ట సభలలో సగ భాగం వాటా కావాలి

- సమాజంలో సగ భాగం ఉన్న మహిళలకు
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్షి

**హయత్ నగర్, జనవరి 09 (జనంసాక్షి):** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో గురువారం రాత్రి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, సీనియర్ సిటిజన్ ఆధ్వర్యం లో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీలలో 40 మంది మహిళలు పాల్గొన్నారు. మొదటి బహుమతి జె స్వప్న , ద్వితీయ బహుమతి ప్రణయ రెడ్డి , తృతీయ బహుమతి పి లావణ్య లకు ఎంపిక చేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ కన్సిలేషన్ ప్రైజ్ లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి హాజరైనారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ నేడు సమాజంలో సగభాగము మహిళలు ఉన్నారని, మహిళలు ద్వితీయ పౌరురాలుగాని కొనసాగుతుందని నేడు మహిళలు అన్ని రంగాలలో ముందుకెళున్నారని వారు అన్నారు. పాలకులు మహిళలను మనుసంస్కృతి పేరున మహిళలను వంట ఇండ్లుకు పరిమితి చేయాలని, ఆదిమ కాలము నాటి సమాజాన్ని తీసుకురావాలని కుట్రలు పన్నుతున్నదని, ఈ కుట్రల



కు వ్యతిరేకంగా సమాజంలో సగ భాగం ఉన్న మహిళలను చైతన్యవంతంగా పోరాటాలు నిర్వహించి చట్టసభల్లో స్థానిక సంస్థల్లో మనకు రావలసిన కోటని పోరాడి సాధించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎల్ అరుణ, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిరుమల సంధ్య, ఐద్వా రాష్ట్ర నాయకురాలు శశికళ, స్థానిక నాయకులు రాసూరి ఐలమ్మ, చింతపల్లి మంజుల, వీరమల్ల కళావతి, కీసరి నర్సిరెడ్డి, రాసూరు బిక్షపతి, చింతపల్లి కృష్ణయ్య, చిట్యాల జనార్దన్ రెడ్డి, చిట్యాల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అల్ట్రా ప్రీమియం 'ఓడియన్ మాల్' ప్రారంభం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా

**హైదరాబాద్ జనవరి 09 (జనంసాక్షి) :** ప్రపంచ స్థాయి షాపింగ్, డైనింగ్, వినోదాల సమ్మేళనంగా ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లో ఏర్పాటు చేసిన అల్ట్రా ప్రీమియం 'ఓడియన్ మాల్'ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓడియన్ మాల్ డైరెక్టర్ తుల్లా విజయేందర్ గౌడ్ మాట్లాడుతూ ఓడియన్ మాల్ ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌కు ఒక కొత్త అధ్యాయాన్ని తీసుకొస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఓడియన్ మాల్ ప్రమోటర్లు అమర్‌నాథ్ వుప్పలంచ మాట్లాడుతూ అత్యుత్తమ షాపింగ్, లైఫ్‌స్టైల్ గమ్య స్థానాన్ని నిర్మించాలన్న దృష్టితో ఓడియన్ మాల్ ఏర్పాటు చేశామన్నారు. అతిథులుగా తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ఎండీ అజహరుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్, ఎంఎల్‌సీ పీ మహేందర్ రెడ్డి,



ప్రమోటర్లు, డెవలపర్లు ఓడియన్ మాల్ డైరెక్టర్ తుల్ల విజయేందర్ గౌడ్, ఓడియన్ మాల్ డైరెక్టర్ అమర్‌నాథ్ వుప్పలంచ, శాంత శ్రీ రామ్ కన్స్ట్రక్షన్స్ ఎండీ నర్సయ్య, పీవీఆర్ సినిమాస్ సీఈఓ ప్రమోద్ అరోరా, సైఫ్ అలీ ఖాన్, నజాఫ్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణిలో 472 దరఖాస్తులు

**హైదరాబాద్ జనవరి 09 (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 472 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 120, రెవెన్యూ శాఖకు సంబంధించి 29, విద్యుత్ శాఖకు 26, ఇందిరమ్మ ఇండ్ల కోసం 219, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 77 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.ద

# సౌదీ జైలులో ఉన్ననా భర్తను విడిపించండి

### శైలజ విజ్ఞప్తి



**హైదరాబాద్ జనవరి 09 (జనంసాక్షి) :** సౌదీలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న తన భర్త మంగలారం సాయి కుమార్ ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి జైలులో బందించారని, తన భర్తను విడిపించి స్వదేశానికి రప్పించాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి గ్రామానికి చెందిన మంగలారం శైలజ అనే మహిళ శుక్రవారం సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డికి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన చిన్నారెడ్డి సౌదీ ఎంబసీ అధికారులతో మాట్లాడి సాయి కుమార్ విడుదల కోసం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రికి సూచించారు.

# జిల్లాలో 20 మంది కారుణ్య నియామకాలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జనవరి 9 (జనంసాక్షి):** జిల్లాలో 20 మంది యువతను కారుణ్య నియామకాల క్రింద ఉద్యోగాలలో నియమించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ తో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తూ ఆకస్మాత్తుగా మరణించిన వారి కుటుంబ పోషణ నిమిత్తం ఆయా కుటుంబ సభ్యులలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని, ఈ క్రమంలో 20 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు వారి సంక్రాంతి బంపర్ ఆఫర్

## స్పెషల్ బస్సుల పేరుతో చార్జీలు పెంచిన ఆర్టీసీ

### పట్టణం నుండి పల్లెలకు బస్సు చార్జీల మోత

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి):** సంక్రాంతి పండుగ సందర్భంగా సర్కారు ఆర్టీసీ బస్సు చార్జీలను మరోసారి మోత మోగిస్తుంది పండుగ సందర్భంగా పట్టణాల నుండి ప్రజలు పల్లెల్లోకి వెళ్తారని భావించిన సర్కార్ ఏకంగా 30 రూపాయల చార్జీలు పెంచింది హైదరాబాద్ నగరం నుండి షాద్ నగర్ ప్రాంతానికి స్పెషల్ బస్సుల పేరుతో ఏకంగా 30 రూపాయలు పెంచింది శుక్రవారం నుండి సంక్రాంతి పండుగ చివరి రోజు వరకు ఈ ఇవే ఛార్జీలు కొనసాగనున్నాయి మళ్ళీ తిరిగి ప్రజలు పల్లెల నుండి పట్టణాలకు వెళ్ళే క్రమంలో మళ్ళీ తిరిగి పల్లెల నుండి పట్టణం వైపు చార్జీలను





పెంచుతారని కొందరు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సు చార్జీలు విపరీతంగా పెరగడంతో ప్రయాణికులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ప్రతి పండుగ పండుగకు ఇలా చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 9, (జనంసాక్షి):** బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, బాలల హక్కులను కాపాడ టం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, బాలల సంక్షేమ కమిషన్ చైర్మన్ మహమ్మద్ వహీద్ లతో కలిసి సంక్షేమ శాఖల అధికారులు, పోలీసు, కార్మిక, విద్య, వైద్య-ఆరోగ్య, పౌర సంబంధాల శాఖల అధికారులతో ఆపరేషన్ స్మైల్ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడి వారికి మంచి భవిష్యత్తును అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకో వాలని తెలిపారు. బడి బయట పిల్లలు, మధ్యలో బడి మాని వేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి పాఠశాలలో చేర్పిం చాలని తెలిపారు. కార్మిక శాఖల అధికారులు బృంద సభ్యుల తో కలిసి పరిశ్రమలు, దుకాణాలు, నిర్మాణ ప్రాంతాలు ఇతర ప్రదేశాలను




సందర్శించి బాల కార్మికులను గుర్తించాలని తెలిపారు. 14 సం?లలోపు వయసు కలిగి బాల కార్మికులు పని చేస్తున్నట్లుగా గుర్తించినట్లయితే సంబంధిత సంస్థల యాజమాన్యంపై కేసులు నమోదు చేసి, బాధిత బాలలకు నష్టపరిహారం అందించాలని తెలిపారు. బాల్యవివాహాలను నిర్మూలించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే తెలిస్తే సంబంధిత అధికా రులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి



వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. గుర్తించబడిన బాల కార్మికులకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లాలో ఆపరేషన్ స్మైల్ నిర్వహించడం జరుగుతుం దని, ఇటుక బట్టీలలో పనిచేసే వారి పిల్లలను పాఠశాలలో చేర్పించడం, అవసరమైన పుస్తకాలను అందించడం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్. దుర్గాప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత, బాలల పరిరక్షణ కమిటీ అధికారి ఆనంద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో ఏకంగా 12 మార్లు కంపించిన భూమి

- భయంతో పరుగులు తీసిన జనాలు



**గాంధీనగర్, జనవరి 9 (జనంసాక్షి) :** గుజరాత్‌లో ఏకంగా 12 మార్లు భూమి కంపించడం కలకలానికి దారి తీసింది. గంటల వ్యవధిలోనే పలుమార్లు భూమి కంపించడంతో ఏం జరుగుతోందో అర్థంకాక జనాలు ఇళ్లల్లోంచి బయటకు పరుగులు చేశారు. రాజ్‌కోట్ జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకూ పలుమార్లు భూమి కంపించింది. వీటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.6-3.8 మధ్య నమోదైంది. ఉప్లేటా, ధోరాజీ, జెత్‌పూర్ తాలూకాల్లో ఈ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. గురువారం రాత్రి 8.42 గంటల ప్రాంతంలో తొలిసారి భూమి కంపించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూకంప కేంద్రం ఉప్లేటా టౌన్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. దీంతో, పరిసరాల్లోని మూడు తాలూకాల్లో ప్రజలు భయకంపితులు అయ్యారు. ఏం జరుగుతోందో అర్థంకాక ఇళ్లల్లోంచి పరుగులు తీశారు. భారీ కట్టడాలు ఏవీ లేని మైదాన ప్రాంతాలకు పరుగు తీశారు. అయితే, ఈ ప్రకంపనల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. పాత భవనాల్లో నిర్వహిస్తున్న స్కూళ్లు, కాలేజీలకు జిల్లా యంత్రాంగం ముందుజాగ్రత్త చర్యగా సెలవు ప్రకటించింది. ఇలా వరుస పెట్టి స్వల్పస్థాయి భూప్రకంపనలు సంభవించడాన్ని స్వార్మ్ టైప్ భూకంపంగా పిలుస్తారని అధికారులు చెబుతున్నారు. భూమి పొరల్లో అప్పటికే ఉన్న చీలికల మధ్యకు నీరు చేరి ఒత్తిడి తీవ్రమైనప్పుడు ఇలా భూమి పలుమార్లు కంపిస్తుందని వివరించారు. స్వార్మ్ టైప్ భూకంపాలు సంభవించినప్పుడు ఎలాంటి ప్రమాదం ఉండదని కూడా తెలిపారు.

# మహిళలు, చిన్నారుల భద్రత కోసం చర్యలు

- దాడులతో పలువురు బాలలకు విముక్తి
- సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్

**హైదరాబాద్, జనవరి9 (జనంసాక్షి) :** మహిళలు, చిన్నారుల భద్రత కోసం సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఈ వారం పలు విస్తృత చర్యలు చేపట్టామని డీసీపీ సృజన కరణం తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కేసులు నమోదు చేసి 215 మంది పిల్లలను, అంటే 200 మంది బాలురను మరియు 15 మంది బాలికలను విజయవంతంగా రక్షించగలిగారు. సైబరాబాద్ షీ టీం బృందాలు ఈ వారంలో మొత్తం 127 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 59 మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో 63 ఖ।బిబా కేసులు నమోదు కాగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ చేశారు. అదేవిధంగా, మహిళల నుండి అందిన 17 ఫిర్యాదులను షీ టీం బృందాలు స్వీకరించాయన్నారు. భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ సమస్యలను పరిష్కరించే దిశగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు కేంద్రాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా 31 కుటుంబాలను తిరిగి కలిపి, వారి కుటుంబాల్లో వెలుగులను నింపారు. సైబరాబాద్ పరిధిలో వివిధ ప్రాంతాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం బృందాలు మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మహిళలను వేధించడం, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, మహిళలను నిరంతరం వెంబడించడం, భిక్షాటన, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. మొత్తం 6,615 మందికి అవగాహన కల్పించామన్నారు. అలాగే మహిళల హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100, నేరాల నివారణ కోసం 1930 వంటి సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించామన్నారు.

# సంక్రాంతికి ఊరెళ్లేవారు జాగ్రత్తలు

- పోలీసుల ముందస్తు హెచ్చరిక




**హైదరాబాద్, జనవరి9 (జనంసాక్షి) :** సంక్రాంతి తెలుగు ప్రజల పెద్దపండుగ అని, ముఖ్యంగా ఆంధ్రకు వెళ్లేవారు ఎక్కువగా ఉంటారని పోలీస్ అధికారులు అన్నారు. సంక్రాంతి సెలవులకు ఊరు వెళ్తున్న వారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇంట్లో విలువైన వస్తువులు, ఆభరణాలు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాటికి విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎవరైతే ఉరికి వెళున్నారో చుట్టు పక్కల వారికి చెప్పాలని, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కూడా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా పెట్రోలింగ్ చేస్తామని తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దింపామని తెలిపారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్‌తో పాటు అలారం కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# అదేపనిగా నెహ్రూపై విమర్శలు తగవు

- భారత ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడు పండిట్
- జవహర్‌లాల్ నెహ్రూ పై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు



**తిరువనంతపురం, జనవరి 9 (జనంసాక్షి) :** కాంగ్రెస్ విధానాలను విమర్శిస్తూ బీజేపీకి దగ్గరవుతున్నారంటూ కొంతకాలంగా విమర్శలను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ తాజాగా భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నెహ్రూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడని కొనియాడారు. అయితే నెహ్రూపై తన అభిమానం గుడ్డిది కాదని అన్నారు. నెహ్రూ పొరపాట్లు చేసి ఉండొచ్చని, అయితే దేశంలోని అన్ని సమస్యలకూ ఆయనే కారణమంటూ నిందించడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. నెహ్రూ వారసత్వంపై బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై కేరళ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఇంటర్నేషన్ బుక్ ఫెస్టివల్‌లో లో శశిథరూర్ మాట్లాడారు. 'నేను నెహ్రూ అభిమానిని. అయితే ఆయన నమ్మకాలు, విధానాలన్నింటికీ గుడ్డిగా తలాడించను. ఆయన ఆలోచనా దృక్పథం ప్రశంసనీయమైంది. ఆయన తీసుకున్న అనేక చర్యలు ప్రశంసలకు అర్హమైనవి. ముఖ్యంగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఆయన దృఢంగా నెలకొల్పారు. అలా అని వారు (మోదీ ప్రభుత్వం) ప్రజాస్వామి వ్యతిరేకులని కాదు. అయితే నిశ్చయంగా వారు నెహ్రూ వ్యతిరేకులు. సమస్య ఏదైనా నెహ్రూను వారు విమర్శలు చేస్తూనే ఉన్నారు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఇండియా-చైనా మధ్య 1962లో జరిగిన యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, కొన్ని కేసుల్లో మోదీ ప్రభుత్వం విమర్శలకు ఆధారాలుండవచ్చని, ఆ యుద్ధంలో చైనాపై ఓటమికి నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు కారణం కావచ్చని అన్నారు. అయితే సమస్య ఏదైనా ప్రతిదానికి వాళ్లు నెహ్రూను నిందించడం మాత్రం సరికాదని అన్నారు. చయితగా తన జర్నీని ప్రస్తావిస్తూ, చిన్నప్పుడు ఆస్తమా కారణంగా తాను పుస్తకాలు చదవడాన్ని ఎక్కువగా ఇష్టపడేవాడినని, అప్పుడు టెలివిజన్ కానీ, మొబైల్ ఫోన్లు కానీ లేవని, పుస్తకాలే తన సహచరులని థరూర్ చెప్పారు. చాలా చిన్నప్పుడే తాను తొలి నవల రాశానని, అయితే సిరా ఒలికపోవడంతో ఆ పుస్తకాన్ని కోల్పోయానని తెలిపారు. శ్రీ నారాయణ్ గురు బయోగ్రఫీ తన 28వ పుస్తకమని చెప్పారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో పుస్తక పఠనం తగ్గిపోయిందని, కానీ కేరళలో మాత్రం రీడింగ్ కల్చర్ కొనసాగుతోందన్నారు.

# పరిహారం కోసం పరిహాసం!

- డేంజర్ జోన్‌లో పెరుగుతున్న కొత్త ఇండ్లు
- వ్యవసాయ క్షేత్రాల్లో నిర్మాణాలు
- సింగరేణి పరిహారం కోసం కొత్త వ్యూహాలు
- గడ్డిగానిపల్లి శివారులో వెలుగు చూసిన వైనం





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** ప్రభుత్వం నిరుపేదలకు కట్టించే తరహాలో ఓ ఊరు శివారు వ్యవసాయ క్షేత్రాల్లో కొత్త ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.. ఖరీఫ్ సీజన్ లో వరిపంటలు పండించి పంట చేతికి రావడం ముగిసింది.. ఇక ఆ క్షేత్రాల్లో ప్రస్తుతం పుట్ట గొడుగుల్లా ఇండ్లు వెలుస్తున్నాయి.. వారి భూముల్లో వారు ఇండ్లు నిర్మించుకుంటున్నారు తప్పేంటి అనే అనుమానం అందరికి రావచ్చు.. కాని అది డేంజర్ జోన్ సింగరేణి సంస్థ సర్వే చేసి, పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకునే భూమి.. సింగరేణి కింద పోయే ఈ భూముల్లో ఒక్కసారిగా ఇండ్ల నిర్మాణాలు పెరిగిపోతుండడం ఆశ్చర్యకరంగా మారింది.. పరిహారం కాస్త పరిహాసంగా మారిందనే చర్చలు స్థానికంగా వినిపిస్తున్నాయి..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డులో గల గడ్డిగానిపల్లిలో నూతన ఇండ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. సింగరేణి సంస్థకు చెందిన కెటికె 1ఇంక్లైన్, ఓపెన్ కాస్ట్ - 2 మధ్యలో సంస్థ భూసేకరణ సర్వే చేపట్టింది. గడ్డిగానిపల్లి గ్రామం కూడా సింగరేణి పరిధిలోకి వెళ్తుండడంతో గత వారం రోజుల్లోనే ఏక కాలంలో సుమారు యాభైకి పైగా ఇండ్ల నిర్మాణాలు పనులు చేపట్టారు. స్థానికులతో పాటు స్థానికేతరులు కూడా యథేచ్ఛగా ఈ డేంజర్ జోన్ లో ఇండ్ల నిర్మాణాలు చేపట్టి ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. ఇంకొందరు తమ వ్యవసాయ భూములను గుంటకు రూ.లక్ష చొప్పున విక్రయిస్తూ కొత్త వ్యూహాలకు తెరలేపారు. ఓ వైపు సింగరేణిలో భూములు పోతున్నాయంటే.. మరో వైపు ఇండ్ల నిర్మాణాలను యథేచ్ఛగా చేపట్టడం వెనుక అసలు మతలబు వేరే ఉన్నట్లు స్థానికులు గుసగుసలాడుతున్నారు. కేటికే 1ఇంక్లైన్, ఓపెన్ కాస్ట్ 2 కోసం సింగరేణి భూ సేకరణ చేస్తుండటంతో దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే తరహాలో రాత్రికి రాత్రి వందల కొద్ది అక్రమ నిర్మాణాలు చేపడితే అప్పటి కలెక్టర్ స్పందించి తొలగించేశారు. కానీ మళ్ళీ భూ సేకరణ ప్రక్రియ తెరమీదికి రావడంతో పంటపొలాలను గృహ నిర్మాణ స్థలాలుగా చేస్తున్నారు. సింగరేణి పునరావాస ప్యాకేజీ కింద ఎక్కువ మొత్తంలో లబ్దిపొందాలని చూస్తున్నారనే చర్చలు వినవస్తున్నాయి.

### అసలు మతలబు ఏమిటంటే..?

సింగరేణి సంస్థ స్థానిక భూ నిర్వాసితుల పంటపొలాల భూములకు ఎకరానికి సుమారు రూ.22 లక్షలు చెల్లిస్తుంది. అదే ఇంటి నిర్మాణాలు ఉన్న ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ గజానికి సుమారు రూ.6 వేల చొప్పున చెల్లిస్తుంది. ఇదే అదునుగా భావించిన భూ యజమానులు తమ వ్యవసాయ భూముల్లో తమ కుటుంబ సభ్యులందరికీ సరిపడా వేర్వేరు ఇండ్ల నిర్మాణం చేపట్టి, మిగతా భూమిని గుంటకు రూ.1 లక్ష చొప్పున ఇతరులకు విక్రయిస్తున్నారు. ఆర్ అండ్ ఆర్ (పునరావాస) ప్యాకేజీ పొందేందుకు భూమి కొనుగోలు చేసిన స్థానికులు, స్థానికేతరులు కూడా యుద్ధ ప్రాతిపదికన ఇంటి నిర్మాణాలు చేపట్టి వారం రోజుల్లోనే పూర్తి చేస్తున్నారు. మున్సిపాలిటి పరిధిలో జోరుగా సాగుతున్న ఈ కొత్త ఇండ్ల నిర్మాణాల విషయం తెలిసినా సింగరేణి, మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల అనేక అనుమానాలు వెలువడుతున్నాయి. డేంజర్ జోన్ లో నిర్మిస్తున్న ఆ కొత్త ఇండ్ల కట్టడాల వెనుక అధికారుల హస్తం కూడా ఉండి ఉంటుందనే ఆరోపణలు స్థానికంగా గుప్పుమంటున్నాయి. ఏది ఏమైనా పెద్ద మొత్తంలో పరిహారం కాజేసేందుకు వ్యవసాయ క్షేత్రాల్లో చేపట్టిన ఈ కొత్త ఇండ్ల నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

# అలాస్కా టూర్‌కు వెళ్లిన విద్యార్థి అదృశ్యం

- పది రోజులయినా జాడ తెలియక ఆందోళన
- దర్యాప్తు చేపట్టిన అమెరికా పోలీసులు

**గుంటూరు, జనవరి 9 (జనంసాక్షి) :** గుంటూరుకు చెందిన హరి కృష్ణారెడ్డి కరసాని అమెరికాలోని అలాస్కా రాష్ట్రంలో అదృశ్యమవడం కలకలం రేపుతోంది. ప్రకృతి అందాలను ఆస్వాదించాలని వెళ్లిన తెలుగు విద్యార్థి కనిపించకుండా పోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లా అద్దంకికి చెందిన హరి కృష్ణారెడ్డి హ్యూస్టన్‌లో ఉంటున్నారు. క్రిస్మస్ సెలవులు రావడంతో అలాస్కాకు వెళ్లాలని అనుకున్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 22న ఒంటరిగానే హరి అలాస్కా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. డెనాలి సమీపంలోని ఓ హోటల్‌లో బస చేశారు. తాను అలాస్కా పర్యటనకు వెళుతున్నానని.. జనవరి 3 లేదా 4న తిరిగి వస్తానని తన రూమ్మేట్స్‌కు చెప్పారు. ఒంటరిగా అలాస్కా వెళ్లిన తెలుగు విద్యార్థి.. డిసెంబర్ 30న తన స్నేహితులతో చివరిసారిగా మాట్లాడారు. డిసెంబర్ 31 నుంచి అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ అయినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 31నే హరి హోటల్ నుంచి చెక్ అవుట్ అయినట్లు సమాచారం. హరికి డ్రైవింగ్ రాకపోవడంతో ఎక్కడి వెళ్లినా క్యాబ్ సర్వీస్‌ను ఉపయోగిస్తుంటారు. లేదా స్థానిక రవాణాపైనే ఆధారపడాల్సి వచ్చేది. ఈ క్రమంలో డిసెంబర్ 31న హోటల్ నుంచి బయటకు వచ్చిన హరి.. క్యాబ్ సర్వీస్ వాడినట్లు తెలుస్తోంది. దీంతో హరి ఆ క్యాబ్‌లో ఎక్కడికి వెళ్లారు?.. క్యాబ్ డ్రైవర్ ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అంతేకాకుండా ఈ కేసులో హరి క్రెడిట్ కార్డ్ లావాదేవీలు కూడా కీలకంగా మారాయి. వారం రోజులుగా హరి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు భయాందోళనకు గురవుతున్నారు. హరి గురించి ఎలాంటి సమాచారం లేకపోవడం, ఫోన్ కలవకపోవడంతో పాటు సోషల్ మీడియాలో కూడా యాక్టివిటీ ఆగిపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అమెరికాలోని స్థానిక పోలీసులు, తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు.. హరి కోసం గాలిస్తున్నారు. 'ఒకవైపు తీవ్రమైన మంచు తుఫాన్, మరోవైపు మైనస్ 40 డిగ్రీల చలి.. ఈ పరిస్థితుల్లో హరి క్షేమంగా తిరిగి రావాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాం' అని ఆయన స్నేహితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక.. అలాస్కాలో ఉష్ణోగ్రతలు మైనస్ 40 డిగ్రీల ఫారెన్‌హీట్‌కు పడిపోయాయి. ఇలాంటి వాతావరణంలో కొన్ని నిమిషాల పాటు బయట ఉన్నా శరీరం గడ్డకట్టడం, హైపోథెర్మియా వంటి ప్రాణాం తక స్థితికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా అలాంటి ప్రదేశంలో సరైన నెట్‌వర్క్ ఉండదు. ఇటువంటి పరిస్థితుల్లో ఒంటరిగా ప్రయాణిస్తే సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక ఇతరుల సహాయం కోరడం కూడా కష్టతరంగా మారే అవకాశం ఉంటుంది. హరి అదృశ్య ఘటన విదేశాల్లో ఉన్న భారతీయ విద్యార్థులకు ఒక హెచ్చరికగా మారింది. ముఖ్యంగా చలి ఎక్కువగా ఉండే ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, ఒంటరి ప్రయాణాలు చేయవద్దని, ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు లోకేషన్లు షేర్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# రాజ్యసభలో జూన్‌లో ఐదు ఖాళీలు

### తెలంగాణలో ఇద్దరు, ఏపిలో ముగ్గురు రిటైర్

**న్యూఢిల్లీ, జనవరి 9 (జనంసాక్షి) :** ఈ ఏడాది రిరైట్ అవుతున్న రాజ్యసభ సభ్యుల జాబితాను శుక్రవారం రాజ్యసభ సచివాలయం విడుదల చేసింది. తెలంగాణలో భారాస సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్‌మను సింఘ్వీ ఏప్రిల్ 9న రిటైర్ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వైకాపా ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, తెదేపా సభ్యుడు సానా సతీష్‌ల పదవీకాలం ఈ ఏడాది జూన్‌తో ముగుస్తుందని రాజ్యసభ సచివాలయం తెలిపింది. ఈమేరకు అన్ని రాష్ట్రాల సభ్యుల పదవీకాలం వివరాలను వెల్లడించింది.

# చైనా మంజా తగిలి బాలుడికి తీవ్ర గాయాలు

**జగిత్యాల, జనవరి 9 (జనంసాక్షి) :** చైనా మాంజా తగిలి బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మెట్‌పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని దుబ్బవాడలో శ్రీహన్ గురువారం సాయంత్రం ఇంటిముందు ఆడుకుంటున్నాడు. ఇంతలో చైనా మాంజా వచ్చి మెడకు చుట్టుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెడ భాగంలో తీవ్రంగా కోసుకుపోవడంతో ప్రాథమిక చికిత్స అనంతరం బాలుడిని నిజామాబాద్‌కు తరలించారు. అక్కడ బాలుడు చికిత్స పొందుతున్నాడు. మెడ చుట్టు సుమారు 20 కుట్లు వేసినట్లు సమాచారం.


# శబరిమల బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం

### ఆలయ ప్రధాన పూజారి కందరారు రాజీవరు అరెస్ట్

**తిరువనంతపురం, జనవరి9 (జనంసాక్షి) :** కేరళలోని శబరిమల ఆలయంలో బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆలయ ప్రధాన పూజారి కందరారు రాజీవరును సిట్ అధికారులు తాజాగా అరెస్టు చేశారు. పలు నివేదికల ప్రకారం.. బంగారు తాపడాల చోరీ కేసులో ఆయన పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా పలువురు సిట్ అధికారులు మాట్లాడుతూ.. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో సిట్ అధికారుల బృందం ఆయన్ను అదుపులోకి తీసుకుందని వివరించారు. విచారణ అనంతరం శబరిమల ఆలయ ప్రధాన పూజారి కందరారు రాజీవరును అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో రాజీవరుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. నిజానికి శబరిమలకు ఉన్ని కృష్ణన్ పొట్టిని తీసుకువచ్చింది కూడా తంత్రి కందరారు రాజీవరేనని ఇతర నిందితులు తమ వాంగ్మూలంలో తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. బంగారు తాపడాల చోరీ గురించి ఆయనకు ఫస్ట్ నుంచే సమాచారం ఉందని తెలిపారు. ఈ చోరీపై ఈడీ కేసు ఫైల్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 2019లో కేరళలోని శబరిమల ఆలయం గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను మరమ్మతుల నిమిత్తం తొలగించారు. ఉన్ని కృష్ణన్ అనే దాత వాటిని సరిచేయించి కొత్త బంగారు పూత తాపడా లను అందిస్తానని తీసుకెళ్లారు. ఆ టైంలో ఈ పనిని పూర్తి చేయడానికి చెన్నైలోని ఓ కంపెనీకి ఇచ్చారు. ఆ రాగ తాపడాలను తొలగించే టైంలో రికార్డుల్లో వాటి బరువును 42.100 కిలోలుగా పేర్కొన్నారు. అయితే ఎలక్ట్రోప్లేటింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత వాటిపై ఉండే బంగారంలో కొంత కనిపించ కుండా పోయిందని ఆ కంపెనీ వెల్లడించింది. ఇందులో ఏదో తిరకాసు జరిగినట్లు అధికారులు గుర్తించి, విచారణ చేపట్టారు. ఈ కేసు విచారణలో ఉన్ని కృష్ణన్ సహా పలువురు ప్రధాన అధికారులు నిందితులుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# కెసిఆర్ కుటుంబానికి విదేశాల్లో భారీ పెట్టుబడులు

- దాదాపు 30 వేల ఎకరాల భూములు దోచుకున్న ఘనులు
- పీసీసీ తెలంగాణ జనరల్ సెక్రెటరీ గజ్జెల కాంతం సంచలన ఆరోపణలు




**హైదరాబాద్, జనవరి 9 (జనంసాక్షి) :** కేసీఆర్ కుటుంబం అమెరికాలో రూ.40 వేల కోట్లు, దుబాయ్‌లో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందని పీసీసీ తెలంగాణ జనరల్ సెక్రెటరీ గజ్జెల కాంతం సంచలన ఆరోపణలు చేశారు. దాదాపు 30 వేల ఎకరాల భూములు దోచుకున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఇవన్నీ అబద్దాలని తన కొడుకుపై ప్రమాణం చేయగలరా అని గజ్జెల కాంతం నిలదీశారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పీగజ్జెల కాంతం సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. దుబాయ్‌లో తన బినామీని చంపితే ఆధారాలు పోతాయని కేటీఆర్ భ్రమపడ్డారని గజ్జెల కాంతం ఆరోపించారు. నాలుగు రాష్ట్రాల్లో కేటీఆర్ మకాం వేసేవారని తెలిపారు. 2022 జనవరి 24న ఒక హీరోయిన్‌కు కేటీఆర్ రూ.100 కోట్లు ఇచ్చారని.. ఒక కాంట్రాక్టర్, జ్యువెలరీ షాప్ యజమాని అకౌంట్ నుంచి ఆ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేయించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ముంబైలోని తాజ్ కృష్ణా హోటల్ 328వ గదికి ఒక హీరోయిన్‌ను పిలిపించి, రూ.35 కోట్ల 75 లక్షలతో విల్లా కొనిచ్చారని, ఆడి కారు కూడా బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. 2022 మార్చి 3న ఢిల్లీలోని లలిత్ హోటల్ 770వ గదికి.. మైసూర్‌లో షూటింగ్ చేస్తున్న హీరోయిన్‌ను బెదిరించి పిలిపించు కున్నారని, రూ.50 కోట్లు ఇస్తానని బెదిరింపులకు పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్‌కు ఎన్టీఆర్, చంద్రబాబు రాజకీయ భిక్ష పెట్టారని.. దొంగ పాస్‌పోర్టులు సృష్టించిన చరిత్ర కేసీఆర్‌దేనని గజ్జెల కాంతం విరుచుకుపడ్డారు. ఎన్నికల కోసం జగన్‌కు రూ. 200 కోట్లు.. మహారాష్ట్ర, బీహార్, పంజాబ్, ఢిల్లీకి కోట్లాది రూపాయలను కేసీఆర్ పంపారన్నారు. అఖిలేష్ యాదవ్, కుమారస్వామికి కేటీఆర్ డబ్బులు పంపారని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా, రాహుల్‌పై కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం వల్లే కేటీఆర్ మంత్రి అయ్యారని, రాహుల్ కాలి గోటికి కూడా కేటీఆర్ సరిపోరని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందని, కేటీఆర్ కుటుంబం ఏం త్యాగం చేసిందని గజ్జెల కాంతం ప్రశ్నించారు. చట్టాలు, రాజ్యాంగంపై కేటీఆర్‌కు గౌరవం, జ్ఞానం లేదని, చరిత్ర తెలియదని విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదని.. కేటీఆర్ లాగా రాహుల్, రేవంత్‌లు దోచుకోలేదని గజ్జెల కాంతం పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370